thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 190 కరీంనగర్ బుధవారం, 17 సెప్టెంబర్ 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## చైనా సరికొత్త హైడ్రోజన్ బాంబు

న్యూఢిల్లీ : అణ్వస్త్రాల తరహాలో కాకుండా సాధారణ బాంబుల్లోనే అత్యధిక విధ్వంసం సృష్టించగల హైడ్రోజన్ బాంబును చైనా విజయవంతంగా పరీక్షించింది. ఏకంగా 1000 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతను వెలువరిస్తూ, కొన్ని సెకన్ల పాటు అగ్ని గోళం (ఫైర్ బాల్) నిలిచి ఉండే ఈ బాంబులతో.. తీవ్రమైన విధ్వంసం జరగడమే కాదు అల్యూమినియం అల్లాయ్ వంటి లోహాలు కరిగి, రక్షణ పరికరాలు, సామగ్రి దెబ్బతింటాయని చెబుతున్నారు. చైనా చేసిన ఈ ప్రయోగాత్మక పరీక్ష వివరాలతో సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ పత్రిక తాజాగా కథనాన్ని ప్రచురించింది. చైనా షిప్ బిల్డింగ్ కార్పొరేషన్ పరిధిలోని '705 రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్' ఈ హైడ్రోజన్ బాంబు పరీక్షను నిర్వహించినట్టు తెలిపింది.

## తెలంగాణ రైతు సంక్షేమం దేశం మొత్తానికి ఆదర్శం: తుమ్మల



ఢిల్లీ, సెప్టెంబరు16 : రైతులందరికీ ఉపయోగపడే విధంగా స్కీములన్నిటిని ఒకే గొడుగు కిందకు కేంద్ర ప్రభుత్వం తీసుకు రావాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. దేశ రైతాంగానికి ఉపయోగపడే పాలసీలను రూపొందించే కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ని ఈ సందర్భంగా అభినందిస్తున్నానని పేర్కొన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. ఇవాళ నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ అగ్రికల్చర్ రబీ క్యాంపెయిన్ – 2025ను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆధ్వర్యంలో పలు రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రులు, కార్యదర్శులు, వ్యవసాయ శాఖ నిపుణులతో నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. రైతును ఏ రకంగా కాపాడాలి, రైతు ఆదాయాన్ని ఏ రకంగా పెంచాలి, భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఈ సమావేశంలో చర్చించారు.

**పామాయిల్ సాగులో తెలంగాణ ముందంజ..**

ఈ సమావేశంలో కొన్ని అంశాలపై ప్రస్తావించడం జరిగిందని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. 1960లో చేసిన విత్తన చట్టం ఇప్పటికీ కొనసాగుతోందని చెప్పుకొచ్చారు. ఇప్పటివరకు ఈ అంశాన్ని ఎందుకు పునః పరిశీలించలేదని ప్రశ్నించారు. దానివల్ల విత్తన కంపెనీలు దగా, మోసం చేసిన రైతులు నష్టపోయిన ఏ మాత్రం వెసులుబాటు లేదని తెలిపారు. రానున్న పార్లమెంట్ సమావేశాల్లో నూతన విత్తన చట్టాన్ని, భారత రైతాంగానికి శ్రేయస్సు చేకూర్చే విధంగా అంగీకరించాలని సూచించారు. భారతదేశంలోనే ఎక్కువ ఎకరాల్లో పామాయిల్ సాగుచేసే రాష్ట్రంగా తెలంగాణ ముందంజలో ఉందని ఉద్ఘాటించారు. పామాయిల్‌పై విధించిన ఇంపోర్ట్ ట్యాక్స్‌ను పెంచి భారత రైతులకు ఆయిల్ ఫామ్ వ్యవసాయానికి ఉపయోగపడే విధంగా చేయాలని ఆకాంక్షించారు. వ్యవసాయానికి సంబంధించి కేంద్రంలో అనేక స్కీంలు అమల్లో ఉన్నాయని పేర్కొన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.

## బలహీనపడిన అల్పపీడనం..

## ఈ జిల్లాల్లో భారీ వర్షాలు...




బంగాళాఖాతంలో అల్పపీడనంతో తెలుగు రాష్ట్రాల్లో వరుణుడు మళ్లీ విరుచుకుపడుతున్నాడు. పలు జిల్లాల్లో కుండపోత వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి.. దీంతో పలు ప్రాంతాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో వర్షాలపై వాతావరణ శాఖ కీలక అప్డేట్ ఇచ్చింది.. అల్పపీడనం బలహీనపడిందని.. దీని ప్రభావతంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. అల్పపీడనం తూర్పు తెలంగాణ సమీపంలోని విదర్భ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనంగా కొనసాగుతుంది.. సముద్రమట్టం నుండి 3.1 కి మీ ఎత్తువరకు కొనసాగుతూ.. ఉపరితల ఆవర్తనం ఎత్తు పెరిగే కొద్దీ నైరుతి దిక్కుకి వాలి ఉందని పేర్కొంది.. వీటి ప్రభావంతో తెలంగాణలో బుధవారం భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం పేర్కొంది. ఈ రోజు తెలంగాణలోని ఆదిలాబాద్, నిర్మల్, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నారాయణపేట జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. బుధవారం సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాలలో అక్కడక్కడ భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. బుధవారం తెలంగాణలోని అన్ని జిల్లాలలో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ఏపీలోని వచ్చే నాలుగు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మంగళవారం కడప, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి.. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, అల్లూరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని APSDMA ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.




## మధు యాష్కీ గౌడ్‌కు అస్వస్థత..

## సెక్రటేరియట్‌లో షాకింగ్..

హైదరాబాద్: మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్ అస్వస్థతకు గురయ్యారు. సెక్రటేరియట్‌లో మంత్రి శ్రీధర్ బాబును కలవడానికి వెళ్లిన ఆయన ఉన్నట్టుండి ఛాంబర్‌లో కళ్ళు తిరిగి పడిపోయారు. వెంటనే అప్రమత్తమైన మంత్రి శ్రీధర్ బాబు సిబ్బందిని అలర్ట్ చేశారు. హుటాహుటినా మధు యాష్కీనీ చికిత్స నిమిత్తం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ సంఘటనపై కుటుంబ సభ్యులు, పార్టీ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తూ ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నారు.




## విలీనమా..... విమోచనమా..?

నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన వారిని సత్కరించడం, కీలక ఘట్టాలకు ఆనవాళ్లైన ప్రాంతాల సందర్శన లాంటి కార్యక్రమాలను చేపట్టబోతోంది కమలం పార్టీ. అంతేకాదు అన్ని జిల్లాల నుంచి ప్రజలను విమోచన దినోత్సవ వేడుకలకు తీసుకొచ్చేలా ప్లాన్ కూడా చేసింది. ఈ వేడుకలను

## తెలంగాణ రాజకీయాల్లో కాకరేపుతోన్న సెప్టెంబర్ 17

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయం ప్రస్తుతం సెప్టెంబర్ 17వ తేదీ చుట్టూ తిరుగుతోంది. విలీనమా..? విమోచనమా.. అంటూ మరోసారి సెప్టెంబర్ 17పై రాజకీయ రచ్చ కొనసాగుతోంది. ఇది కచ్చితంగా తెలంగాణ విమోచన దినోత్సవమే అని బీజేపీ వేడుకలకు రెడీ అయింది. కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖ ఆధ్వర్యంలో రెండేళ్లుగా రాష్ట్ర విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తున్న బీజేపీ.. మరోసారి ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

సికింద్రాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఆర్మీ కవాతు, సాంస్కృతిక నృత్యాలతో మూడో ఏట కూడా వైభవంగా హైదరాబాద్ లిబరేషన్ డే నిర్వహించేందుకు అంతా సిద్ధమైంది. ముఖ్య అతిథిగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ రాబోతున్నారు.

**సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విమోచనే పుస్తకం ఆవిష్కరణ...** గ్రామ గ్రామాన సెప్టెంబర్ 17న జాతీయ జెండాలు ఎగురవేయించి, విమోచన దినోత్సవ చరిత్రను తెలిపే వర్చువల్ మ్యూజియంను ప్రజలకు చూపించాలని కేడర్‌కు బీజేపీ పిలుపునిచ్చింది. సెప్టెంబర్ 17 ముమ్మాటికీ విమోచనే అనే పుస్తక ఆవిష్కరణ చేశారు మాజీ గవర్నర్ విద్యాసాగర్.

**పుస్తకావిష్కరణ, ఫోటో ఎగ్జిబిషన్లతో పెద్ద ఎత్తున కార్యక్రమాలు...** బీజేపీ నేత గూడురు నారాయణరెడ్డి తీసిన రజాకార్ , జాతీయవాద భావాలున్న కవులు రాసిన విమోచన దినోత్సవ అంశాల పుస్తకావిష్కరణ, ఫోటో ఎగ్జిబిషన్లతో బీజేపీ పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తోంది. అటు బీఆర్ఎస్‌గానీ, ఇటు కాంగ్రెస్‌గానీ.. నిర్వహించడం లేదనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్లాన్ చేస్తోంది కాషాయపార్టీ. సెప్టెంబర్ 17పై బీజేపీ నేతలు వక్రభాష్యం చెబుతున్నారని విమర్శించారు సీపీఐ నేత నారాయణ. తెలంగాణ గవర్నర్ బీజేపీకి చప్రాసీలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. సెప్టెంబర్ 17 గురించి మాట్లాడే హక్కు బీజేపీకి లేదన్నారు కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్. సెప్టెంబర్ 17 విమోచనం కాదు..విలీనమే అన్నారు.

విమోచం, విలీనం ఇలా రకరకాల పేర్లతో సెప్టెంబర్ 17 పొలిటిక్ సర్కిల్స్‌లో హాట్ హాట్‌గా మారుతుంటుంది.

## భారత్‌పై విషం చిమ్ముతున్న ట్రంప్!

## ఎందుకు ట్రంప్‌కు భారత్‌పై ద్వేషం, చైనాపై ప్రేమ!




## భారత్‌ను ఇరుకున పెట్టేలా ట్రంప్ చేష్టలు!!

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న భారత్ వ్యతిరేక చేష్టలు తారాస్థాయికి చేరుతున్నాయి. తనకు తాను 'శాంతి దూత'గా పదే పదే చెప్పుకుంటున్న ట్రంప్.. ఇప్పుడు భారత్ పై విషం కక్కుతూ, మన దాయాది దేశాలైన చైనా, పాకిస్థాన్ లపై విపరీతమైన ప్రేమ ఒలకబోస్తూ ఆయా దేశాల్ని దువ్వుతున్నారు. ఇటీవల ప్రపంచ దేశాలపై పెద్ద ఎత్తున ట్రేడ్ టారిఫ్స్ విధించిన అమెరికా అధ్యక్షుడు.. చైనా దగ్గర తన పప్పులు ఉడక్కపోవడంతో చచ్చినట్టు ఆదేశంతో కాళ్ల బేరానికి దిగారు. ఇప్పుడు మరింత దిగజారి చైనాపై టారిఫ్స్ తగ్గిస్తూ, భారత్ మీద భారీగా సుంకాలు, జరిమానాలు పెంచుతూ కొత్త డ్రామాకు తెరతీస్తున్నారు. భారత్ – పాకిస్థాన్ యుద్ధాన్ని తానే ఆపానంటూ అనేక సార్లు ప్రకటించుకున్నారు డోనాల్డ్ ట్రంప్. అయితే, భారత్ దీనిని ఖండించడంతో.. మాట మార్చి తన పాత్రేమీ లేదంటూ ఒకటి రెండు సార్లు వివరణ ఇచ్చారు. అయితే, మళ్లీ పాత పాటే పాడుతూ తన వల్లే యుద్ధం ఆగిందంటూ చాలా మార్లు ప్రకటించారు. అయితే, ఆపరేషన్ సిందూర్‌ను నిలిపివేసిన ఘనతను ఎప్పుడూ డోనాల్డ్ ట్రంప్ కు ఇవ్వలేదు భారత్. ఇది ట్రంప్ ఆగ్రహానికి ఒక కారణంగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక, తక్షణ కారణంగా రష్యాతో భారత్ నెరుపుతున్న వాణిజ్య సంబంధాల్ని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు.

రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లను ఆపాలని ట్రంప్ ఆదేశిస్తున్నారు. భారత్ ఇస్తున్న డబ్బుతోనే రష్యా.. ఉక్రెయిన్ తో యుద్ధం చేయగలుగుతోందంటూ ట్రంప్ ఆరోపిస్తున్నారు. దీని వల్లే భారత్ మీద 50 శాతం సుంకాలు, జరిమానాలు విధిస్తున్నట్టు చెప్పుకొస్తున్నారు. భారత్ ను ఆడిపోసుకుంటూ.. ఇదే సమయంలో చైనాపైన సుంకాలు తగ్గిస్తున్నట్టు రోజుకో రకమైన ప్రకటనలు చేస్తూ ఇప్పుడు చైనా ప్రేమకోసం ఉవ్విళ్లూరుతున్నారు ట్రంప్.

మరోవైపు, 'అమెరికా ఫస్ట్' విధానాన్ని హైలైట్ చేస్తూ.. భారతదేశం.. అమెరికా మీద ఎక్కువ సుంకాలు (52% వరకు) విధిస్తోందని, ఇది అమెరికాకు నష్టం కలిగిస్తోందని ట్రంప్ వాదిస్తున్నారు. అన్నింటికంటే ముఖ్యంగా BRICS – డాలర్ ఆధిపత్యం. భారత్, రష్యా, చైనాలు BRICS దేశాలలో భాగంగా స్థానిక కరెన్సీలలో వాణిజ్యాన్ని పెంచడం.. డాలర్ ఆధిపత్యానికి ముప్పుగా ట్రంప్ భావిస్తున్నారు. ఈ విధానం అమెరికన్ డాలర్ ఆధిపత్యాన్ని సవాలు చేస్తుందని ట్రంప్ ఆందోళన చెందుతున్నారు. దీంతోపాటు, భారత్ – చైనా మధ్య మెరుగవుతున్న దౌత్య సంబంధాలు కూడా ట్రంప్ కు కంటగింపుగా మారాయి.

మరోవైపు, మోదీ చైనా పర్యటన అమెరికాకు సవాలుగా మారింది. ఎందుకంటే ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా ఆధిపత్యాన్ని అడ్డుకోవడానికి భారత్‌ను వ్యూహాత్మక భాగస్వామిగా అమెరికా భావిస్తుంది. అందుకే ఇప్పుడు ప్లేటు మార్చి.. చైనా గురించి 'నేను చైనా ప్రజలను ప్రేమిస్తాను' వంటి కొత్త మాటలు మాట్లాడుతున్నారు ట్రంప్. పనిలో పనిగా పాకిస్థాన్ తో విపరీతమైన స్నేహం నెరుపుతూ భారత్ ను ఇరుకున పెట్టే తంత్రాలకు సైతం దిగుతున్నారు ట్రంప్.




## గ్రూప్-1 ర్యాంకర్ల తల్లిదండ్రుల వేడుకోలు

హైదరాబాద్: పిల్లల భవిష్యత్తుతో రాజకీయాలు వద్దని గ్రూప్-1 ర్యాంకర్ల తల్లిదండ్రులు కోరారు. రూ.3 కోట్లు ఇచ్చి ఉద్యోగాలు కొనుక్కున్నారని కొందరు ఆరోపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రూప్-1 ర్యాంకర్లు, వారి తల్లిదండ్రులు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. అసత్య ఆరోపణలతో మనోవేదనకు గురిచేస్తున్నారని పలువురు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తూ కన్నీళ్లు పెట్టుకున్నారు.

**ఆ ఆరోపణలను నిరూపించాలి....**"గ్రూప్-1 పరీక్షల వివాదాన్ని రాజకీయం చేయొద్దు. కొందరు నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఆరోపణలు చేసేవారు వాటిని నిరూపించాలి. అప్పులు చేసి, ఓ పూట తిని.. మరో పూట తినక రెక్కలు ముక్కలయ్యేలా మా పిల్లలను కష్టపడి చదివించాం. ఎన్నో త్యాగాలు చేసి చదివిస్తే రూ.3 కోట్లు ఇచ్చి ఉద్యోగాలు కొనుక్కున్నట్లు నిందలు వేస్తున్నారు. మాకు అంత స్థోమత లేదు. మీ రాజకీయాల కోసం మా పిల్లల భవిష్యత్తును నాశనం చేయొద్దు.

**అన్ని పార్టీల నేతలు సహకరించాలి...** పోస్టులు కొన్నామన్న ప్రచారంతో మా పిల్లలు ఇబ్బంది పడుతున్నారు. పోస్టులు కొనుక్కున్నామన్న ఆరోపణలపై ఎలాంటి విచారణకైనా మేం సిద్ధం. నిందలు వేసి మమ్మల్ని మనోవేదనకు గురిచేయొద్దు. అన్ని పార్టీల నేతలు సహకరించి మా బాధలు అర్థం చేసుకోవాలి. లేనిపోని దుష్ప్రచారాలు వ్యాప్తి చేయకుండా వాస్తవాలను తెలియపరచాలి. మా పిల్లలు ఎంతో కష్టపడి గ్రూప్-1 ర్యాంక్ సాధించారు. హైకోర్టు మాకు న్యాయం చేయాలి "అని తల్లిదండ్రులు కోరారు.

**తెలంగాణ గ్రూప్-1 ర్యాంకర్లు, వారి తల్లిదండ్రుల ప్రెస్‌మీట్...** ఈనెల 9న గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని వాటిని రద్దు చేయాలని కోరుతూ కొందరు, వాటిని రద్దు చేయరాదంటూ మరికొందరు దాఖలు చేసిన 12 పిటిషన్లపై విచారించిన హైకోర్టు.. 222 పేజీల తీర్పును వెలువరించింది. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు మీడియా సమావేశం నిర్వహించారు.

**రూ. 10 వేలకు స్కూల్లో పని చేస్తున్నా.. రూ.3 కోట్లు పెట్టి ఉద్యోగం కొన్నానంటున్నారు!....** భర్త చనిపోతే ఓ పాఠశాలలో రూ.10వేల జీతానికి పనిచేస్తున్నా. రూ.30వేలు ఎప్పుడూ కళ్లతో చూడలేదు. రూ.3 కోట్లకు ఉద్యోగం కొన్నట్లు నిరూపిస్తే నా మరణ శాసనం నేనే రాసుకుంటా. మా అబ్బాయికి అలాంటి ఉద్యోగం కూడా వద్దు - కన్నీటి పర్యంతమవుతూ చెప్పిన 366వ ర్యాంకర్ తల్లి

ఎంతో కృషి పట్టుదలతో ర్యాంక్ సాధిస్తే.. కొంతమంది స్వార్థపరులు గ్రూప్-1ను రాజకీయం చేస్తున్నారు. ఓపిక, సహనంతో ఉన్నాం.. ఇప్పుడు చాలా బాధగా ఉంది. రూ.3కోట్లు కాదు.. రూ.30లక్షల బ్యాంక్ బ్యాలెన్స్ కూడా చూడలేదు. రాత్రీపగలు తేడా లేకుండా కూలి పనులు చేసుకుని చదివించాం. ఆధారాలతో ఆరోపణలు చేయండి - లలిత, 67వ ర్యాంకర్ తల్లి

రాజకీయ నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారు. ఎన్నో త్యాగాలు చేసి చదివిస్తే రూ.3 కోట్లకు ఉద్యోగాలు కొన్నామని నిందలు వేస్తున్నారు. ఫలితాలు వచ్చాక కొత్తగా ఈ రాజకీయం చేస్తున్నారు. నిందలు వేసి మమ్మల్ని మనోవేదనకు గురిచేయొద్దు - 46వ ర్యాంకర్ తండ్రి ఆవేదన

ఉద్యోగం అమ్మింది ఎవరు? కొన్నది ఎవరు? ఆధారాలు చూపించాలి. నా కుమారుడికి గతంలో ఎస్సై ఉద్యోగం వస్తే గ్రూప్-1 కోసం చదివాడు. ఇప్పుడు ఇలా నిరాధార ఆరోపణలు చేయడమేంటి?- 60వ ర్యాంకర్ మహేశ్ తండ్రి




దేశం నుంచి 16వేల మంది విదేశీయులను బహిష్కరించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. భారత్‌లో ఇటీవల అమల్లోకి వచ్చిన కొత్త వలస చట్టాల ప్రకారం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. నార్కోటిక్స్ రవాణా ఇతర నేరాలతో సంబంధమున్న దాదాపు 16,000 మంది విదేశీయులను దేశంలోని పలు ప్రాంతాల్లో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అదుపులోకి తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం నిర్బంధ కేంద్రాల్లో ఉన్నవారందరినీ దేశం నుంచి బహిష్కరించడానికి హెూం వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పలు జాతీయ మీడియాల్లో వార్తలు వస్తున్నాయి. ఫోర్జరీ పత్రాలతో దేశంలో అక్రమంగా నివాసముంటున్న విదేశీయులకు కఠిన శిక్షలు విధించే కొత్త చట్టం సెప్టెంబర్ 2న అమల్లోకి వచ్చింది. వలసలు, విదేశీయుల చట్టం-2025గా వ్యవహరిస్తున్న దీనిని బడ్జెట్ సమావేశాల్లో పార్లమెంటు ఆమోదించగా.. ఏప్రిల్ 4న రాష్ట్రపతి ఆమోద ముద్ర వేశారు. నాలుగు పాత చట్టాల స్థానంలో ఇది అమల్లోకి వచ్చింది. ఇందులోభాగంగా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో దేశంలోకి ప్రవేశించిన విదేశీయులకు కనిష్టంగా రెండేళ్లు, గరిష్టంగా ఏడేళ్ల వరకు జైలు శిక్ష.. రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినా.. భారత్‌లో పేదరికంలో మగ్గుతున్నవారు కోట్లాది మంది ఉన్నారు. పేదరికాన్ని అంతం చేయడానికి ప్రభుత్వాలు రూ.కోట్ల నిధులతో సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నా పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్టుగా ఉంది. అయితే ఈ సమస్య పరిష్కారంలో అక్రమ వలసలు ప్రధాన అడ్డుగోడగా నిలుస్తున్నాయి. సరిహద్దు దేశాల నుంచి అక్రమంగా ప్రవేశించిన విదేశీయులు చట్టవిరుద్ధంగా ఉండడమే కాకుండా అసలైన లబ్ధిదారులకు అందాల్సిన సంక్షేమఫలాలను వీరు పొందుతున్నారు. ఈ నేపథ్యంలో కేంద్రం అమల్లోకి తీసుకువచ్చిన వలసలు, విదేశీయుల చట్టం ద్వారా వారిని దేశం నుంచి బహిష్కరించడానికి చర్యలు తీసుకుంటోంది.




అస్సాంకు చెందిన సివిల్ సర్వీస్ అధికారిణి నుపుర్ బోరాను పోలీసులు అరెస్టు చేశారు. భూ కుంభకోణానికి సంబంధించి ఆరోపణల నేపథ్యంలో ఆమె ఇంట్లో అధికారులు సోదాలు నిర్వహించారు. ఈక్రమంలో ఆమె ఇంట్లో నోట్ల కట్టలు, బంగారుఆభరణాలు లభ్యమయ్యాయి. ముఖ్యమంత్రి ప్రత్యేక విజిలెన్స్ సెల్ అధికారుల బృందంలో నుపుర్ బోరా పని చేస్తున్నారు. గువాహటికి చెందిన ఆమెపై భూ కుంభకోణానికి సంబంధించి ఆరోపణలు ఉన్నాయని సీఎం హిమంత బిశ్వశర్మ ఆరోపించారు. బార్పేట్ జిల్లాలో సర్కిల్ ఆఫీసర్‌గా ఉన్నప్పుడు డబ్బుకు బదులుగా భూమిని లంచంగా తీసుకున్నట్లు తేలిందన్నారు. దీంతో గత ఆరు నెలలుగా ఆమెపై నిఘా ఉంచినట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే సోమవారం ఆమె ఇంటితో సహా మరో మూడు ప్రదేశాల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సోదాల్లో రూ.90లక్షల నగదుతో పాటు రూ.కోటి విలువైన బంగారు ఆభరణాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారన్నారు. ఆమెను అరెస్టు చేసి విచారిస్తున్నట్లు వెల్లడించారు. కాగా.. సోదాల్లో దొరికిన డబ్బుతో పాటు నుపుర్ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. సీఎం విజిలెన్స్ ఎస్పీ రోజీ కలిత మాట్లాడుతూ.. ఈ కేసుపై పూర్తి దర్యాప్తు కొనసాగుతుందన్నారు. నుపుర్‌పై చాలా అవినీతి ఆరోపణలు ఉన్నాయని, దర్యాప్తులో మరిన్ని బయటపడతాయని వెల్లడించారు. కాగా.. బార్పేట్‌లో ఆమెకు సహాయకుడిగా పనిచేసిన లాట్ మండల్ సురాజిత్ డేకా నివాసంలో కూడా అధికారులు సోదాలు చేశారు. ఇతడిపై కూడా భూ కుంభకోణం ఆరోపణలు ఉన్నట్లు తెలుస్తోంది.




**నల్గొండ: పదేళ్ల బాలికపై అత్యాచారం కేసులో నల్గొండ కోర్టు తీర్పు వెలువరించింది. దోషి మర్రి ఊషయ్యకు 24 ఏళ్ల జైలు శిక్షతోపాటు.. రూ.40 వేల జరిమానా విధించింది. బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. 2023లో మార్చిలో నల్గొండ రూరల్ పోలీసుస్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. ఈ కేసులో ఇవాళ పోక్సో కోర్టు ఇన్‌ఛార్జ్ జడ్జి రోజా రమణి తీర్పు వెలువరించారు.**

## ఖరీఫ్‌లో ఇంకా 2 లక్షల టన్నుల యూరియా కావాలి: మంత్రి తుమ్మల




దిల్లీ: ఈ ఖరీఫ్ సీజన్‌లో తెలంగాణకు ఇంకా 2లక్షల టన్నుల యూరియా ఇవ్వాలని కేంద్రమంత్రి అనుప్రియ పటేల్‌ను కోరామని తెలంగాణ వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. కేంద్రమంత్రులతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. "ఎరువుల విషయంలో రైతులకు వచ్చిన ఇబ్బందులను కూడా ప్రస్తావించాం. అధికంగా దిగుమతులపై ఆధారపడినందున ఇబ్బందులు వస్తున్నాయి. రైతులను కాపాడే విషయంలో కొన్ని చర్చలు జరిగాయి. 1968లో చేసిన విత్తన చట్టానికి మార్పులు చేయాల్సిన అవసరం ఉంది. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో నూతన చట్టాన్ని ఆమోదించాలని కోరాం. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని రైతు సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలవుతున్నాయి. దేశంలో ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు దిగుమతి సుంకాలు పెంచాలని కోరాం. కొత్తగూడెం విమానాశ్రయం గురించి కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడితో చర్చించాం. వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాల నిర్మాణానికి సంబంధంచి భూ సేకరణ పూర్తయిందని తెలిపాం. కేంద్ర ఉక్కుశాఖమంత్రి కుమారస్వామిని కలిసి బయ్యారం స్టీల్ విషయంలో రాష్ట్రానికి న్యాయం చేయాలని కోరాం" అని తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు



## సీఎం గారూ.. నన్ను మళ్లీ నడిపించారు..థాంక్యూ!

హైదరాబాద్: హనుమకొండ జిల్లా దామెర మండలం, పులకుర్తి గ్రామానికి చెందిన గుండేటి రాహుల్ తన కుటుంబ సభ్యులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన తనకు ప్రోత్సాహకం అందించి మళ్లీ నడిచేలా చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నవంబర్ 2, 2024న రైలులో రాజస్థాన్ వెళుతున్న రాహుల్‌ను కొందరు దుండగులు రైలు నుంచి కిందికి తోసేశారు. ఈ ఘటనలో రెండు కాళ్లు కోల్పోయిన రాహుల్‌కు సీఎం సహాయనిధి ద్వారా చికిత్స అందించి, కృత్రిమ కాళ్లు అమర్చేందుకు ప్రభుత్వం సాయం చేసింది. అందుకు కృతజ్ఞతగా రాహుల్ తన కుటుంబంతో కలిసి వచ్చి మర్యాద పూర్వకంగా సీఎంను కలిశారు.

## కేటీఆర్‌పై కుట్ర జరుగుతోంది.. సామ రామ్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు..




హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారిన సంగతి తెలిసిందే. అయితే, ఈ క్రమంలోనే.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కుట్ర జరుగుతోందని టీపీసీసీ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్మోహన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన, బీఆర్ఎస్ పార్టీలో కొనసాగుతున్న అంతర్గత రాజకీయాలు తీవ్రంగా ముదిరాయని అన్నారు.

**సీనియర్ నేత కుట్ర..** కేసీఆర్ తర్వాత పార్టీ పగ్గాలు అందుకోవాలనే ఆశతో ఉన్న ఒక సీనియర్ నేత, కేటీఆర్‌ను రాజకీయంగా పక్కకు నెట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడని షాకింగ్ కామెంట్స్ చేశారు. ఈ కుట్రకు కేంద్రంలో బీజేపీ నాయకులు మద్దతుగా ఉన్నారని సామ రామ్మోహన్ రెడ్డి సెన్సేషనల్ కామెంట్స్ చేశారు. అంతేకాకుండా, బెంగళూరులోని నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో కార్యాలయంలో కేటీఆర్‌ను ఇరికించేందుకు ప్రయత్నాలు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. గతంలో హైదరాబాద్ డ్రగ్స్ కేసులో ఓ ప్రముఖ సినీ నటి ఇచ్చిన స్టేట్‌మెంట్‌లో కేటీఆర్ పేరు ప్రస్తావించారని, దాన్నే ఆధారంగా చేసుకొని ఇప్పుడు కుట్ర పన్నే ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించారు. ఈ వ్యవహారంపై బీజేపీ నేతలు, ముఖ్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ విచారణ చేసి వాస్తవాలు తెలిసేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఆ బాధిత కుటుంబాల గుండెకోత కనిపించడం లేదా?: కేటీఆర్



హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ అసమర్థ పాలన కొనసాగుతోందని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. హైదరాబాద్‌లో నాలాలో పడి కొట్టుకుపోయిన ముగ్గురి మృతదేహాలను మూడు రోజులు గడుస్తున్నా వెలికితీయకపోవడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కుప్పకూలిన ఘటనలో ఆరుగురి మృతదేహాలను ఇప్పటికీ గుర్తించలేని అసమర్థత కాంగ్రెస్‌దేనన్నారు. కనీసం తమ ఆప్తులను చివరి చూపు కూడా చూసుకోలేని ఆ బాధిత కుటుంబాల ఆవేదన, గుండెకోత మానవత్వం లేని కాంగ్రెస్‌కు వినిపించడం లేదా? అని ప్రశ్నించారు. నాలాల్లో బలి చేసిన ముగ్గురి మృతదేహాలను కూడా గుర్తించకపోతే భారత రాష్ట్ర సమితి చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు.




## బతుకమ్మ షార్ట్ ఫిల్మ్ పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం.. అర్హతలు ఇవే..

హైదరాబాద్, సెప్టెంబరు16 : తెలంగాణలో బతుకమ్మ పండుగను ఎంతో ఘనంగా నిర్వహించుకుంటారు. బతుకమ్మకు సంబంధించిన పాటలను పాడుకుంటూ మహిళలు సందడిగా చేసుకుంటారు. బతుకమ్మ పండుగ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలోని యువ సృజనశీలురకు పట్టం కట్టేందుకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ ఛాలెంజ్ పేరిట షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహిస్తోంది. మూడు నిమిషాలు, ఐదు నిమిషాల్లోపు నిడివి కలిగిన రెండు కేటగిరీల్లో షార్ట్ ఫిలిమ్స్‌కు పంపించాలని ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు సూచించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి , సంక్షేమం(మహిళలకు ఉచిత బస్సు, మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇండ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ తదితరాలు), తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పండుగలు, కళారూపాలపై షార్ట్ ఫిలిమ్స్, పాటల పోటీలను పంపించాలని సూచించారు దిల్ రాజు. సెప్టెంబరు 30వ తేదీలోపు ఎంట్రీలను పంపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. నిర్దేశిత గడువులోగా అందిన ఎంట్రీలను నిపుణులతో కూడిన జ్యూరీ సభ్యులు వీక్షించి ఎంపిక చేస్తారని దిల్ రాజు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి భవిష్యత్తులోనూ అనేక రకాలుగా ప్రోత్సహం ఇస్తామని చెప్పుకొచ్చారు. ఈ పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఇవాళ(మంగళవారం) విడుదల చేశారు ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు. ఎంట్రీలను ఈ కింది మెయిల్ ఐడీ youngfilmmakerschallenge@gmail.com లేదా వాట్సాప్ నెంబర్ - 8125834009 (WhatsApp Only)కు పంపించాల్సి ఉంటుందని వెల్లడించారు. పోటీలో ఎంపికైన షార్ట్ ఫిలిమ్స్‌కు ప్రథమ బహుమతి రూ. 3 లక్షలు, ద్వితీయ బహుమతి రూ. 2 లక్షలు, తృతీయ బహుమతి రూ. 1 లక్ష చొప్పున అందిస్తారని వివరించారు. మరో ఐదుగురికి రూ. 20 వేల చొప్పున కన్సోలేషన్ బహుమతులు అందజేస్తారని ప్రకటించారు. వీటితో పాటు బహుమతి గ్రహీతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను ప్రదానం చేస్తారని ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు పేర్కొన్నారు.

# పాఠశాలల్లో "ప్రతిజ్ఞ" రచయిత పైడిమర్రి సుబ్బారావు

## – సెప్టెంబర్ 17... ప్రతిజ్ఞ ఆవిర్భావ దినం

మనదేశంలో ఉదయం దాదాపు ప్రతి పాఠశాలలో ప్రార్థనా సమయంలో ఇంగ్లీష్ లోనో, తెలుగు లోనో, ఇతర భాషలలోనో తప్పనిసరిగా పిల్లలు చదివే "భారత దేశం నా మాతృభూమి, భారతీయులందరూ నా సహోదరులు.." అనే "ప్రతిజ్ఞ" (ప్లెడ్జ్) చదువుతారు. అయితే ఆ ప్రతిజ్ఞ రాసిన గొప్ప జాతీయ భావాలు కలిగిన రచయిత మాత్రం చాలా మందికి తెలియదు. ప్రతి రోజు విద్యార్థులు పాఠశాల దిన చర్యను ప్రారంభించే ముందు వందే మాతరం, జనగణమన జాతీయ గీతాలతో పాటు 'భారతదేశము నా మాతృభూమి..' అనే ప్రతిజ్ఞను సామూహికంగా చేసే విషయం నిత్య అనుసరణీయమే. వందేమాతరం రాసింది బంకించంద్ర ఛటర్జీ, జనగణమన రాసింది రవీంద్రనాథ్ ఠాగూర్ అని, సారే జహాసే అచ్ఛా రాసింది మహమ్మద్ ఇక్బాల్ అని పిల్లలను అడిగితే సమాధానం చెప్తారు. పాఠశాల క్విజ్ పోటీలలో తప్పక వేసే ప్రశ్నలు ఇవి. కానీ ప్రతిజ్ఞ రచయిత గురించి పుస్తకాలలో లేక ఉపాధ్యాయులకు, విద్యార్థులకు తెలియ పరచకుండా ఉంచడమే బాధాకరం. తెలంగాణ లోని నల్గొండ సమీపంలోని అన్నెపర్తిలో పుట్టడమే ఆయన చేసుకున్న పాపమో, లేక ఈ తెలంగాణ గడ్డకు కలిగిన శాపమో? నాటి పాలకుల పక్షపాత వైఖరియో తెలియదు కాని...జాతీయ భావం ప్రేరేపించే ప్రతిజ్ఞ యాభై ఏళ్లకు పైబడి పాఠ్య పుస్తకాల్లో ముద్రితమై కనిపిస్తున్నా అది రాసిన రచయిత పేరు దశాబ్దాలుగా ఎక్కడా ప్రస్తావించక పోవడం బాధాకరం. తెలుగుతో పాటు సంస్కృతం, హిందీ, తమిళం, మలయాళం, కన్నడ, గుజరాతీ, మరాఠీ.. తొమ్మిది భాషల్లోకి అనువాదమై, ఆరు దశాబ్దాల కిందటి నుంచే పాఠ్య పుస్తకాల్లో ప్రచురించిన ఈ ప్రతిజ్ఞను తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాతే గుర్తించడం గమనార్హం. కారణం ఈ ప్రతిజ్ఞను రాసింది తెలంగాణ వాసి కావడమే. ఆయనే నల్గొండ జిల్లా, అన్నెపర్తికి చెందిన తెలుగు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు. వెంకట సుబ్బారావు (1916 జూన్ 10 – 1988 ఆగష్టు 13) 1916, జూన్ 10న పైడిమర్రి వెంకట రామయ్య, రాంబాయమ్మ దంపతులకు నల్లగొండ కేంద్రానికి సమీపంలో ఉండే అన్నెపర్తిలో జన్మించారు. విద్యాభ్యాసం మొత్తం అన్నెపర్తి, నల్లగొండ లోనే సాగింది. తెలుగు, సంస్కృతం, హిందీ, ఇంగ్లీష్, అరబిక్ భాషల్లో నిష్ణాతులు. హైదరాబాద్ రాష్ట్రం లోనే ట్రెజరీ విభాగంలో ప్రభుత్వోద్యోగం సంపాదించారు. ఆ తర్వాత ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడ్డాక ఖమ్మం, నిజామాబాద్, నెల్లూరు, విశాఖపట్నం, నల్లగొండ జిల్లాల్లో పనిచేశారు. ఉద్యోగ విరమణ అనంతరం 1988 ఆగష్టు 13 న అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన జమిందారీ, భూస్వామ్య వెట్టిచాకిరీని నిరసిస్తూ ఎన్నో కథలు రాశారు. ఆయన తన 18వ ఏటనే కాలభైరవుడు (1936) పేరున చిన్న నవల రాశారు. దేవదత్తుడు, తులసీదాసు, త్యాగరాజు మొదలైన పద్య కావ్యాలు, బ్రహ్మ చర్యము, గృహస్థ జీవితము, స్త్రీ ధర్మము, ఫిరదౌసి, తార, శ్రీమతి అనే నాటకాలు రాశారు. సింగపురీ నృకేసరీ శతకం, బాల రామాయణం మొదలైన రచనలు, అనేక అనువాద రచనలు కూడా చేశారు. గోలకొండ, సుజాత, ఆంధ్రపత్రిక, భారతి, నవజీవన్, ఆనందవాణి పత్రికలలో అయన రచనలు ప్రచురితమైనాయి. ఆయన పద్యాలు గోలకొండ కవుల సంచికలోను, కథలు ఉషస్సు కథా సంకలనం, తెలంగాణ తొలితరం కథలులో



'నౌకరి' కథ వచ్చింది. 1945లోనే ఉషస్సు కథల సంపుటిని వెలువరించారు. 1945–46 లలో నల్లగొండలో జరిగిన ఆంధ్రసారస్వత పరిషత్తు సభలలో ప్రముఖ పాత్ర వహించారు. పదవీ విరమణ తర్వాత సర్వేలు గురుకుల పాఠశాలలో కొంతకాలం స్వచ్ఛందంగా పనిచేశారు. చైనా యుద్ధ సమయంలో ఆయన విశాఖ పట్టణంలో ట్రెజరీ అధికారిగా పనిచేస్తున్న కాలంలో, విద్యార్థులలో దేశభక్తిని పెంపొందిం చేందుకు పైడిమర్రి "ప్రతిజ్ఞ"కు 1962 సెప్టెంబర్ 17న రూపకల్పన చేశారు. రాసిన దానిని 1963లో విశాఖపట్నం లోని ఒక పాఠశాలలో తొలిసారిగా ప్రతిజ్ఞ చేయించారు. "ప్రతిజ్ఞ"ను ప్రముఖ రాజకీయవేత్త, స్వాతంత్ర్య సమర యోధుడు తెన్నేటి విశ్వనాథం దృష్టికి తీసుకెళ్లగా, సాహితీవేత్త అయిన అప్పటి విద్యాశాఖ మంత్రి, విజయ నగరం రాజాగా పేరు గాంచిన పీవీజీ రాజుకు అంద చేశారు. ఆయన నాటి ముఖ్య మంత్రి కాసు బ్రహ్మానంద రెడ్డితో చర్చించారు. 1963లో "ప్రతిజ్ఞ" ను పాఠ్య పుస్తకాలలో చేర్చి ప్రతిరోజు ప్రార్థనా సమయంలో చదివిం చాలని ఉత్తర్వులు జారీ చేసారు. 1964లో బెంగుళూరులో ప్రముఖ న్యాయ నిపుణుడు మహ్మద్ కరీం చాగ్లా అధ్యక్షతన కేంద్రీయ విద్యా సలహా మండలి సమావేశం జరిపి నపుడు జాతీయ ప్రతిజ్ఞగా స్వీకరించారు.

తరువాత దీన్ని అన్ని భాషల్లోకి అనువాదం చేయించారు. 1965 తర్వాత కేంద్ర ప్రభుత్వం దీనిని ఇంగ్లీష్ లో పొందుపరచి దేశవ్యాప్తంగా అమలు చేశారు. పైడిమర్రి రాసిన ప్రతిజ్ఞలో కాలానుగుణంగా కొన్ని స్వల్ప మార్పులు జరిగి, కొన్ని గ్రాంథికం పదాల స్థానంలో వాడుక భాష వాడి, ఇతర భాషల్లోకి అనువదించి 1963 నుంచి దేశ ప్రతిజ్ఞగా అమలులోకి తెచ్చారు. 1965 జనవరి 26 నుంచి దేశ వ్యాప్తంగా పాఠశాలల్లో చదువు తున్నారు. పాఠ్య పుస్తకాలలో ప్రచురిస్తున్న ప్రతిజ్ఞకు పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రించాలని తెలంగాణ విద్యావంతుల వేదిక 2014 నవంబరు 27న రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి, రాష్ట్ర గవర్నర్‌కు తెలంగాణ సీఎం కెసీఆర్ కు విజ్ఞప్తి చేయగా, 2015–16 విద్యా సంవత్సరం నుంచి కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో అన్ని భాషల్లో అన్ని ప్రభుత్వ పాఠ్య పుస్తకాలలో జాతీయ ప్రతిజ్ఞతో పాటు రచయిత పైడిమర్రి వెంకట సుబ్బారావు పేరును ముద్రిస్తున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# ఉచిత బస్సు...వందల కోట్ల లాభం !



ఉచిత బస్సుని ఏపీలో ఆగస్టు 15న ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ విజయవాడలో ప్రారంభించారు. సరిగ్గా ఈ రోజుకు నెల అయింది. ఈ ముప్పయి రోజులలో ఉచిత బస్సు వల్ల ఎంత లాభం వచ్చింది, అనుకున్న లక్ష్యం చేరుకుందా, మహిళలకు ఏ విధంగా ఇది ఉపయోగపడింది అంటే దీని మీద సానుకూలమైన ఫలితాలే వచ్చినట్లుగా ప్రభుత్వానికి నివేదికలు ఉన్నాయి.

**మహిళా లోకానికి గిఫ్ట్ :** టీడీపీ కూటమి ప్రభుత్వం ఎన్నికల వేళ ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలో ఇది కీలకంగా ఉంది. దాని ప్రకారం అధికారంలోకి వచ్చిన తరువాత ఉచిత బస్సు విషయంలో అన్ని రకాలైన కసరత్తులు చేసి మరీ 2025 ఆగస్టు 15న ఈ పథకాన్ని అమలు చేసింది. మహిళలకు ఇది ఒక బహుమతిగా ప్రభుత్వం పేర్కొంటోంది. ముఖ్యంగా శ్రామిక మహిళలు ఉద్యోగినులు అలాగే విద్యార్థినులు వీరంతా ఈ పథకానికి ప్రధాన లబ్దిదారులుగా ఉనారు.

**ఎంత లాభం అంటే :** ఇక ఈ ఉచిత బస్సు పథకాన్ని ఏపీవ్యాప్తంగా మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఆర్టీసీ ఎక్స్ ప్రెస్ ల వరకూ ఎక్కే చాన్స్ ఉండడంతో చాలా సులువుగా వంద కిలోమీటర్ల దూరం ఉచితంగా ప్రయాణం చేస్తున్నారు. పక్క జిల్లాలలు వెళ్తున్నారు. కన్నవారింటికి కానీ లేక తమ చుట్టాల ఇంటికి కానీ లేక విహారానికి కానీ దేవాలయాల సందర్శనకు కానీ ఉచిత బస్సుని వాడుకుంటున్నారు. దీంతో నెల రోజులుగా ఉచిత బస్సు ద్వారా మహిళలు అందుకున్న లాభం కానీ వారు మిగుల్చుకున్న ఆదాయం కానీ లెక్క వేస్తే కనుక అక్షరాలా 118 కోట్ల రూపాయలుగా తేలింది. ఇది ఎంతో భారీ మొత్తం కిందనే చెప్పాల్సి ఉంది. ఇదే ఒక ఏడాదికి హెచ్చువేస్తే 1500 కోట్ల రూపాయలు అవుతుంది. అంటే ఇంతటి భారీ ఆర్థిక లాభం ప్రతీ ఇంటికీ చేకూర్చిన ఘనతను కూటమి ప్రభుత్వం అందుకుంది అని చెప్పాలన్న మాట. ఇక ఈ పథకం కింద 3.17 కోట్ల మంది మహిళలు రాష్ట్ర వ్యాప్తంగా నెల రోజులలో ప్రయాణించారు అని అంటున్నారు.

**వీరందరి పర్సులలో :** పట్టణాలు నగరాల్లో మహిళలు చిరు ఉద్యోగాలు చేసుకుంటూ తమ జీవితాలను గడుపుతున్నారు. వారు ప్రతీ నెలా 1500 రూపాయలు బస్ పాస్ కోసం ఖర్చు చేస్తున్నారు. అలా వారి పర్సులలో ఇపుడు ఆ మొత్తం అలాగే మిగిలిపోయింది. అంతే కాదు విద్యార్థినులు కూడా మూడు నెలలకు పదిహేను వందల స్టూడెంట్ బస్ పాస్ తీసుకునేవారు. ఇపుడు వారికి నెలకు అయిదు వందల రూపాయలు మిగులుతోంది ఇక రోజు వారీ కూలీ నాలీ పనులు చేసుకునేవారు ప్రధానంగా ఆటోలను ఆశ్రయించిఏవారు వారికి వచ్చే కూలీలో వంద రూపాయల దాకా ఈ ఆటో చార్జీలకే రోజుకు పోయేది. ఇపుడు వారికి నెలకు మూడు వేల దాకా మిగుతోంది అన్నది లెక్క చెబుతోంది.

**ఆక్యుపెన్సీ రేటు పెరిగింది :** వీరు కాక మధ్యతరతి గృహిణులు తమ కుటుంబాలతో ఎక్కడికైనా వెళ్లాలి అనుకుంటే వారి బడ్జెట్ లో వేయి రూపాయలు నెలలో ఖర్చు అయ్యేది. ఇపుడు మహిళలకు ఉచిత బస్సు వల్ల అయిదు వందల దాకా ఆదా అవుతోంది. దాంతో నెలకు రెండు మూడు సార్లు కూడా వెళ్ళగలుతున్నారు. ఇలా వివిధ వర్గాల మహిళలు అంతా స్త్రీ శక్తి పథకానికి జై కొడుతున్న నేపథ్యం కనిపిస్తోంది. ఇక బస్సులో మహిళల ఆక్యుపెన్సీ రేటు పెరిగింది. 67 శాతం వారు ప్రయాణిస్తున్నరు. చూడాలి మరి ముందు ముందు ఏ విధంగా స్త్రీ శక్తిని చాటుకుంటారో.

# "హైదరాబాదు విలీనం అయిన విధంబు ఎట్టి దనిన"






భారతదేశ చరిత్రలో సెప్టెంబర్ 17 1948 చిర స్మరణీయమైన దినం. భారత్ సేనాధి పతుల వ్యూహరచన చాతుర్యానికి, సేనల అసమాన పరాక్రమానికి ప్రతిష్ట చేకూర్చిన రోజు. కోటిన్నర ప్రజల చిర వాంఛ ఫలప్రద మైన రోజు. హైదరాబాద్ పై భారత ప్రభుత్వ పోలీసు చర్య విజయ వంతంగా ముగిసిన సంఘటనకు సాక్ష్యం అయిన రోజు. దక్షిణ ప్రాంత భారత సర్వ సేనాని లెఫ్టినెంట్ జనరల్ మహారాజా రాజేంద్ర సింహ్ జీ సాటిలేని మేటి వ్యూహ రచనకు నిలువు టద్దంగా నిలిచిన రోజు. సెప్టెంబర్ 13 వ తేదీ తెల్లవారు జామున మూడు గంటలకు భారత సేనలు సంస్థానం నలువైపుల నుండి "చలో సికింద్రాబాద్" అని ముందు అడుగు వేశాయి. సికింద్రాబాద్ చేరవలసిన ప్రధాన సేనా వాహిని మేజర్ జనరల్ జయంత్ నాథ్ చౌదరి నాయకత్వంలో షోలాపూర్ నుండి నేరుగా సికింద్రాబాదుకు బయల్దేరింది. ఈ సేనలో ఒక దళం నల్ దుర్గ్ నుండి ఉత్తరంగా జాల్నా మీదికి సాగింది. దక్షిణాన హొస్పేట వద్ద, మైసూర్ సేనకు సంబంధించిన బ్రిగేడియర్ బాల్, మధ్య ప్రాంతం డి ఐ జి పార్థసారథి అయ్యంగార్ నేతృత్వంలో మైసూర్ సేన, కొంత మద్రాస్ ప్రత్యేక పోలీసు దళం, మరికొంత మునీరాబాద్ వద్ద తుంగభద్ర పై గల వంతెనను స్వాధీన పరచుకొని ముందుకు సాగాయి. కొంచెం తూర్పుగా కర్నూల్ వద్ద మైసూర్ అశ్వికదళం జాతీయ పోలీసు బలగం తుంగభద్ర రైలు వంతెన స్వాధీన పరచుకొని గద్వాల్ దిశగా సాగాయి. విజయ వాడ వద్ద నుండి బ్రిగేడియర్ మదన్ సింగ్ ఆధ్వర్యంలో ఒక సేనా దళం ఉత్తర ప్రాంత డిఐజి సుబ్బరాయన్ ఆద్వర్యంలో కొంత పోలీసు బలగంతో బయలు దేరాయి. సేవాదళం రెండు భాగాలుగా విడివడి... ఒకటి రైలు మార్గం వెంట ఖమ్మం మీదుగా వరంగల్, రెండవది సూర్యాపేట మీదుగా సికింద్రాబాద్ లక్ష్యాలుగా పురోగమించాయి. ఉత్తరాన కొంత సేన, కొంత పోలీసు బలగం బాలార్ష ను ఆక్రమించాయి. ఆ సమీపంలో గోదావరి పై గల రైలు వంతెనకు ప్రమాదం లేకుండా చేశాయి. పడమరగా కానేర్గాం వద్ద నుండి కొంత పోలీసు బృందం, హింగోలి దిశగా బయలు దేరగా, వాయవ్యంగా తాల్వాద్ నుండి ఒక సైనిక దళం ఔరంగాబాద్ కు సాగింది. షోలాపూర్, విజయవాడ, తాల్వాద్ నుండి బయల్దేరిన ప్రధాన సేన దళాలు... ఎలాంటి ప్రతిఘటనలు కేంద్రీకృతం కాకుండా చేసేందుకు, స్వాధీనమైన ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు, సంఘ విద్రోహ శక్తులను మట్టుపెట్టే కార్యక్రమంలో నిమగ్నమయ్యారు. హొస్పేట, కర్నూలు, విజయవాడ నుండి బయలు దేరిన బలగాలు మద్రాస్ ప్రాంత సేనాని మేజర్ జనరల్ రుద్ర పర్యవేక్షణ కింద పని చేశాయి. ఈ దండయాత్రలో సిక్కులు గూరా?లు మద్రాసు బొంబాయి తదితర పోలీసులు పాల్గొన్నారు. సేనాధిపతులలో ఇరువురు ఆంగ్లో–ఇండియన్లు కూడా ఉన్నారు. 13వ తేదీ సూర్యోదయం వేళ భారత వైమానిక దళాలు విజయవాడ ప్రాంతం నుండి ఎయిర్ వైస్ మార్షల్ ముఖర్జీ నాయకత్వంలో, నిజాం సంస్థానం లోని వరంగల్ బీదర్, ఔరంగబాద్ విమానాశ్రయాలను ఆనవాళ్లు లేకుండా చేశాయి. వాస్తవానికి భారత సేనలు సంస్థానం లోకి తరలి వస్తున్న విషయం 13వ తేదీ ఉదయం 11గంటలకు కానీ బయటకు తెలియనే లేదు. ఢిల్లీలో ఈ విషయాన్ని భారత ప్రభుత్వం బహిర్గతం చేసింది. భారత సైన్యం మెరుపు వేగంతో అన్నివైపుల నుండి సికింద్రాబాద్ వైపు, హైదరాబాద్ వైపు బలగాలు అవిశ్రాంతంగా ముందుకు సాగాయి. 14న మధిర అలంపూరుబీ 15న వనపర్తి, దౌలతాబాద్, సూర్యాపేట, ఖమ్మం మెట్టు, హొమ్నాబాదు, ఔరంగాబాదు భారత సేనల వశమైనాయి. హొమ్నాబాదు పతనంతో, భారత సేనలు సికింద్రాబాదుకు 10 మైళ్ళ పరిధిలోకి వచ్చాయి. అలా ముందుకు వెళ్లి ఆ రాత్రికి జహీరాబాద్ చేరాయి. నిజాం నవాబుకు దిక్కు తోచని స్థితి ఎదురయింది. ఇలాంటి స్థితిలో జార్జి రాజుకు, ట్రూమన్ కు విజ్ఞప్తులు పంపు కున్నాడు. అయినా ఎవరు పట్టించుకున్న దాఖలాలు లేవు. 16వ తేదీన వరంగల్, బీదర్, జాల్నా, సిర్వ్యాగు, నారేటుపల్లి, సదాశివపేట సేనల వశమయ్యాయి. ఆరోజున అటు సోలాపూర్ నుండి నేరుగా సికింద్రాబాద్ వెళ్తున్న దళము, ఇటు విజయవాడ నుండి సూర్యాపేట సికింద్రాబాద్ రహదారిపై వెళుతున్న దళము నువ్వా నేనా అంటూ పోటీపడి ముందుకు సాగాయి. 17వ తేదీన హింగోలి సేనల వశమైంది. ప్రధాన దళాలు రెండు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల శివార్లకు చేరుకున్నాయి. దక్షిణ ప్రాంత సర్వ సేనాధిపతి రాజేంద్ర సింహ్ జీ నిజాంను ఉద్దేశించి... "ఇక లాభం లేదు. లొంగీ పోయి అనవసర అయాచిత ప్రాణ నష్టం లేకుండా చూసుకోండి" అంటూ హితవు పలికారు. ఇక గత్యంతరం లేదని గ్రహించిన 17వ తేదీ సాయంత్రమే దాసోహం అన్నాడు. హైదరాబాదును ప్రత్యేక దేశంగా ఉంచాలని, కనీసం పాకిస్తాన్‌లో నైనా విలీనం చేయాలని విశ్వ ప్రయత్నం చేసిన నిజాం పన్నాగాలను ఉక్కుమనిషి పటేల్ బద్దలు కొట్టాడు. నిజాం ఐక్యరాజ్య సమితికి భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను కూడా పంపాడు. భారత దేశంపై పోరాటానికి విదేశాల నుంచి ఆయుధ దిగుమతికి ప్రయత్నాలు చేశాడు. అయినా అతని ఆటలు, నిజాం ప్రధాని లాయక్‌అలీ నాటకాలు, పటేల్ ఎదుట పనిచేయ లేదు. పోలీసు చర్యలో భాగంగా నలువైపులా నుంచి వస్తున్న భారత బలగాలను చూసి నిజాం కింగ్‌కోఠి నుంచి బయటకు వచ్చి భారత ప్రతినిధి కె.ఎం.మున్షీని కలిశాడు. అప్పటికే సమాచార సాధనాలు తెగి పోవడంతో ఎటూ అర్థంకాక కాళ్ళ బేరానికి దిగాడు. లొంగు బాటుకు మించిన తరుణోపాయం లేదని మున్షీ చెప్పడంతో నిజాం ఒప్పుకోక తప్పలేదు. బొల్లారం వద్ద నిజాం నవాబు సర్దార్ పటేల్ ఎదుట తలవంచి లొంగి పోవడంతో 1948 సెప్టెంబరు 17న హైదరాబాదు రాజ్యం భారత యూనియన్‌లో విలీనమైంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# అమెరికా వీసా: పాత వాటికే దిక్కులేదా? ఇక కొత్తవి కష్టమే

అమెరికా వెళ్లాలనుకునేవారి కలలకు సాంకేతిక సమస్యలు అడ్డంకిగా మారాయి. ప్రస్తుతం అమెరికా వీసా పోర్టల్‌లో నెలకొన్న సాంకేతిక లోపాల కారణంగా వేలాది మంది దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా '%చీవష ాజూజూశ్రీఱ-ఎ్ఱశీఅ%' ఆప్షన్ కనిపించకపోవడం వల్ల కొత్తగా వీసా కోసం దరఖాస్తు చేసుకోవాలనుకునేవారు నిరాశ చెందుతున్నారు. పాత అప్లికేషన్లు మూతబడకపోవడం, పునరావృతమైన ఎర్రర్ సందేశాలు ఈ గందరగోళానికి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి.

**సాంకేతిక లోపాల మూలం...** ఈ సమస్యలన్నింటికీ మూలం వీసా పోర్టల్ బ్యాక్‌ఎండ్‌లో ఉన్న సాంకేతిక లోపమే. వీసా మంజూరైనప్పటికీ పాత అప్లికేషన్లు సిస్టమ్‌లో '%ాజూవఅ%' స్టేటస్‌లోనే ఉండిపోతున్నాయి. ఉదాహరణకు 2023లో వీసా పొందిన ఒక వ్యక్తి యొక్క అప్లికేషన్ ఇంకా మూసుకుపోకపోవడంతో, అదే పోర్టల్‌లో కొత్త దరఖాస్తు చేసే అవకాశం లేకుండా పోతోంది. ఇది కేవలం ఒక వ్యక్తి సమస్య కాదు, వేలాది మంది దరఖాస్తుదారులు ఇలాంటి అనుభవాన్నే ఎదుర్కొంటున్నారు. దీంతో కొత్తగా దరఖాస్తు చేసుకోవాలనుకునేవారికి మార్గం మూసుకుపోయింది. అదనంగా వెబ్‌సైట్‌ను అప్‌డేట్ చేయడంలో సరైన పద్ధతులు పాటించకపోవడం




వల్ల యూజర్లకు తరచుగా అర్థంకాని ఎర్రర్ సందేశాలు వస్తున్నాయి. ఈ ఎర్రర్ సందేశాలు గందరగోళాన్ని మరింత పెంచుతున్నాయి.

**దరఖాస్తుదారుల నిరాశ, దీర్ఘకాలిక ప్రభావం...** ఇప్పటికే అన్ని డాక్యుమెంట్లు సిద్ధం చేసుకుని, ప్రయాణ ప్రణాళికలు వేసుకున్నవారు ఈ ఆన్‌లైన్ సమస్యల వల్ల ముందుకు వెళ్లలేకపోతున్నారు. వీసా ప్రక్రియలో సమయం ఎంతో కీలకం కాబట్టి, ఈ జాప్యం వారి భవిష్యత్తు ప్రణాళికలను ప్రమాదంలో పడేస్తోంది. ఈ సమస్యల వల్ల వీసా దరఖాస్తుల ప్రాసెసింగ్ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం కొత్త దరఖాస్తులు తగ్గినప్పటికీ పోర్టల్ సమస్యలు పరిష్కరించగానే భారీగా దరఖాస్తులు పెరిగి, క్యూ మరింత పెరిగే అవకాశం ఉంది. విద్యార్థులు, ఉద్యోగార్థులు, వ్యాపార ప్రయాణికులు అందరిపైనా దీని ప్రభావం పడుతోంది.

**తక్షణ పరిష్కారం అవసరం...** ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం అవసరం. అమెరికా వీసా పోర్టల్‌కు శాశ్వత సాంకేతిక అప్‌గ్రేడ్ అత్యవసరం. పాత అప్లికేషన్లు వీసా జారీ అయిన వెంటనే ఆటోమేటిక్‌గా క్లోజ్ అయ్యేలా సిస్టమ్‌లో మార్పులు చేయాలి. అలాగే యూజర్లకు త్వరితగతిన సహాయం అందించేలా కస్టమర్ సపోర్ట్ వ్యవస్థను పటిష్టం చేయాలి. మొత్తానికి ఒక సాధారణ సాంకేతిక లోపం వేలాది మంది దరఖాస్తుదారుల భవిష్యత్తుపై ప్రభావం చూపుతోంది. వీసా ప్రక్రియలో పారదర్శకత, వేగం, నమ్మకాన్ని కాపాడుకోవాలంటే అమెరికా వీసా వ్యవస్థలో తక్షణమే సాంకేతిక సంస్కరణలు చేపట్టడం తప్పనిసరి.

# ట్రైన్ జర్నీస్ చేస్తుంటారా? ఇది అస్సలు మిస్ కావొద్దు

మీరు తరచూ ట్రైన్ జర్నీలు చేస్తుంటారా? అయితే.. మీరు మిస్ కాకుండా చదవాల్సిందే. ఒకవేళ మీకు ట్రైన్ జర్నీ చేసే అలవాటు లేకున్నా.. ఇది తప్పనిసరిగా అప్డేట్ కావాల్సిన అంశం. దూర ప్రయాణాలకు తప్పనిసరిగా రిజర్వేషన్ చేసుకోవటం తెలిసిందే. అయితే.. ఈ విధానంలో ఇప్పటివరకు అమలవుతున్న విధానాన్ని మారుస్తూ కొత్త నిబంధనను అమలు చేయనున్నారు. అక్టోబరు ఒకటి నుంచి ట్రైన్ రిజర్వేషన్ టికెట్ల బుకింగ్ లో కీలక మార్పును తీసుకొచ్చారు. ఈ మధ్యనే తత్కాల్ బుకింగ్ సమయంలో ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి అన్న విషయం తెలిసిందే. తమ అకౌంట్లను అథార్ తో వెరిఫై చేసుకున్నయూజర్లు మాత్రమే టికెట్ రిజర్వేషన్లు చేసుకునే వీలు ఉంది. ప్రస్తుతం తత్కాల్ బుకింగ్ కోసం ఈ విధానం అమల్లో ఉండగా.. అక్టోబరు ఒకటి నుంచి సాధారణ రిజర్వేషన్



టికెట్లకు కూడా ఇదే విధానాన్ని అమలు చేయనున్నారు. దీంతో.. ఐఆర్ టీసీ అకౌంట్ కు సంబంధించి ఆధార్ తో అప్డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. అప్పుడు మాత్రమే రిజర్వేషన్ చేసుకునే వీలు ఉంటుంది. వచ్చే నెల ఒకటి లోపు మీ ఐఆర్ సీటీసీ అకౌంట్ ను ఆధార్ తో వెరిఫై చేసుకోవటం మర్చిపోవద్దు. ఈ మార్పు ఎందుకన్న సందేహం రావొచ్చు. దీనికి సహేతుకమైన కారణమే ఉంది. ప్రస్తుతం ఏ రైలుకు అయినా ప్రయాణ తేదీకి 60 రోజుల ముందే టికెట్ రిజర్వు చేసుకునే వెసులుబాటు ఉంది. తత్కాల్ టికెట్లకు ఎలా అయితే కొందరు ముదుర్లు బ్లాక్ చేస్తున్నారో.. అదే విధంగా ఆదరణ బాగా ఉన్న రైళ్ల రిజర్వేషన్ సీట్లను బుకింగ్ మొదలైనంతనే బ్లాక్ చేస్తున్నారు. అలాంటి వారికి చెక్ పెట్టేందుకు వీలుగా ఆధార్ తో అథెంటిక్ చేయటం ద్వారా.. రిజర్వేషన్ టికెట్లు పక్కదారి పట్టకుండా ఉండేందుకు వీలు కలుగుతుంది. కొందరు అక్రమార్కుల కారణంగా సామాన్య యూజర్లు నష్టపోతున్నారు. అలాంటి వారికి మేలు చేయాలన్న ఉద్దేశంతో ఈ విధానాన్ని తెర మీదకు తీసుకొచ్చారు. ఇక.. రైల్వే స్టేషన్లలో ఉండే రిజర్వేషన్ కౌంటర్ లో టికెట్ బుకింగ్ కు సంబంధించి ఎలాంటి కొత్త మార్పు ఉండదు. పాత విధానమే అమల్లో ఉంటుంది.

చురకలు

## సంపాదకీయం

# రష్యా-ఉక్రెయిన్ యుద్ధం భారత్‌కు ఆర్థికంగా వరం!


ఉక్రెయిన్ బలగాలు రష్యాపై చేసిన డ్రోన్ దాడుల ఫలితంగా ఆ దేశ చమురు రంగం తీవ్రంగా దెబ్బతింది. సిజరాన్, క్రస్న డోర్ వంటి పది ప్రధాన రిఫైనరీలపై జరిగిన దాడులతో రష్యా శుద్ధి సామర్థ్యం దాదాపు 17 శాతం వరకు పడిపోయింది. ఈ రిఫైనరీలకు రోజుకు 11 లక్షల బ్యారెళ్ల చమురును శుద్ధి చేసే సామర్థ్యం ఉంది. ఈ దాడుల వల్ల రష్యా దేశీయ అవసరాలను తీర్చుకోవడానికే కష్టంగా మారింది. దీనితో, ఉత్పత్తి అయిన ముడి చమురును భారీ డిస్కౌంట్లతో అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేయక తప్పని పరిస్థితి ఏర్పడింది.

**భారత్‌కు అపూర్వమైన అవకాశం...** ప్రపంచంలో మూడవ అతిపెద్ద చమురు దిగుమతి దేశమైన భారతదేశం ఈ పరిస్థితిని బాగా ఉపయోగించుకుంటోంది. బ్రెంట్ క్రూడ్‌తో పోలిస్తే రష్యా యొక్క ఉరల్స్ క్రూడ్ చమురు బ్యారెల్‌కు 5-6 డాలర్ల తక్కువ ధరకు లభిస్తోంది. దీనితో రిలయన్స్, నయరా, ఇండియన్ ఆయిల్, హిందూస్థాన్ పెట్రోలియం, భారత్ పెట్రోలియం వంటి భారతీయ చమురు కంపెనీలు రష్యా నుంచి భారీగా చమురును కొనుగోలు చేస్తున్నాయి. భారీ డిస్కౌంట్లతో చమురు దిగుమతి చేసుకుంటున్న భారతీయ రిఫైనరీలు లాభాలు ఆర్జిస్తున్నాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ దేశీయ అవసరాలను తీర్చడంతో పాటు యూరప్, సింగపూర్, ఆఫ్రికా వంటి మార్కెట్లకు పెట్రోల్, డీజిల్‌ను భారీగా ఎగుమతి చేస్తోంది. రిలయన్స్ రిటైల్ విభాగం 'జియో-బీపీ' కూడా లాభాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే పెట్రోల్ ధరలు 34 శాతం, డీజిల్ ధరలు 39 శాతం పెరిగాయి.

**ఆర్థిక ప్రయోజనాలు, భవిష్యత్ అవకాశాలు...** ఒక నివేదిక ప్రకారం, రష్యా చమురుపై లభిస్తున్న డిస్కౌంట్ల వల్ల భారత్‌కు దాదాపు 2.5 బిలియన్ డాలర్ల వరకు లాభం చేకూరవచ్చు. ఈ సమయంలో చైనాలోని కొన్ని రిఫైనరీలు నిర్వహణ సమస్యల వల్ల ఉత్పత్తిని తగ్గించగా.. భారత్ మాత్రం పూర్తి సామర్థ్యంతో దిగుమతులను కొనసాగిస్తోంది. దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో అదనపు అవకాశాలను భారత్ సొంతం చేసుకుంటోంది. ఈ సంవత్సరంలో భారత్ నుంచి యూరప్‌కు డీజిల్ ఎగుమతులు 137 శాతం పెరిగి రోజుకు 2.42 లక్షల బ్యారెల్స్‌కు చేరాయి. ఈ గణాంకాలు అంతర్జాతీయ మార్కెట్లో భారతదేశ స్థానాన్ని, ఆర్థిక లాభాలను స్పష్టం చేస్తున్నాయి.

**సవాళ్లలో ఆర్థిక వృద్ధి...** రష్యా-ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం ప్రపంచానికి ఒక సవాలుగా ఉన్నప్పటికీ, ఈ సంక్షోభం భారత్‌కు ఆర్థికంగా ఒక వరంగా మారింది. అంతర్జాతీయ రాజకీయ పరిణామాలు సృష్టించిన సవాళ్లను భారత్ ఒక లాభదాయకమైన అవకాశంగా మలుచుకుంది. రష్యా నుంచి లభిస్తున్న డిస్కౌంట్ చమురును ఉపయోగించుకుని భారతీయ కంపెనీలు లాభాలు ఆర్జించడమే కాకుండా అంతర్జాతీయ మార్కెట్లలో తమ స్థానాన్ని పటిష్టం చేసుకుంటున్నాయి. ఈ పరిణామాలు భారత ఆర్థిక వ్యవస్థకు కొత్త ఉత్సాహాన్ని ఇస్తున్నాయి.

# ప్రజాసేవలో ఘనాపాఠీ ... రారెవరూ ఆయనకు సాటి - సెప్టెంబర్ 17 ...వావిలాల గోపాలకృష్ణయ్య జయంతి



నీతి, నిజాయతీలకు మారుపేరు, నిబద్ధతకు ప్రతిరూపం ఆయన. తన జీవితాన్ని ప్రజలకే అంకితం చేసిన ప్రజా నాయకుడు. రాజకీయాల విలువలకు పెద్దపీట వేసి, ప్రజాపోరాటాల్లో పాల్గొన్న చైతన్యశాలి. స్వాతంత్ర్య సమరయోధుడు, ఉత్తమ శాసనసభ్యుడు, గ్రంథాలయోద్యమ సారథి, రాష్ట్ర తొలి అధికార భాషా సంఘం అధ్యక్షుడు, బహుగ్రంథకర్త. పోరాట యోధుడు, ప్రజా సేవకుడు. ఆజన్మ బ్రహ్మచారి, అపర భీష్ముడు. ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. ఖాదీ దుస్తులతో, చేతిలో ఖాదీ సంచితో నిరాడంబరంగా కనిపించే అజాత శత్రువు.ఆయన గురించి ఎంత రాసినా తక్కువే. ఆయనే ప్రజలు మెచ్చిన నేత...వావిలాల గోపాల కృష్ణయ్య. వావిలాల గోపాలకృష్ణయ్య (సెప్టెంబరు 17, 1906 – ఏప్రిల్ 29, 2003) భారత స్వాతంత్ర్య సమరయోధుడు, గాంధేయవాది, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభ్యుడు, పద్మ భూషణ పురస్కార గ్రహీత. కళా ప్రపూర్ణ బిరుదు గ్రహీత. 1906 సెప్టెంబరు 17న గుంటూరు జిల్లా సత్తెనపల్లిలో వావిలాల నరసింహం, పేరిందేవి దంపతులకు నాలుగో సంతానంగా జన్మించారు. పలనాడు పుల్లరి సత్యాగ్రహంలో గార్లపాటి హనుమంతరావు తదితర నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఆంధ్ర రాష్ట్ర కాంగ్రెస్ సంఘ సభ్యుడిగా ఉంటూ, ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం కావల్సిందేనని పట్టుబట్టారు. 1925లోనే సత్తెనపల్లిలో 'శారదానిలయం' అనే గ్రంథాలయాన్ని, వావిలాల గోపాలకృష్ణయ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రీసెర్చ్ అండ్ హయర్ స్టడీస్ అనే సంస్థని గుంటూరు అరండల్‌పేటలో ఏర్పాటు చేశారు. 1974 – 77 కాలంలో తెలుగు అధికారభాషా సంఘం అధ్యక్షునిగా, గుంటూరు జిల్లా కాంగ్రెస్ సంఘ సంయుక్త కార్యదర్శిగా, గుంటూరు జిల్లా కాంగ్రెస్ సివిక్ బోర్డు సభ్యుడిగా పనిచేసారు. 1952లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర శాసనసభకు ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసి, గెలుపొందారు. 1952లో సత్తెనపల్లి నియోజకవర్గం ఏర్పడటంతో అక్కడ పోటీ చేసి తొలి శాసన సభ్యుడిగా ప్రజలకు సేవలు అందించారు. 1952, 1955, 1962, 1972 ఎనికల్లో వరుసగా నాలుగు పర్యాయాలు శాసన సభ్యునిగా గెలిచి 19 ఏళ్ల పాటు ప్రజా సేవలో నిలిచారు. ఆయన కృషి ఫలితంగానే శాతవాహన నూలు మిల్లు, ఫణిదం చేనేత సహకార సంఘం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటయ్యాయి. సమాజంలో అసమానతలను రూపు మాపేందుకు ఎంతో కృషి చేశారు. మద్యపాన నిషేధ ఉద్యమ సంస్థ బాధ్యుడిగా, గ్రంథాలయ ఉద్యమ రథ సారథిగా, దళిత, గిరిజనోద్ధరణ ఉద్యమ నాయకుడిగా ఆయన ముందు నడిచారు. పద్మభూషణ్‌తో పాటు ఎన్నో పురస్కారాలు, సత్కారాలను అందుకున్నారు. ఏక సంథాగ్రాహి, తెలుగు ఆంగ్ల భాషలలో అనేక గ్రంధాలు రచించిన మేధావి. తెలుగులో నలభై అయిదు, ఆంగ్లంలో పదహారు పుస్తకాలు రచించారు. 1922లో 'శివాజీ', 1947లో మద్రాసు మంత్రివర్గమా ఎక్కడికి? 1951లో విశాలాంధ్రం, 1976-77లో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయోద్యమం తదితర రచనలు చేశారు. పత్రికా విలేఖరిగా ప్రారంభించి ప్రజా సేవకే సర్వం త్యాగం చేసిన త్యాగశీలి, ధన్య జీవి గోపాలకృష్ణయ్య. సుదీర్ఘమైన ఆయన ప్రజా జీవిత ప్రస్థానంలో అనేక ఉద్యమాలలో పాల్గొన్నారు. 'విశాలాంధ్ర' ఉద్యమం, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర ఉద్యమం. అన్నిటికన్నా అతి ముఖ్యమైనది నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కోసం ఆయన చేసిన కృషి మరువ రానిది. నాటి ప్రధాని నెహ్రూ చేత ఆ ప్రాజెక్ట్ కు శంఖుస్థాపన చేయించటంలో వావిలాల కృషి మరవ లేనిది. ఆంధ్ర విశ్వ విద్యాలయం ఆయనను 'కళాప్రపూర్ణ' అనే సత్కారంతో గౌరవించింది. భారత ప్రభుత్వం వీరిని 'పద్మ భూషణ్' బిరుదుతో సత్కరించింది. చివరి రోజులలో అనారోగ్యానికి గురై నిమ్స్‌లో కొంతకాలం వైద్యం చేయించుకొన్న ఆయన 2003 ఏప్రిల్ 29న మరణించారు. వావిలాల శత జయంతిని పురస్కరించుకొని 2006 సెప్టెంబర్ 14వ తేదీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నాటి ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య, నాటి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే ధర్మాన ప్రసాదరావు, నాటి సహకార శాఖ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ తదితరుల భాగస్వామ్యంతో సత్తెనపల్లి తాలుకా సెంటర్‌లో వావిలాల గోపాలకృష్ణయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# నిజాం నిరంకుల పాలనకు చరమగీతం - హైదరాబాద్ భారత యూనియన్లో విలీనం - నేడు తెలంగాణ విమోచన దినం

నిజాం కబంధ హస్తాల నుండి హైదరబాదు సంస్థానం విముక్తి పొందిన రోజును తెలంగాణ విమోచన లేదా విలీన దినంగా పాటిస్తారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి దేశవ్యాప్తంగా 565 సంస్థానాలు ఉండేవి. బ్రిటీష్ పాలకులు స్వాతంత్ర్యం ఇస్తూనే... సంస్థానాలు ఇండియాలో కలవాలో లేదో నిర్ణయించుకునే అవకాశం సదరు పాలకులకే ఇచ్చారు. ఫలితంగా... మూడు సంస్థానాలు ఇండియాలో కలవలేదు. అవి కాశ్మీర్, జునాఘడ్, హైదరాబాద్ (నైజాం). ఆ పరిస్థితుల్లో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్... ప్రత్యేక శ్రద్ధ పెట్టి... జునాఘడ్ సంస్థానాన్ని భారత్‌లో కలిసేలా చేశారు. నైజాం నవాబ్ మాత్రం విలీనానికి ఒప్పుకోలేదు. అప్పట్లో రాజాకార్ల పేరుతో ప్రత్యేక సైన్యాన్ని తయారుచేసిన ఖాసిం రజ్వీ... మారణకాండకు తెగబడ్డారు. స్వాతంత్ర్యం వచ్చాక దాదాపు 13 నెలలపాటూ... తెలంగాణ ప్రజలు చూడని నరకం లేదు. కనీసం తినడానికి తిండి, తాగడానికి నీళ్లు కూడా లేకుండా చేశారు. ప్రజల్లో తిరుగుబాటు మొదలైంది. ఆదివాసీలు ఏకమై ఎదురు తిరిగారు. ఎంతో మంది ఉద్యమ నేతలు, కళాకారులు... అందరూ తమ ప్రాణాలు ఫణంగా పెట్టారు. ఉద్యమం అత్యంత తీవ్ర స్థితికి చేరిన స్థితిలో, కేంద్ర ప్రభుత్వం నిజాం సంస్థాన్ని ఇండియాలో కలిపేయమని సర్దార్ వల్లభాయ్ పటేల్‌కి సూచించగా, సర్దార్ వల్లభాయ్ పటేల్ ఉక్కు సంకల్ప కారణంగా, నిజాం లొంగుబాటు జరిగి నిజాం రాష్ట్రం భారత దేశంలో విలీనం అయింది. పొట్ట కూటికోసం వర్తక వ్యాపారాలకై వచ్చిన శ్వేత జాతీయులు , రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యంలో సమస్త భారతావనిని అంతర్భాగం చేసుకోగా, ఎన్నో సుదీర్ఘ పోరా టాలు, ఎందరో మహనీయుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సాధించినా, నిజాం ఏలుబడిలో ఉన్న తెలంగాణ ప్రాంతం స్వతంత్రం కావడానికి సంవత్సరంకు పైగా సమయం పట్టింది. 1724-1948 మధ్యకాలం 224 సంవత్సరాల పాటు 8 తెలంగాణ జిల్లాలు, 5 మరట్వాడా జిల్లాలు, 3 కర్ణాటక జిల్లాలతో కలిపి 16 జిల్లాల హైదరాబాద్ రాష్ట్రం మూడు భాషలతో కొనసాగింది. 1948 సెప్టెంబర్ 13 న "ఆపరేషన్ పోలో" " పేరున పోలీసు చర్య ఫలితంగా 17న మీర్ ఉస్మాన్ అలీఖాన్ లొంగి పోవడంతో పోవడంతో హైదరాబాద్ రాష్ట్రం భారతదేశం ప్రభుత్వ పాలనలో విలీనమైంది. హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పరిపాలనా చివరి అంకంలో ఖాసిం రజ్వీ నేతృత్వంలో రజాకార్ల దళాల దురాగతాలు సహించ రానివైనాయి. ఉద్యమ కారులను గురి చేసిన క్రూరాతిక్రూర అమానుష చిత్రహింసలకు హద్దులు లేకుండా పోయాయి. 90 రకాల పన్నుల విధింపే కాకుండా తమ పలుకు బడిలోని ప్రజలను బానిసలుగా చూస్తూ , వెట్టి చాకిరీలు చేయించు కున్నారు . ప్రజల సొమ్ముతో జల్సాలు చేసు కున్నారు. ఎదిరిస్తే కాల్చి చంపారు. మత మార్పిడులు బలవంతంగా చేశారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయలను అణచి వేశారు. స్థానీయ భాషలను, అనాదిగా ఉన్న సంప్రదాయాలను హీనంగా చూశారంటే తెలుగు వారి దుర్గతి స్పష్టమవుతుంది. స్వామి రామానంద తీర్థ నాయకత్వంలో ఆర్యసమాజ్, కమ్యూనిస్టుల ఆధ్వర్యంలో సాయుధ పోరాటాలు, కవులు, రచయితలు తమతమ పాత్రలు నిర్వహించి, నిజాం పాలనకు వ్యతిరేకంగా ప్రజా చైతన్యానికి కృషి సల్పారు. నల్గొండలో పురుడు పోసుకున్న నిజాం వ్యతిరేక పోరాటం రాజ్యం అంతటా విస్తరించింది. రావి నారాయణ రెడ్డి, చంద్ర రాజేశ్వరరావు , మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలా దేవి, బొమ్మగాని ధర్మభిక్షం, మాడపాటి హన్మంతరావు , సురవరం ప్రతాపరెడ్డి, కాళోజీ నారాయణరావు, దాశరథి, షోయబుల్లా ఖాన్, అనభేరి ప్రభాకర్ రావు, జమలాపురం కేశవరావు, లక్ష్మీనర్సయ్య, బద్దం ఎల్లారెడ్డి, మగ్ధూం మొహియుద్దీన్, దొడ్డి కొమురయ్య, కోదాడ నారాయణరావు , బెల్లం నాగయ్య, సింగిరెడ్డి భూపతిరెడ్డి, రాంజీగోండు, కొమురం భీం, రఘునాధరావు కాచే , అలుగు వీరమ్మ, కిషన్ మోదాని, లక్క కిష్టయ్య, బత్తిని మొగిలయ్య, కాటం లక్ష్మీ నారాయణ, మర్రి చెన్నారెడ్డి, వందేమాతరం రాంచందర్ రావు , కర్నె వెంకట కేశవులు ఒక్కరేమిటి... వివిధ పోరాట మార్గాలలో, ఎందరో త్యాగధనులు తమతమ పాత్రలను పోషించి, ప్రాణాలను ఫణంగా పెట్టారు. నారాయణరావు పవార్, శంశా బాద్ గంగారామ్ తో కలిసి ఏకంగా నిజాం పైనే బాంబులు విసిరి సంచలనం సృష్టించారు. దాశరథి కారాగారంలో గోడలపై నిజాం వ్యతిరేక కవితలు రాశారు. కాళోజీ, సుద్దాల హనుమంతు, యాదగిరి లక్ష్మీనారాయణ లాంటి వారు జన బాహుళ్య కవితలల్లారు. ఇలా నిజాం వ్యతిరేక పోరాటాలు వివిధ రూపాల్లో ఉద్ధృతం అయిన వేళ . . . హైదరాబాద్ ప్రత్యేక రాష్ట్రంగా నైనా , లేక పాకిస్తాన్లో అంతర్భాగంగా నైనా ఉండాలని నిజాం ప్రయత్నిస్తూ, ఐక్య రాజ్య సమితికి నిజాం, భారతదేశంపై ఫిర్యాదు చేయడానికి దూతలను సైతం పంపాడు. పోరాటానికి దేశాల నుండి




ఆయుధ సంపత్తిని పొందే కృషి సల్పారు. ఈ క్రమం లోనే "ఆపరేషన్ పోలో," పేరుతో నాటి భారత హోం మంత్రి, ఉక్కు మనిషి సర్దార్ పటేల్ నేతృత్వంలో " పోలీసు చర్య" చేపట్టడం జరిగింది. జనరల్ జె. ఎన్. చౌదరి నాయకత్వంలో 1948 సెప్టెంబర్ 13 న సైనిక చర్య ప్రారంభమైంది. భారత సైన్యం విడివడి విజయవాడ, బీదర్ వైపుల నుండి నలు వైపులా ముట్టడికి ముందుకు సాగాయి. ఓటమిని తప్పించుకో లేని నిజాం, దిక్కు తోచక, లేక్ వ్యూ అతిథి గృహంలో ఉన్న భారత ఏజెంట్ మున్షీని కలిసి, లొంగు బాటు నిర్ణయాన్ని ప్రకటించాడు. బొల్లారం వద్ద నిజాం, సర్దార్ పటేల్ ముందు తలవంచి, లొంగి పోవడంతో, సైనిక చర్య సెప్టెంబర్ 17 న సఫలీకృతమైంది. తద్వారా హైదరాబాద్ రాజ్యం, భారత యూనియన్లో విలీనమైంది. నిజాం ప్రధాన మంత్రి లాయక్ అలీని తొలగించి, ఖాన్ రజ్వీని ఖైదు చేశారు. తర్వాత లాయక్, రజ్వీ పాకిస్తాన్ పారి పోయారు. శాసన సభ రద్దు చేయబడి సెప్టెంబర్ 18న సైనిక చర్యను సఫలం చేసిన జే. ఎన్. చౌదరి, సైనిక గవర్నర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు . ఎం. కె. వెల్లోడి ముఖ్యమంత్రి 3, నియుక్తు లైనారు. 1956 ఏప్రిల్ 1న నిజాంకు , భారత ప్రభుత్వానికి ఒప్పందం కుదిరి, నిజాంకు ఏడాదికి పన్నులు లేకుండా, యాభై లక్షల రూపాయల భరణం చెల్లింపుకు, ప్రపంచంలో నిజాం ఎక్కడికి వెళ్ళినా హైదరాబాద్ పూర్వపు రాజుగా బిరుదులు కొనసాగింప బడేందుకు, ప్రభుత్వం అంగీకరించింది. 1956 అక్టోబర్ 31 వరకు నిజాం రాజ్ ప్రముఖ్ గా కొనసాగారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# విరాట్ స్వరూపుడు విశ్వకర్మ

**విశ్వ మంగళ మాంగళ్య ఎ విశ్వ విద్యా వినోదినేబీ విశ్వ సంసార భీజాయ ఎ నమస్తే విశ్వ కర్మణే.**
**విశ్వాయ విశ్వ రూపాయ ఎ నమస్తే విశ్వ మూర్తియేబీ విశ్వ మాత పితా రూప ఎ విశ్వకర్మ నమోస్తుతే.**



సకల ప్రాణి కోటిని సృష్టించు జగత్పతి విశ్వకర్మ యొక్క ఆవిర్భావం ఈ సృష్టికి పూర్వమే స్వయంభువుగా వెలసిన రూపమే విశ్వకర్మ. పరమాత్మ విశ్వకర్మ ఐదు ముఖాలతో, పది చేతులతో స్వయంభువుగా అవతరించిన రూపంగా భావిస్తారు. విశ్వకర్మ విశ్వకర్మ ఋగ్వేదంలో, కృష్ణ యజుర్వేదంలో, శుక్ల యజుర్వేదంలో సృష్టి కర్తగా పేర్కొన బడినాడు. అథర్వణ వేదంలో ఆహార ప్రదాతగా వర్ణించ బడినాడు. పురుష సూక్తంలో విరాట్ పురుషుడుగా కీర్తించ బడినాడు. సహస్ర బాహుగా, సహస్ర చక్షుగా, సహస్ర పాదుడుగా, సహస్ర ముఖుడుగా అన్ని వేదాలలో వర్ణించ బడినాడు. సకల వేదముల ప్రకారం విశ్వకర్మయే సృష్టికర్త. వేదములు విశ్వకర్మను సర్వపాప సంహర్తగా పేర్కొనాయి. సర్వ దిక్కులను పరికించు దృష్టి కలిగిన అమిత శక్తి కలవాడు కనుకనే ఈయన భగవంతుడు అని ఋగ్వేదము ఈయనను భగవంతునిగా పరిగణించింది. మహా భారతము ఈయనను వేయికళలకు అధినేతగా అభివర్ణించింది. అర్చమూర్తిని విశ్వకర్మ పురాణము పంచ శీర్షుడుగా వర్ణించింది. విరాట్ వి భగవానుడు (పంచ ముఖుడు) ఐదు ముఖములు కలవాడు. సృష్టి తొలినాళ్ళ నుంచి సుప్రసిద్ధులైన శిల్పకారులు ఐదు మంది ఉన్నారు. వారు విశ్వకర్మకు జన్మించారు. విరాట్ విశ్వకర్మ యొక్క పంచ ముఖాల నుండి మను, మయ, త్వష్ట, శిల్పి, విశ్వజ్ఞ బ్రహ్మలు ఉద్భవించారు, ఈ పంచ బ్రహ్మల నుండి వారి సంతతి అయిన ఐదుగురు (సనగ, సనాతన, అహభౌసన, ప్రత్నస, సుపర్ణస. ) పంచార్షేయ బ్రాహ్మణులు (విశ్వ బ్రాహ్మణులు) ఉద్భవించారు. వీరి ద్వారా చేయు శాస్త్రం, వృత్తులు నిర్ధేశింప బడినవి. వీటితో పాటు పౌరోహిత్యం కూడా వారి వృత్తులలో భాగమే. ఈయనను దేవతల శిల్పి (దేవా శిల్పి) అంటారు. వృత్తి విద్యలు, నిర్మాణ, ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించిన విద్యలకు ఈయన అధిపతి. విశ్వకర్మ సకల కళలకు ఆది దేవుడు, అధిపతి. దేవ లోకాలను నిర్మించిన భవన శిల్పి, వాస్తు శిల్పి, స్థపతి (ఆర్కిటెక్చర్). దేవతలకు ఆకాశాన విహరించే పుష్పక విమానాలు, ఆయుధాలు, వివిధ రకాల సువర్ణాభరణాలు మరియు పనిముట్లను సృష్టించి ఇచ్చిన రూప శిల్పి, విశ్వకర్మ భగవానుడు సమస్త హస్త కళలన్నింటికి ఆది దేవుడు, విశ్వము యొక్క ప్రధాన రూపశిల్పి. విశ్వకర్మ ప్రపంచానికి దైవ యాంత్రికుడు (ఇంజనీరు). మొత్తం విశ్వం యొక్క దివ్య చిత్ర లేఖకుడు, మరియు అన్ని దేవతల 'రాజ భవనాలు అధికారిక భవన నిర్మాతగా వున్నాడు. విశ్వకర్మ దేవతల ఆయుధాలను రూపకర్త ఉన్నాడు. వెయ్యి హస్తకళ ఆకృతులకు కార్యనిర్వాహణాది కారి. దేవతల యొక్క వడ్రంగి, చేతివృత్తుల అత్యంత ప్రముఖత, అన్ని ఆభరణాలు యొక్క రూపకర్త మరియు ఒక గొప్ప మరియు శాశ్వత కీర్తిని కలిగిన దేవుడు యొక్క అధినేత అని మహా భారతంలో ఆయన గురించి వివరిస్తుంది. నాలుగు యుగాలన్నింటి లోను ఆయన దేవతలకు అనేక పట్టణాలు మరియు రాజ భవనాలు నిర్మించి ఇచ్చిన స్థపతి, వాస్తు మరియు భవన శిల్పి. సత్య యుగంలో ఇంద్రుడు పరిపాలించే ఇంద్ర లోకాన్ని, త్రేతాయుగంలో స్వర్ణ లంకని ద్వాపర యుగంలో ద్వారకా నగరాన్ని, కలియుగంలో హస్తినా పురాన్ని, ఇంద్ర ప్రస్థాన్ని నిర్మించిన అద్భుత శిల్పి, గొప్ప స్థపతి. పుట్టుక, ఆకారం లేకుండా స్వయంభుగా వెలసిన ఈ విశ్వకర్మ భగవానుని ప్రతి యేట ఎంతో ఘనంగా భక్తి శ్రద్ధలతో పండగగా విశ్వకర్మీయులు జరుపు కుంటారు. శ్లోఎం నభూమి నజలం చైవ నతేజో నచ వాయవ: నచబ్రహ్మ నచవిష్ణు నచ రుద్రస్య తారకః సర్వ శూన్య నిరాలంబో స్వయంభూ విశ్వకర్మణ. (మూల స్తంభ పురాణం)...భూమి, నీరు, అగ్ని, వాయువు,ఆకాశము, మరియు బ్రహ్మ, విష్ణు, మహేశ్వర – ఇంద్ర –సూర్య – నక్షత్రములు పుట్టక ముందే విశ్వకర్మ తనంతట తాను స్వయంభు రూపమై అవతరించి నాడు. ఐదు ముఖాలతో పంచ తత్వాలతో, పంచ రంగులతో, పంచ కృత్యములతో వెలసిన విశ్వకర్మ దేవుడు విశ్వ బ్రాహ్మణులకు కులగురువైనాడు.

**శ్లోఎం పూర్వావనా త్సానగః దక్షణా త్సనాతనఃబీ అపరా దహభూవః ఉద్వీచ్యాం ఉర్ధవాత్సుపర్ణః**

విశ్వకర్మ పరాత్పరుని యొక్క తూర్పు ముఖమైన సద్యోజాతములో సానగ బ్రహ్మర్షి మను బ్రహ్మయు, దక్షిణ ముఖమైన వసుదేవములో సనాతన మహర్షి యను మయబ్రహ్మయు, పశ్చిమ ముఖమైన అఘోరియునందు అహభూవ మహర్షి యను త్వష్ట బ్రహ్మయు, ఉత్తర ముఖమైన తత్పురుషములో ప్రత్న మహర్షి యను శిల్పి బ్రహ్మయు, ఊర్ధ్వ ముఖమైన ఈశానములో సువర్ణ మహర్షియను విశ్వజ్ఞ బ్రహ్మయు ప్రభవించినట్లు చెప్పబడినది. ఋక్ వేదం లోని పదవ మండలం 81,82 సూక్తాలు విశ్వకర్మ యొక్క సృష్టి నిర్మాణ క్రమాన్ని వివరిస్తాయి. అందరికీ సుపరిచితమైన పురుష సూక్తం కూడా విశ్వకర్మను విరాట్ పురుషునిగా వర్ణించింది. పూర్వం వృత్తి సమాజంలోని ప్రజలకును, ప్రభువులకును తమ విజ్ఞానాన్ని తమదైన శైలిలో ప్రపంచానికి చాటి చెప్పడానికి ఉపయోగపడే కళానైపుణ్యం విశ్వకర్మీ యులది. ప్రాచీన విజ్ఞానానికి నిలువుటద్దం ఈ వృత్తులు. అసలు ఈ సమాజం నడవడానికి వీరి పాత్ర కీలకంగా ఉంటుంది. విశ్వ బ్రాహ్మణులు పంచ వృత్తులతో పాటు పౌరోహిత్యం కూడా చేస్తారు, పూర్వ కాలంలో, రాజ్యానికి శుభములు సమ కూర్చేందుకు, పొరుగు దేశరాజుల దండయాత్రల వంటి విషమ పరిస్థితుల లోను మంత్రి, జ్యోతిష్కులు, పురోహితులతో రాజు సమాలోచనలు జరిపేవాడు. వివాహాది షోడశ కర్మలు, పూజలు, వ్రతాలు మరియు యజ్ఞ యాగాదులు, జరుపడానికి సామన్య ప్రజలు జ్యోతిషుని, పురోహితుని తప్పక ఆశ్రయించేవారు. ఈ విశ్వకర్మల గురించి వేద, పురాణ, ఇతిహాసాలలో, ప్రాచీన సాహిత్యంలో,ఆధునిక సాహిత్యంలో వీరి గురించి ప్రస్తావించ బడినది. ఉదహరణకు ప్రజాకవి వేమన తన శతకంలో అంటాడు "విశ్వకర్మ లేని విశ్వంబు లేదు" అని మరోక చోట "విశ్వకర్మ దేవాది దేవుడు" అని ప్రస్తావించాడు. ఇదే విధముగా విశ్వకర్మ గురించి నన్నయ, తిక్కన, ఎర్రన, గోన బుద్దారెడ్డి, హూళక్కి భాస్కరుడు, కంకంటి పాప రాజు, మారన, పోతన, శ్రీనాధుడు, చేమకూర వేంకటకవి, పుష్పగిరి తిమ్మన, ధూర్జటి, బద్దేన, వేమన, తరిగొండ వెంగమాంబ, మట్ల అనంతరాజు, దొంతిరెడ్డి పట్టాభి, రామదాస కవి మొదలగు వారెందరో వారి వారి రచనలలో ప్రస్తావించారు. విశ్వ బ్రాహ్మణుల వృత్తుల ద్వార సమాజ నిర్మాణంలో ప్రధాన పాత్ర పోషిస్తూ వస్తున్నారు. వీరిని ఈ సమాజంలో ఆచార్య, దైవజ్ఞ , ఆచారి అనే పేర్లతో పిలుస్తుంటారు. దేవాలయాలలో విగ్రహాలు తయారు చేయువారు విశ్వకర్మలే. ఇంతటి ప్రత్యేకతలు కలిగిన వీరు పూర్వం యంత్ర పరికరాలు రాక ముందు పనులన్ని మానవ శ్రమ తోనే ముడిపడి ఉండేవి. లోకంలో మానవ జీవనానికి విశ్వకర్మీయుల కులవృత్తులు ప్రధాన ఆధారంగా ఉండేవి, ఉన్నాయి. ఈ విశ్వకర్మ కులంలో జన్మించిన శ్రీమద్వి విరాట్ శ్రీ పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామి కుల వృత్తులను చేస్తూనే కాల జ్ఞానాన్ని చెప్పాడు. నిష్ఠాగరిష్ఠులైన ఈ విశ్వ బ్రాహ్మణులు కుల వృత్తులనే కాక జ్యోతిష, పౌరోహిత, యంత్ర, గృహవాస్తు నిర్మాతలుగా, విద్యా వేత్తలుగా, వైద్యులుగా, ప్రకృతి వైద్యులుగా, శాసన లేఖకులుగా, ఆర్కిటేక్చర్లుగా, సివిల్ ఇంజనీయర్లుగా, అన్ని రంగాలలో, నాటి నుండి నేటి వరకు సకల కళల యందు వీరి ప్రావీణ్యతను నిరూపిస్తూ ఈ విశ్వం నందు నిష్ణాతులై విరాజిల్లుతున్నారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# కాలువ జలం.. పంటకు చేరితేనే ఫలం

గుర్రంపోడు : ఏఎమ్మార్ ప్రాజెక్టు పరిధిలోని మైనర్, పంట కాల్వలు కంప చెట్లు పొదలతో నిండి అధ్వానంగా మారాయి. ప్రధాన కాల్వతో పాటు మేజర్ కాల్వలు ఓ మోస్తరుగా బాగున్నప్పటికీ మైనర్ కాల్వలు వాటి ఉప మైనర్ కాల్వలైన పంట కాల్వలు చాలా చోట్ల కనిపించడం లేదు. దీంతో పంట భూములకు నీరందని పరిస్థితి నెలకొంది. ఏఎమ్మార్పీ డి-20 పరిధిలోని 2ఆర్ మైనర్ కాల్వలో ఏపుగా కంప చెట్లు, పొదలు పెరగడంతో అక్కడి 2ఆర్ మైనర్ కాల్వ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది.

**పాతికేళ్లుగా మరమ్మతుల్లేవ్..**

ఏఎమ్మార్ ప్రాజెక్టు 132 కిలోమీటర్ల పొడవైన ప్రధాన కాల్వతో పాటు 150 కిలోమీటర్ల పొడవైన మేజర్, మైనర్‌కాల్వలు ఉన్నాయి. ప్రభుత్వం ప్రధాన కాల్వతో పాటు మేజర్‌కాల్వల మరమ్మతులపై మాత్రమే



దృష్టిసారిస్తోంది. ఈ సారి పూర్తిస్థాయి మరమ్మతులు కూడా చేయబోతున్నారు. గత పాతికేళ్లుగా కాల్వల్లో నీళ్లు పారుతున్నా మైనర్ కాల్వలు, పంటకాల్వలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలు పలువురి నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మైనర్‌కాల్వలు, పంటకాల్వలకు మరమ్మతులు చేయించాలని అన్నదాతలు కోరుతున్నారు.

ఈ విషయమై ఏఎమ్మార్పీ అధికారి వివరణ ఇస్తూ మేజర్ కాల్వలకే ప్రభుత్వం నిధులు ఇస్తోందని, వాటి తర్వాత మైనర్లకు కూడా ఇచ్చే అవకాశం ఉందన్నారు. ఇబ్బందికరంగా ఉన్నచోట రైతులు స్పందించి పంట భూములకు నీటిని మళ్లించుకోవాలన్నారు.

# ఇదిగో ఇల్లు.. ఏదీ బిల్లు!

మల్యాల: ఇందిరమ్మ పథకం కింద ఇంటిని నిర్మించుకొనే లబ్ధిదారుల్లో కొందరికి బిల్లుల మంజూరులో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో ఆందోళన వ్యక్తమవుతోంది. సాంకేతిక కారణాలతో రావడం లేదని అధికారులు చెబుతున్నప్పటికీ నెలల తరబడి పొరపాట్లను సరిచేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నట్లు బాధితులు వాపోతున్నారు. మల్యాల మండలంలో 403 ఇళ్లు మంజూరు కాగా 293 మాత్రమే నిర్మాణంలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన సర్వాపూర్ గ్రామంలో 110 మంది లబ్ధిదారుల్లో 18 మంది ఇళ్లు నిర్మించుకోబోమని రాతపూర్వకంగా తెలిపినట్లు ఎంపీడీవో స్వాతి తెలిపారు. కొందరి పేర ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పటికీ ఎల్-3 కింద నమోదు చేయడంతో సాంకేతికంగా ఆటంకాలేర్పడుతున్నాయి. ఫలితంగా బిల్లుల మంజూరులో జాప్యం జరుగుతోంది. ఇంజినీరింగ్ అధికారులు సాంకేతిక సమస్యలను సరి చేసి లబ్ధిదారులందరికీ త్వరితగతిన బిల్లులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీవో వెల్లడించారు.

రూ.4 లక్షలు వెచ్చించినా ఒక్కటీ రాలే విజయలక్ష్మి, రామన్నపేట

# ఆలేరు.. క'న్నీరు'

ఆలేరు : భారీ వర్షం ఆలేరు పట్టణంలోని పాత ఆలేరు ప్రాంతాన్ని మరోసారి అతలాకుతలం చేసింది. మూడు ప్రధాన కాలనీలు జలమయమయ్యాయి. సాయంత్రం 4 గంటల నుంచి వర్షం ప్రారంభం కావడంతో రెవెన్యూ, పురపాలిక అధికార యంత్రాంగం స్థానికులను అప్రమత్తం చేయడంతో ప్రజలు కొంత జాగ్రత్తలు తీసుకోవడంతో ప్రాణనష్టం తప్పింది.

మూడున్నర గంటల పాటు వర్షం కురవగా.. 173.8 మి.మీ వర్షపాతం నమోదైంది. రాత్రి ఎనిమిది గంటల సమయంలో.. పట్టణ శివారులోని బైరకుంట, ఈముకుంట అలుగు పోటెత్తడంతో కుమ్మరివాడ, రంగనాయక వీధిలోని ఇళ్లలోకి వరదనీరు చేరడం మొదలైంది. కాలం గడిచినా కొద్ది వరద ఉద్ధృతి పెరగడంతో ప్రమాద ఘంటికలు మోగాయి. తహసీల్దారు వి.ఆంజనేయులు, పుర కమిషనర్ బి.శ్రీనివాస్ ఆయా కాలనీలకు చేరుకుని ప్రజలకు సూచనలు చేశారు. యంత్రాల సాయంతో యుద్ధ ప్రాతిపదికన చేపట్టిన చర్యలు సత్ఫలితాలు ఇచ్చాయి. ప్రభుత్వవిప్ బీర్ల అయిలయ్య, యాదాద్రి ఏసీపీ శ్రీనివాసనాయుడు అర్ధరాత్రి వరకు వరద ప్రాంతాలలో తిరుగుతూ ప్రజలకు ధైర్యం చెప్పారు. రెస్క్యూ బృందాలను రప్పించారు.

**ఇదీ సమస్యకు కారణం..**



పాత ఆలేరు ప్రాంతలోని రంగనాయకవీధి, కుమ్మరివాడ, గణేశ్‌నగర్, పట్టణానికి మరోవైపున లోతట్టు ప్రాంతంలోని సిల్క్‌నగర్‌లో సుమారు ఐదువేల జనాభా నివసిస్తారు. ప్రతీయేటా వర్షాలకు ఇబ్బందులు ఏర్పడుతూనే ఉన్నాయి. గత ఐదేళ్లలో ఇలాంటి ఉపద్రవం జరగడం ఇది రెండోసారి. 30 ఆగస్టు 2021న అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి వంద కుటుంబాల వారు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. నాటి సమస్య తీవ్రతను ప్రజలు మరువక ముందే మరోసారి ఉపద్రవం ముంచుకొచ్చింది. కుమ్మరివాడకు శివారుగా ఉన్న ప్రధాన వరదకాలువ చాలావరకు మూసుకుపోవడం, ఆక్రమణలకు గురికావడం, పురపాలిక కార్యాలయం సమీపంలోని నాలా ఆక్రమణలకు గరికావడం, సమస్యకు ప్రధాన కారణంగా ఉంది. సిల్క్‌నగర్‌కు ఆనుకుని ఉన్న రత్నాల వాగును కొందరు ఆక్రమించుకుని ఇంటి నిర్మాణాలు చేపట్టడంతో వాగు ఇరుకుగా మారింది. రెండు కాలనీల్లో ఏ కుటుంబాన్ని మాట్లాడించినా కన్నీటి పర్యంతమయ్యారు.

# ఎక్కడికెళ్లేది.. ఎవరికి చెప్పేది!



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ఆధునికీకరణ చేయడంతో కార్పొరేట్ స్థాయిలో కనిపిస్తోంది. నగరవాసులతోపాటు జిల్లా నలుమూలాల నుంచి వచ్చే ప్రజలతో నిత్యం కిటకిటలాడుతోంది. దీనికితోడుగా ఇటీవల ఉద్యోగులు, అధికారుల సంఖ్య పెరిగింది. అధికారులు, ఉద్యోగులు, సాధారణ పౌరులు ఎవరనే విషయం తెలియక ప్రజలు అయోమయంలో పడుతున్నారు. అత్యవసర పనుల కోసం అక్కడికి వచ్చి అధికారులు, ఉద్యోగులను కలవాలంటే కార్యాలయం ఎదుటకు వచ్చి నిల్చోవాల్సిందే. తెలిసిన వారిని ఫలానా అధికారి, విభాగం ఎక్కడ ఉంటుందో ఆరా తీసుకుని పోవాల్సిందే. లేదంటే ఏ విభాగంలో ఏ అధికారి ఉంటారో తెలియక అవస్థలు పడుతున్నారు.

**విభాగాల గదులు గుర్తుపట్టడం కష్టంగా**

నగరపాలికలో పౌర సేవా కేంద్రంతోపాటు జనన, మరణ విభాగం, పన్నుల చెల్లింపుల విభాగాలు ఒకే చోట ఉండగా మిగతా విభాగాలు ఎక్కడ ఉన్నాయే కొత్త వారు గుర్తు పట్టడం కష్టంగా మారింది. రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, శానిటేషన్, పరిపాలన, ఆడిట్, ఇంజినీరింగ్, మెప్మా గదులు, విభాగాలు అందరికీ కనిపించేలా లేవు. వీధి దీపాలకు సంబంధించి ఫిర్యాదు చేయాలంటే పౌర సేవా కేంద్రంలోని కాల్ సెంటర్‌లో తప్ప ఆ విభాగం ఎక్కడ ఉందో తెలియదు. దీన్ని తరచూ మార్చుతున్నారు. గదులు లేకపోవడంతో ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు కూర్చొని అధికారులు విధులు నిర్వర్తిస్తున్నారు.

**కనిపించని గుర్తింపుకార్డులు, డ్రెస్ కోడ్**

కార్యాలయ పరిధిలో ఒప్పంద, రెగ్యులర్ ఉద్యోగులు, వార్డు అధికారులు, ఉన్నతాధికారులు పని చేస్తున్నారు. ఇందులో ఉద్యోగులు ఎవరు? ప్రజలు ఎవరనేది గుర్తు పట్టకుండా మారింది.

శానిటేషన్ కార్మికులందరికీ ఆప్రాన్లు ఉన్నా క్షేత్ర స్థాయిలో ధరించడం లేదు. దీంతో పనులు చేసే కార్మికులు ఎవరనేది స్థానికులకు తెలియడం లేదు.

కొందరు బయోమెట్రిక్ హాజరు వేసుకొని బయటకు వెళ్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి.

ఉద్యోగులందరికీ ప్రత్యేకమైన డ్రెస్ కోడ్‌తోపాటు గుర్తింపుకార్డులు మెడలో ధరించేలా చూడాల్సిన అవసరముంది. గుర్తింపుకార్డుతో ఏ ఉద్యోగి ఎంత సమయం సీటులో ఉంటున్నారు? ఎక్కడికి వెళ్తున్నారనే విషయం తెలియనుందని స్థానికులు కోరుతున్నారు.

# కరెంటు కాటేస్తోంది.. బల్దియా చూస్తోంది



కోరుట్ల : ప్రకాశంరోడ్‌లో ఓ భవనానిది. ఇక్కడా 33 కేవీ తీగలుండటంతో రెండేళ్ల కిందట బాలిక విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడింది. దీంతో భవన యజమాని భవనంపై కర్రలు ఉంచి ప్లాస్టిక్ జాలీలను అమర్చారు. నిత్యం భవనంపైకి వెళ్లే సమయంలో బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సి వస్తోందని అందులోని వారు వాపోయారు. పట్టణంలోని కల్లూర్‌రోడ్‌లోని భవనంపై నుంచి వెళ్తున్న 33 కేవీ విద్యుత్తు తీగలివి. ఈ భవనం రహదారి పక్కనే ఉండగా 2024 జనవరి 16న తీగలను గమనించకుండా ఇద్దరు బాలురు గాలిపటాలు ఎగురవేశారు. గాలిపటం విద్యుత్తు తీగలకు తగిలి తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో ఓ బాలుడికి శాశ్వత అంగవైకల్యం వచ్చింది. కోరుట్ల పట్టణ శివారులోని పెద్దగుండు వద్ద 132 కేవీ ఉపకేంద్రం నుంచి కల్లూర్‌రోడ్‌లోని 33 కేవీ ఉపకేంద్రం వరకు సుమారు 60 ఏళ్ల క్రితం 33 కేవీ సామర్థ్యం కలిగిన విద్యుత్తు ప్రధాన లైన్ ఏర్పాటు చేశారు. లైన్ ఏర్పాటు సమయంలో ఈ ప్రాంతంలో వ్యవసాయ క్షేత్రాలుండేవి. అనంతరం పట్టణం విస్తరించడంతో గృహ నిర్మాణాలు పెరిగాయి. వ్యవసాయ భూములను ప్లాట్లుగా చేసి విక్రయించగా కొనుగోలు చేసిన వారు విద్యుత్తు తీగలకు కనీసం 3 మీటర్ల దూరం వరకు నిర్మాణాలు చేపట్టకూడదనే నిబంధనలు పాటించలేదు. తీగల కింద భవన నిర్మాణాలకు పురపాలిక అనుమతులు ఇవ్వకూడదు. కాగా రాజకీయ ఒత్తిళ్లతో మున్సిపల్ అధికారులు మామూళ్లు దండుకొని ఇంటి నంబర్లు వేశారు. వారి బాటలోనే విద్యుత్తు అధికారులు ఎడాపెడా కనెక్షన్లు ఇచ్చారు. చాలా ఏళ్లుగా అనుమతులు లేని ఇళ్ల నుంచి ఆస్తి, కొళాయి పన్నులను బల్దియా అధికారులు వసూలు చేస్తున్నారు.

**రూ.54 లక్షలవుతుందని అంచనాలు**

ప్రమాదకరంగా మారిన విద్యుత్తు లైన్ మార్చాలంటూ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజల నుంచి ఒత్తిడి రావడంతో గతేడాది ఏప్రిల్‌లో విద్యుత్తు అధికారులు ప్రత్యేక సర్వే నిర్వహించారు. సుమారు కిలోమీటరు మేర లైన్ మార్చేందుకు సుమారు రూ.54 లక్షల వ్యయమవుతుందని అంచనాలు రూపొందించి మున్సిపాలిటీకి నోటీసులు జారీ చేశారు. దీంతో వారు నిధులు లేవంటూ రూ.4 లక్షలు మాత్రమే చెల్లించారు. వాటితో ఇటీవల కల్లూర్‌రోడ్‌లో నడిరోడ్డుపై ఉన్న ఓ ఇనుప స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేశారు. పురపాలిక అధికారులు పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించకుండా ఏళ్ల తరబడి జాప్యం చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

బల్దియా నిధులు చెల్లిస్తే పనులు చేపడతాం: రఘుపతి, విద్యుత్తు శాఖ ఏడీఈ మున్సిపల్ అధికారులు మిగిలిన రూ.50 లక్షలు చెల్లిస్తే వెంటనే లైన్ మార్చేందుకు చర్యలు చేపడతాం. ప్రమాదకర తీగల కింద ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని ఆదేశాలున్నా పట్టించుకోకుండా ఇళ్లు కట్టుకోవడం వల్లే సమస్య వచ్చింది.

# 'జల'గల్లా తోడేస్తున్నారు



పెద్దపల్లి : జిల్లాలో చిన్న, మధ్యతరహా పరిశ్రమల నిర్వాహకులు నిబంధనలు గాలికొదిలేస్తున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా యథేచ్ఛగా జల దోపిడీకి పాల్పడుతున్నారు. ప్రతి పరిశ్రమ బోరుకు 'వాటర్ ఫ్లో మీటరు' బిగించాలనే ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారు. విచ్చలవిడిగా భూగర్భ జలాలను తోడేస్తున్నారు. పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ పట్టించుకోవడం లేదు.

**నిబంధనలు ఇవి..**వాల్టా చట్టాన్ని కఠినంగా అమలు చేయడంలో పోలీసు, గనుల, పర్యావరణ, విద్యుత్తు, జిల్లా పరిశ్రమశాఖల్లో నిర్లక్ష్యం నెలకొంది. గనులు, రైస్ మిల్లులు, వాటర్ ప్లాంట్లు, వాణిజ్య అవసరాలకు భూగర్భ జలశాఖ(ఎన్‌వోసీ) తప్పనిసరి. ఒకసారి అనుమతి పొందితే పరిశ్రమలు, ప్యాకేజీ డ్రింకింగ్‌కు 3 ఏళ్లు, మైనింగ్ ప్రాజెక్టులు 5 ఏళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలి. కేంద్ర జల మండలి నిబంధనలు అతిక్రమిస్తే రూ.లక్ష జరిమానా కట్టాల్సి ఉంటుంది.

నెరవేరని లక్ష్యం

జిల్లాలో 957 పరిశ్రమలకు 126 మాత్రమే భూగర్భజల శాఖ అనుమతి తీసుకున్నారు. గ్రానైట్ క్వారీలు, రైస్ మిల్లులు, ఇటుక బట్టీలు, వాటర్ ప్లాంట్ల నిర్వాహకుల జల దోపిడీకి అడ్డూ అదుపు లేకుండా పోతోంది. కొందరు వ్యవసాయ బోర్ల నుంచి పరిశ్రమలకు నీటిని తోడేస్తున్నారు. పరిశ్రమలకు ప్రాథమికంగా అనుమతి లేకపోవడంతోపాటు ఎంత పరిమాణంలో నీటిని వాడుతున్నారో తెలుసుకునే 'వాటర్ ఫ్లో మీటర్' బిగింపు పత్తా లేదు. జిల్లాలో ఈ ఏడాది రూ. 2.30 కోట్లు లక్ష్యం ఉండగా ఇప్పటి వరకు రూ.1.12 కోట్లు మాత్రమే జమయ్యాయి. నిబంధనలు కఠినతరం: లావణ్య, జిల్లా భూగర్భ జల వనరులశాఖ అధికారి

పరిశ్రమల నిర్వహణకు సంబంధించి అనుమతులు తీసుకోవాలి. నోటీసులు జారీ చేస్తున్నా స్పందించడం లేదు. వాల్టాను విస్మరించొద్దు.

# గుట్ట'నక్కలు..'!

నల్గొండ: భువనగిరి ఐటీఐ కళాశాల సమీపంలో రామకృష్ణాపురం, బీబీనగర్ కొండమడుగు ప్రాంతాల్లో ఉన్న గుట్టలను యంత్రాలతో తొలచి మట్టిని వెంచర్లకు తరలిస్తున్నారు. ఇటీవలే వర్షాలు కురవడంతో ఎఫ్‌టీఎల్ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన వెంచర్లన్నీ జలమయయ్యాయి. నీటిని తొలగించేందుకు మట్టి రాశులు పోయడమే పరిష్కార మార్గంగా భావించి యుద్ధప్రాతిపదికన పొక్లయిన్లు, భారీ డంపర్లు ఏర్పాటు చేసుకుని పని కానిచ్చేస్తున్నారు. స్థానికులు కలెక్టరేట్‌లో ఫిర్యాదులు చేసినప్పటికీ సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇదే విషయమై రెవెన్యూ అధికారులను వివరణ అడిగితే తమ పరిధిలో లేదని, భూగర్భ గనుల శాఖాధికారులతో ప్రస్తావించాలని చెబుతున్నారు. జిల్లా భూగర్భ గనుల శాఖాధికారి రాఘవరెడ్డితో ఇదే విషయాన్ని ప్రస్తావించగా.. తమ వద్ద ఎవరూ ఎలాంటి అనుమతులు తీసుకోలేదని పేర్కొన్నారు. వెంచర్ యజమానులు టిప్పర్లతో వందల ట్రిప్పుల మట్టిని తరలించే అవకాశాలున్నాయని కచ్చితంగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న అక్రమ మట్టి తరలింపు విషయంలో మాత్రం ఎవరూ ఎలాంటి అనుమతులు తీసుకోలేదని స్పష్టం చేశారు.



హైదరాబాద్-జనగామ జాతీయ రహదారిపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మట్టి తరలించే టిప్పర్లు పెద్దఎత్తున వెళుతున్నాయి. వాహన వేగానికి మట్టి బయటకు వచ్చి వాహనదారుల కళ్లలో పడుతోంది.

పెంచికల్‌పహాడ్, రామకృష్ణాపురం పరిసర ప్రాంతాల్లోని కొండల్లో అనుమతుల్లేకుండా కొండలను యంత్రాలతో తవ్వుతూ రాత్రి వేళల్లో లారీల్లో నింపి సమీపంలో ఉన్న వెంచర్లలో డంప్ చేస్తున్నారు.

అక్రమార్కులు ఎలాంటి సీనరేజీ రుసుములు ప్రభుత్వానికి చెల్లించకుండానే యథేచ్ఛగా దందా నిర్వహిస్తున్నా.. అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


# ఇసుక రాసులు. ఖజానాకు కాసులు!

కొత్తగూడెం : భద్రాద్రి జిల్లాలోని ఇసుక రీచ్‌లు రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయాన్ని సమకూర్చుతున్నాయి. క్వారీల్లో అక్రమాలకు అడ్డుకట్ట వేయటంతో పాటు రీచ్‌ల నిర్వాహకులకు సకాలంలో బిల్లులు చెల్లించటంతో ఈ ఏడాది ఇసుక విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో బిల్లులు చెల్లించకపోవటంతో క్వారీ నిర్వాహకులు అక్రమ రవాణాకు తెరలేపారు. అందుకే రాష్ట్ర ఖజానాకు చేరాల్సిన సొమ్ము అక్రమార్కుల జేబుల్లోకి వెళ్లింది. గత ఇసుక పాలసీలోని లోపాలను కాంగ్రెస్ సర్కారు గుర్తించి వాటి స్థానంలో నూతన విధానాలకు శ్రీకారం చుట్టింది.

**ఐదు నెలలు.. రూ.123 కోట్లు**

గిరిజన సహకార సంఘాల ఆధ్వర్యంలో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయి. కేవలం ఐదు నెలల్లోనే ప్రభుత్వానికి రూ.123కోట్ల ఆదాయం సమకూరింది. 2016 నుంచి ఇప్పటివరకు ఒక ఆర్థిక సంవత్సరం (2022-23)లో జిల్లాలో ఇసుక విక్రయాల ద్వారా వచ్చిన గరిష్ఠ ఆదాయం రూ.136కోట్లు మాత్రమే. ఈ ఏడాది దాన్ని అధిగమించటంతో పాటు రూ.200కోట్లకు పైగా ఆదాయం వస్తుందని టీజీఎండీసీ అధికారులు అంచనా వేస్తున్నారు. రీచ్‌ల అనుమతుల విషయంలో జాప్యం.. ఆదాయంపై ప్రభావం చూపిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా మూడు కోట్ల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వేందుకు వెసులుబాటు ఉన్నప్పటికీ.. ఇప్పటి వరకు 20లక్షల క్యూబిక్ మీటర్లే తవ్వినట్లు లెక్కలు చెబుతున్నాయి.

**వీటిపై దృష్టి సారించాలి..**



ఇసుక తవ్వకాల ద్వారా రాష్ట్ర ఖజానాకు ఆదాయం సమకూరుతున్నా.. ఇసుక లారీల రాకపోకల వల్ల రహదారులు అస్తవ్యస్తంగా తయారవుతున్నాయి. ఇప్పటికే భద్రాచలం-చర్ల, మణుగూరు-ఏటూరునాగారం రోడ్లపై ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. వీటి మరమ్మతులపై దృష్టి సారించటంతో పాటు జిల్లాలో వర్షాకాలం సైతం ఇసుక విక్రయాలు జరిపేలా అనువైన స్థలంలో స్టాక్ పాయింట్ ఏర్పాటుచేయాల్సిన అవసరముంది. గోదావరి పరిసర ప్రాంతాల్లో ఇసుక రీచ్‌లు ఉండటం వల్ల వాహనాల పార్కింగ్‌కు స్థలం లేక రోడ్లపైనే నిలుపుతున్నారు. దీనివల్ల ఇతర వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. స్టాక్ పాయింట్ ఏర్పాటుచేయటం ద్వారా పార్కింగ్ స్థలం అందుబాటులోకి వస్తుంది. మారుమూల ప్రాంతాల్లోని రోడ్లు దెబ్బతినవు. రీచ్‌ల అనుమతుల విషయంలో జాప్యం జరగడంతో మరికొంత ఆదాయాన్ని కోల్పోయాం. ప్రస్తుతం ఆరు క్వారీల ద్వారా ఇసుక విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో స్టాక్ పాయింట్ ఏర్పాటుచేయాలనే ఆలోచన ఉంది. అది కార్యరూపం దాల్చితే వర్షాకాలం సైతం ఇసుక అమ్మకాలు జరపవచ్చు. రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నాం.

చురకలు



# కేటగిరి.. రాబడిలో కిరికిరి

హైదరాబాద్: ఆర్థిక ఇబ్బందుల్లో సతమతమవుతున్న జలమండలి రాబడి అవకాశాలపై ప్రత్యేక దృష్టిసారిస్తోంది. మహానగరంలో 14.2 లక్షల నీటి కనెక్షన్లు ఉన్నా జలమండలికి వస్తున్న ఆదాయంలో 80 శాతం లక్ష కనెక్షన్ల నుంచే వస్తోంది. మిగిలిన వాటిలో వాణిజ్య కనెక్షన్లు కేవలం 50 వేలు మాత్రమే ఉన్నాయి. నగరంలో గృహావసరాలకు నీటి కనెక్షన్లకు తీసుకుని వాణిజ్య అవసరాలకు వాడుతున్నవి ఎక్కువ ఉన్నట్లు పరిశీలనలో గుర్తించారు. దీనిపై సర్వేకు శ్రీకారం చుట్టారు. ప్రాథమికంగా లక్షకు పైగా హోటళ్లు, రెస్టారెంట్లు, షోరూంలు, ఇతర వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్నట్లు వెల్లడైంది. పక్కాగా వీటిని నిర్ధారించి కేటగిరిని మార్చనున్నారు. దీనికోసం మీటర్ రీడర్లతో పాటు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగిస్తున్నారు. ప్రతి కనెక్షన్‌ను పరిశీలించి వాణిజ్య అవసరాలకు వినియోగి



స్తుంటే అక్కడికక్కడే వివరాలను నమోదు చేయనున్నారు. ఈ వివరాలను స్థానిక మేనేజర్ పరిశీలించి ధ్రువీకరించుకున్న తర్వాత కేటగిరి మారుస్తారు. ప్రధాన రహదారులు, కీలక వాణిజ్య ప్రాంతాల్లో తొలుత నెలరోజులపాటు సర్వే కొనసాగనుంది. కమర్షియల్ కనెక్షన్లకు ఉచిత పథకం వర్తించకపోగా కిలో లీటరుకు కనీసం రూ.40గా ఉంది. వినియోగం ఆధారంగా ఈ మొత్తం భారీగా పెరుగుతుందని విశ్లేషిస్తున్నారు.

**జల మండలి నీటి కనెక్షన్లు..**

మొత్తం 14.20 లక్షలు ఉచిత పథకం 6.46 లక్షలు
లబ్ధిపొందుతున్న కుటుంబాలు 12.29 లక్షలు
బల్క్ 1 లక్ష వాణిజ్య 50 వేలు

# ట్రాకింగ్ సులభం.. వస్తువులు భద్రం

హైదరాబాద్: జీహెచ్ఎంసీలోని అన్ని సెక్షన్లకు అవసరాన్ని బట్టి కంప్యూటర్‌కి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలు, ప్రింటర్లు, జిరాక్స్ యంత్రాలు వంటివన్నీ ఐటీ విభాగం సమకూరుస్తుంది. హోదాను బట్టి కొంతమంది అధికారులకు ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్‌లు, ట్యాబ్‌లు సైతం ఇస్తుంటారు. గతంలో వస్తువులు ఎప్పుడు ఇచ్చారో ఐటీ విభాగం దగ్గర సమాచారం లేకపోవడంతో గందరగోళం జరుగుతున్నట్లు అధికారులు అంచనాకు వచ్చారు. ఈ పద్ధతికి చెక్ పెట్టేలా సమాచారాన్ని డిజిటలైజేషన్ చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయానికి వచ్చింది. ఇందుకు ప్రత్యేకంగా 'అసెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్'ని ఆవిష్కరించింది. ఈ వ్యవస్థ వల్ల ఉద్యోగులకు కేటాయించిన వస్తువు ఎవరి దగ్గర ఉందో సులభంగా ట్రాకింగ్ చేయవచ్చు. ఫలితంగా వస్తువుల బదిలీ, తిరిగి తీసుకోవడం సులభతరం కానుంది.




**ఇక అన్నీ ఆన్‌లైన్..** 'టీజీ ఆన్‌లైన్' సహకారంతో అసెట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను రూపకల్పన చేశారు. సంబంధిత అధికారులకు ఇచ్చేముందు వస్తువుపై బార్‌కోడ్ అతికిస్తారు. స్కాన్ చేస్తే వివరాలు వెబ్‌సైట్‌లో నమోదవుతాయి. దీంతో ఏ వస్తువు ఎవరు, ఎప్పుడు? తీసుకున్నారనే విషయం సులువుగా తెలుస్తుంది. వస్తువులకు సంబంధించి ఇండెంట్ నుంచి ఆమోదం, జారీ వరకు అంతా వెబ్‌సైట్‌లో నిక్షిప్తం అవుతుంది. గతంలో మాదిరిగా రిజిస్టర్లు తిరగేయాల్సినఅవసరం లేకుండా.. ఒక్క క్లిక్‌తో సమాచారం లభిస్తుంది. అధికారుల నుంచి వచ్చిన విజ్ఞప్తి నుంచి దాన్ని పరిశీలించి ఐటీ అధికారుల ఆమోదం, సరఫరా వరకు వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంటాయి.

# నొప్పులొస్తే.. నోములే

దేవరకొండ : అంతరిక్షానికి సైతం అవలీలగా వెళ్లొస్తున్న ప్రస్తుత రోజుల్లో పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణులను, అత్యవసర సమయాల్లో రోగులను ఆసుపత్రులకు తరలించేందుకు కొన్ని గ్రామాల్లో నేటికీ రోడ్డు వసతి లేదు. కొన్నిచోట్ల ఉన్నా.. వాహనాలు వెళ్లలేని పరిస్థితి. గిరిజన ప్రాంతమైన దేవరకొండ నియోజకవర్గంలో రోడ్డు మార్గాలు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. దశాబ్దాలు గడుస్తున్నా చందంపేట, నేరెడుగొమ్ము, డిండి, పీఏపల్లి మండలాల్లోని కొన్ని గ్రామాలకు నేటికీ రోడ్డు రవాణా సౌకర్యం కల్పించకలేకపోవడం పాలకుల పనితీరుకు అద్దం పడుతోంది. సరైన రోడ్డు మార్గం, వంతెనలు లేక గర్భిణులు, బాలింతలు అంబులెన్స్ సేవలను పొందలేక పోతున్నారు. ఉన్న రోడ్లు సరిగ్గా నిర్మాణం చేపట్టకపోవడంతో వాహనాలు రాలేని పరిస్థితి నెలకొంది. దేవరకొండ నియోజకవర్గానికి కూతవేటు దూరంలో ఉన్న బుడ్డోనితండా నుంచి మర్రిచెట్టుతండాకు మధ్యలో వాగు దాటాల్సి ఉంటుంది. మూడేళ్ల కిందట ఓ గర్భిణి వాగు దాటుతూ అందులో చిక్కుకొని మృత్యువాత పడగా, ఏడాది క్రితం గిరిజన వృద్ధుడు మృతిచెందాడు. పీఏపల్లి మండలం బూడిదగట్టు, పీఏపల్లి నుంచి అంగడిపేట, దేవరకొండ మండలం కొర్రతండా నుంచి ఎర్రబిచ్యతండా, బుడ్డోనితండా నుంచి మర్రిచెట్టుతండా, డిండి మండలం గజరాల్ తండా నుంచి చెరుకుపల్లి, బ్రాహ్మణపల్లి నుంచి వావిల్‌కోల్, నిజాంనగర్ నుంచి కందుకూరు, ఉమ్మడి చందంపేట మండలం గువ్వలగుట్ట, కంబాలపల్లి, పొగిళ్ల, నక్కదుబ్బతండా, బండకిందితండా రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కనీసం అత్యవసర సమయంలో వాహనాలు వచ్చేలా మార్గం నిర్మించాలని 'గిరి'జనం కోరుతున్నారు.నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల్లో రహదారులను గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని ఆర్అండ్‌బీ డీఈ భాస్కర్ తెలిపారు.

# టన్నుల్లో వ్యర్థాలు.. నిర్వహణ మూణ్నాళ్లు



హైదరాబాద్: రైతు బజార్లలో నిత్యం టన్నుల కొద్దీ కూరగాయల వ్యర్థాల వెలువడుతున్నాయి. వీటి నిర్వహణపై ఉదాసీనంగా వ్యవహరించడంతో బజార్లు దుర్గంధ భరితంగా మారుతున్నాయి. కొన్నిచోట్ల బయోగ్యాస్ తయారీకి ఏర్పాటు చేసిన ప్లాంట్లు మూణ్నాళ్ల ముచ్చటగా మారాయి. కుప్పలుగా పేరుకుపోయిన వ్యర్థాలతో మార్కెట్లు కంపుకొడుతున్నాయని రైతులు, ప్రజలు వాపోతున్నారు.

**బోయిన్‌పల్లి మార్కెట్ రాబడిలేదు..**

బోయిన్‌పల్లి కూరగాయల మార్కెట్‌లో నిత్యం 10 టన్నుల వ్యర్థాలు వెలువడుతున్నాయి. నాలుగేళ్ల క్రితం రూ.33 లక్షలతో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. వ్యర్థాలతో ఉత్పత్తి చేసే గ్యాస్ ద్వారా మార్కెట్‌లో క్యాంటీన్ అవసరాలు, వీధి దీపాలకు ఖర్చులు తీరేవి. ఏడాదికి సుమారు రూ.18 లక్షలు వరకు ఆదాయం సమకూరేది. కాంట్రాక్ట్ సంస్థ టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో ఆరు నెలల క్రితం ప్లాంట్ మూతపడింది. కొత్త కాంట్రాక్ట్‌లో జాప్యంతో మార్కెట్‌లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంది.

**మోడల్ బజార్‌లోనూ..**

ఎర్రగడ్డ మోడల్ రైతుబజార్‌లో ఏర్పాటు చేసిన బయోగ్యాస్ ప్లాంట్ ఏడాదిన్నరగా మూసి ఉంది. ఐదేళ్ల క్రితం దీని కోసం రూ.15 లక్షలు ఖర్చు చేశారు. రోజుకు సుమారు ఐదు టన్నుల వరకు వ్యర్థాలు వెలువడేవి. కొంత బయోగ్యాస్‌కు వినియోగిస్తుండగా.. మిగిలిన వ్యర్థాలతో కంపోస్ట్ తయారు చేసేవారు. ప్రస్తుతం రెండు యూనిట్లు కూడా మూతపడ్డాయి. ప్రస్తుతం కొత్తపేట పండ్లమార్కెట్, ఎల్‌బీనగర్, హైదరాబాద్, బోయినపల్లి, భరత్‌నగర్, మెహిదీపట్నం, కేపీహెచ్‌బీ సహా పలు రైతు బజార్లలో పారిశుద్ధ్య సమస్య తీవ్రమైంది.

రైతుబజార్లలో నిత్యం వెలువడే వ్యర్థాలు: 3-10 టన్నులు
తరలింపు: రెండు మూడురోజులకోసారి

# కరవు తీరా వాన



శంకరపట్నం : జిల్లాలో పలు మండలాల్లో కరవు తీరా వర్షం కురిసింది. గత మూడు నెలలుగా పెద్దగా వానలు లేని చిగురుమామిడి, సైదాపూర్, హుజూరాబాద్ మండలాల్లో భారీ వాన పడింది. వాగులు వంకలూ పొంగిపొర్లాయి. చెరువులు మత్తళ్లు దూకాయి. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**జిల్లాలో వర్షపాతం వివరాలు ఇలా..**

జిల్లాలో ఉదయం నుంచి శుక్రవారం ఉదయం 8.30 గంటల వరకు కురిసిన వర్షపాతం ఇలా(మి.మీలలో).. చిగురుమామిడి 211.3, హుజూరాబాద్ 197.8, వి.సైదాపూర్ 108.0, శంకరపట్నం 104.5, తిమ్మాపూర్ 84.8, వీణవంక 84.5, ఇల్లందకుంట 81.0, జమ్మికుంట 70.3, మానకొండూర్ 51.0, గన్నేరువరం 30.0, కరీంనగర్ 13.3, కొత్తపల్లి 11.5, కరీంనగర్ గ్రామీణం 8.5, చొప్పదండి 8.5, రామడుగు 6.5, గంగాధర 2.0 మి.మీటర్లుగా నమోదైనట్లు జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి రాజారాం తెలిపారు.

**నిలిచిన రాకపోకలు**

మెట్‌పల్లి-లింగాపూర్ గ్రామాల శివారు లోలెవల్ వంతెనపై వరద చేరటంతో వాహనాల రాకపోకలు నిలిచాయి. కాచాపూర్, రాజాపూర్ గ్రామాలకు బస్సు సౌకర్యం నిలిచింది. కేశవపట్నం నుంచి పాపయ్యపల్లికి ప్రధాన కాలువ మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి.
సైదాపూర్ మండంలోని బొమ్మకల్-గొడిశాల, ఎగ్లాస్‌పూర్-సోమారం గ్రామాల మధ్యలోని లోలెవల్ కల్వర్టులపై వరద పారడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

**మునిగిన పొలాలు**

శంకరపట్నం మండలంలో ఎన్‌హెచ్-563 నిర్మాణ పనులతో సమీప వరి పొలాల్లో వరద వచ్చి ఇసుక మేటలు వేయగా, రైతులు ఆవేదన చెందారు. పలు గ్రామాల్లో పొలాలు నీట మునిగాయి.

**175 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు**

హుజూరాబాద్ మండలంలోని ఆరు గ్రామాల్లో 175 ఎకరాల వరిపంటకు నష్టం జరిగిందని జిల్లా వ్యవసాయాధికారిణి జె.భాగ్యలక్ష్మి తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారుల ప్రాథమిక నివేదిక ప్రకారం సిర్సాపల్లి-20, కొందుగుల-10, తుమ్మనపల్లి-10, సింగాపూర్-20, హుజూరాబాద్-100, చెల్పూర్-15 ఎకరాల్లో కలిపి మొత్తం మండలంలో 175 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని తేల్చారు.

**విద్యుత్తు సంస్థకు రూ.5 లక్షల నష్టం**

విద్యుత్తు సంస్థకు గురువారం రాత్రి కురిసిన వర్షాలకు రూ.5 లక్షల నష్టం వాటిల్లిందని ఎస్ఈ మేక రమేశ్ బాబు తెలిపారు. హుజూరాబాద్ డివిజన్‌లో ఒక నియంత్రిక, పెద్దపాపయ్యపల్లిలో 5 విద్యుత్తు స్తంభాలు కూలిపోయాయని పేర్కొన్నారు. అత్యవసరమైతే టోల్ ఫ్రీ నంబరు 1912కు సంప్రదించాలన్నారు.

**ఇళ్లను చుట్టుముట్టిన వరద.. కాలనీవాసుల ఆందోళన**

శంకరపట్నం తాడికల్ గ్రామ శివారు మేలకుంటలో నీటి ప్రవాహం ఎక్కువై ఇళ్ల చుట్టూ నీరు చేరటంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చిన్న నీటిపారుదలశాఖ అధికారులు పొక్లెయిన్‌తో కుంటలో నీరు బయటకు పోయేలా చర్యలు తీసుకున్నారు. ప్రతిసారి ఇక్కట్లు తప్పడంలేదని ఆందోళనకు దిగారు. పంటలు నీట మునిగి రైతులు ఆందోళన చెందుతున్నారు.

# సాగని పనులు.. పరిహారానికి దిగులు



గోదావరిఖని: ఉమ్మడి జిల్లాలో భూసేకరణ సమస్యలతో పలు ప్రాజెక్టుల పనులు ముందుకు సాగడం లేదు. రహదారులు, సాగునీటి ప్రాజెక్టుల పురోగతికి ఈ సమస్య అడ్డంకిగా మారుతోంది.. భూసేకరణ ప్రక్రియలో జాప్యం.. పరిహారం చెల్లింపులో నిర్లక్ష్యం.. సర్వేలో పొరపాట్లతో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోంది.

**రహదారుల నిర్మాణంలో జాప్యం** జగిత్యాల నుంచి కరీంనగర్ వరకు చేపట్టే జాతీయ రహదారి 563 భూసేకరణకు ఇంకా సర్వే చేస్తున్నారు. 58 కిలోమీటర్ల మేర నిర్మించే రహదారికి 245.94 హెక్టార్ల భూమి అవసరం ఉంది. పరిహారం చెల్లింపు ఎంతన్నది తేలలేదు. దీంతో పనుల్లో జాప్యం నెలకొంది.నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ నుంచి ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని జగ్దల్‌పూర్ వరకు నిర్మించే జాతీయ రహదారి 63కి ఇటీవల పర్యావరణ అనుమతులు లభించాయి. ఉమ్మడి జిల్లాలో కోరుట్ల నుంచి ధర్మపురి మీదుగా మంచిర్యాలకు చేరుకునే రహదారికి 250 హెక్టార్ల భూమి అవసరం ఉంది. భూసేకరణ పూర్తయింది. నిధులు కూడా మంజూరయ్యాయి. డబ్బులు చెల్లించక పనులు వేగంగా సాగడం లేదు.మంచిర్యాల నుంచి వరంగల్ వరకు నిర్మించే 163 గ్రీన్‌ఫీల్డ్ రహదారికి 505 ఎకరాల భూమి అవసరం ఉంది. సర్వే పనులు పూర్తి చేశారు. కొంత మందికి పరిహారం చెల్లించారు. మరో 40 మంది నిర్వాసితులకు చెల్లించాల్సి ఉంది. దీని వల్ల అక్కడక్కడ పనుల్లో ఆలస్యమవుతోంది.అందని సాగునీరు గంగాధర, రామడుగు మండలాల మీదుగా సాగే అదనపు కాలువ నిర్మాణం పనుల్లో జాప్యం జరుగుతోంది. ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోతల ద్వారా అంతర్గత పైపులైన్, కాలువల ద్వారా నీటిని పెగడపల్లి మండలం దీకొండ, నామాపూర్ పంపుహౌస్‌లకు తరలిస్తారు. అక్కడి నుంచి రామడుగు మండలం తిర్మలాపూర్ నుంచి ఉపరితల కాలువకు నీరందించే పథకంలో భాగంగా చేపట్టిన పనులకు బోయినపల్లి మండలంలో అయిదు గ్రామాల్లోని 165 ఎకరాలకు పరిహారం చెల్లించారు. రామడుగు, గంగాధర మండలాల్లోని 12 రెవెన్యూ గ్రామాల్లో సేకరించిన 446 ఎకరాలకు రూ.115 కోట్లు మాత్రమే చెల్లించారు.

ఇంకా రూ.154 కోట్లు చెల్లించాల్సి ఉంది. దీంతో కాలువ నిర్మాణం పనులు నిలిపివేశారు. జగిత్యాల జిల్లాలోని కథలాపూర్, మేడిపల్లి మండలాలకు కుడి కాలువ ద్వారా 18 గ్రామాలకు సాగు నీరందించే కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు భూసేకరణ పరిహారం చెల్లింపులో జాప్యంతో నిలిచిపోయాయి. 40 వేల ఎకరాలకు సాగునీరందించే ఈ ప్రాజెక్టు కుడి కాలువ నిర్మాణం భూసేకరణ ప్రక్రియలో జాప్యం వల్ల నిలిచిపోయింది. మధ్యమానేరు నుంచి కాలువల ద్వారా విడుదల చేసేందుకు చేపట్టిన ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయి.

# కళాశాల భూమి.. కబ్జాకు యత్నం

సిరిసిల్ల: సిరిసిల్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన భూమికి రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. 1987లో వేములవాడ మండలం అగ్రహారంలో ఏర్పాటైన కళాశాలకు అప్పుడు 25 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారు. బీఏ, బీఎస్సీ, బీకాం విభాగాల్లో 15 కోర్సులు ఉన్నాయి. 360 సీట్లకుగాను ఈ ఏడాది మొదటి సంవత్సరంలో అన్ని కోర్సుల్లో కలిపి మొత్తం 65 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. ప్రస్తుతం 190 మంది విద్యార్థులు చదువుతున్నారు. పీజీ తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. ఈ భవనంలోనే 2021లో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల తరగతులకు అనుమతులు ఇచ్చారు. అప్పటి నుంచి ఎంఏ ఆంగ్లం, తెలుగు, బీకాం జనరల్ పీజీ కోర్సులు రద్దు చేశారు. ఇటీవల కళాశాలకు పీఎంఉషా(ప్రధాన మంత్రి ఉచ్చతర శిక్షా అభియాన్)లో రూ.10 కోట్లతో మహిళా వసతి గృహనిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. అయితే కళాశాలకు కేటాయించిన భూమికి ప్రహరీ లేక హద్దులు మార్చేస్తున్నారు.

**ప్రధాన రహదారి పక్కనే..**

వేములవాడ మండలం ప్రస్తుతం చంద్రగిరి పంచాయతీ పరిధిలోని తెట్టెకుంట సమీపంలో సిరిసిల్ల-కరీంనగర్ ప్రధాన రహదారి పక్కనే డిగ్రీ కళాశాల ఉంది. అగ్రహారం, చంద్రగిరి, చిర్లవంచ ఆర్అండ్ఆర్



కాలనీలు ఇక్కడ ఏర్పాటు చేయటంతో ఈ ప్రాంతంలో భూములకు డిమాండ్ పెరిగింది. గుంటకు రూ.15లక్షల పైనే పలుకుతోంది. ప్రహరీ లేకపోవడంతో ఒక పక్క నుంచి భగీరథ పైపులైన్, తెట్టెకుంటలోని క్వారీలకు రహదారి నిర్మాణాలు జరిగాయి. ఇదే అదనుగా సమీప కాలనీవాసులు సమాధులను సైతం ఏర్పాటు చేసుకున్నారు. ఓ సామాజిక వర్గం ఏకంగా ఆలయమే నిర్మించింది. సెలవు రోజుల్లో కళాశాల వెనక ప్రాంతం ఆకతాయిలకు కేంద్రంగా మారుతోంది. ఇటీవల మహిళా వసతి గృహ నిర్మాణానికి స్థలం పరిశీలిస్తున్న క్రమంలో ఈ ఆక్రమణలు వెలుగు చూశాయి.

**రెవెన్యూ శాఖ దృష్టికి ఆక్రమణలు**

ఆక్రమణలపై కళాశాల యంత్రాంగం రెవెన్యూ శాఖ దృష్టికి తీసుకెళ్లింది. సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని కోరింది. అంతేకాకుండా చుట్టూ ప్రహరీ నిర్మించి చొరబాట్లు జరగకుండా చూస్తే రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురికాకుండా ఉంటుందన్నారు. ప్రధాన రహదారివైపు దుకాణాల సముదాయం నిర్మిస్తే కళాశాలకు ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు.

**ప్రహరీ ప్రతిపాదనలు పంపిస్తాం: శంకర్, ప్రిన్సిపల్, సిరిసిల్ల డిగ్రీ కళాశాల** కళాశాల భూముల ఆక్రమణలు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. క్షేత్రస్థాయిలో పరిశీలించి, రెవెన్యూ సర్వేయర్ల ద్వారా సర్వే చేయించి హద్దులు నిర్ణయించాలని కోరాం. చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు కోసం ఉన్నతాధికారులను ప్రతిపాదనలు పంపనున్నట్లు చెప్పారు.

# రైతన్నా.. నేనున్నానోచ్

నాంపల్లి: వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ఎరువుల వాడకం అధికమైంది. దీన్ని ఆసరాగా చేసుకొని కొందరు డీలర్లు ప్రభుత్వం నుంచి వచ్చే సరకును నిల్వ చేసి ధరలు పెంచేస్తున్నారు. దీంతో అన్నదాతలకు ఎరువులు దొరకడం లేదు. ఈ క్రమంలో యూరియా, డీఏపీ బస్తాలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. ఈ క్రమంలో వాటికి బదులుగా 'నానో' ద్రవాన్ని వాడితే మేలని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు.

**ధర కూడా తక్కువే..**

సాధారణ యూరియా బస్తా రూ.266 వరకు ఉంది. డిమాండ్ కారణంగా కొన్ని చోట్ల బ్లాక్‌లో రూ.450 వరకు విక్రయిస్తున్నారు. తరలింపునకు మరో రూ.50 అదనంగా చెల్లించాల్సి వస్తోంది.. అదే అర లీటరు నానో యూరియా ద్రవం రూ.200-225కు లభిస్తుంది. డీఏపీ బస్తా రూ.1,350 ఉండగా అర లీటరు నానో డీఏపీ రూ.600లకే వస్తోంది. రైతు గరిష్ఠంగా 20 సీసాలు కొంటే ఇఫ్కో సంస్థ రూ.2లక్షల వరకు బీమా సౌకర్యాన్ని సైతం కల్పిస్తోంది. ముందుగా రసీదు తీసుకోవాలి.

**ఇవీ ప్రయోజనాలు..**

యూరియా, డీఏపీలను నేరుగా మొక్క మొదలుకు అందిస్తారు. దీంతో సగం నేలలోనే కలిసి పోతుంది. పంటకు అందేది కొంచెమే. మరో




వైపు భూమి సైతం సారాన్ని కోల్పోతుంది. మిత్ర పురుగులు చనిపోతాయి. నానోతో ఆ ఇబ్బంది ఉండదు. పిచికారీ చేయడంతో ఆకు ద్వారా 85శాతం వరకు నేరుగా మొక్కకు చేరుతుంది. నత్రజనిని సులభంగా చేరవేయొచ్చు. దిగుబడులు కూడా బాగుంటాయి.

**ఆర్థిక భారం తగ్గుతుంది- పాల్వాయి శ్రవణ్‌కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి, నల్గొండ**

జిల్లాలో ప్రస్తుతం 5.29 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. జిల్లా రైతులు ఇప్పటి వరకు 35 వేల లీటర్ల నానో యూరియా వినియోగించారు. మరో 25 వేల లీటర్లు జిల్లాలో అందుబాటులో ఉంది. ఎకరాకు 75 కిలోల యూరియా అవసరమైతే.. నానో అర లీటరు సరిపోతుంది. ఆర్థిక భారం తక్కువ, రవాణా ఖర్చు ఉండదు. నానో యూరియా, నానో డీఏపీలతోపాటు పురుగు మందులు కూడా కలిపి పిచికారీ చేసుకోవచ్చు.

చురకలు



## కొరవడిన వైవిధ్యం.. కొన్నింటికే ప్రాధాన్యం

జగిత్యాల : గతంలో ప్రతి రైతు తమ ఇంటి అవసరాలకు కావాల్సిన బియ్యంతోపాటు పప్పు దినుసులు, ఉల్లి, వెల్లుల్లి, పసుపు, అల్లం, కూరగాయలను తమ తోటలోనే పండించుకునేవారు. ఇంటి అవసరాలకు పండించేవాటికి ప్రత్యేకంగా కొంతభూమిని కేటాయించుకునేవారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా మారింది. ఎక్కువమంది రైతులు ఆయా పంటలను పండించడంలేదు. కొనుగోలు చేయడానికే ఆసక్తి చూపుతున్నారు.

**ఇవీ కారణాలు** రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కనీస మద్దతు ధరకు కొనుగోలు చేస్తుండటం ఆరుతడి పంటలకు వన్యప్రాణుల బెడద, మార్కెట్‌లో తక్కువ ధర పలకడం, మేలైన వంగడాలు అందుబాటులోకి రాకపోవడం, చీడపీడల తీవ్రత, కూలీల కొరత సాగునీటి లభ్యత పెరగడం వరి సాగు మొగ్గుకు మరో కారణం. సన్నాలకు ప్రభుత్వం క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందిస్తుండటం ప్రోత్సాహంగా మారింది.

**ప్రోత్సహిస్తేనే ఇతర పంటలవైపు..**



గతంలో ఇచ్చినట్లుగా మక్క, వేరుసెనగ, నువ్వులు, పెసర, మినుము, కూరగాయల విత్తనాలను 50 శాతం రాయితీపై అందించడం
కూలీల కొరత నేపథ్యంలో వ్యవసాయ పనులను ఉపాధిహామీ పథకానికి అనుసంధానించడం ఆరుతడి సాగుకు ఉపకరించే యంత్రాలు, పరికరాలు, పనిముట్లను రాయితీపై అందజేయడం. ఉత్పత్తులను కనీస మద్దతు ధరకు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయడం
అన్ని పంటలకు బిందుసేద్య పరికరాలు, కూరగాయల సాగుకు పాలీహౌజులు, షెడ్‌నెట్లు తదితరాల రాయితీని పునరుద్ధరించడం
పంట పరిహారం అందేలా కమతం వారీగా బీమా అమలు చేయడం
ఆయిల్‌పామ్ సాగు రైతులకు రుణ మంజూరు, జిల్లాలో క్రషింగ్ యూనిట్ను అందుబాటులోకి తేవడం .

## అంచనాకు మించి వరి సాగు

ఎల్లారెడ్డిపేట : మెట్ట ప్రాంతమైన రాజన్న సిరిసిల్ల జిల్లాలో గొట్టపు బావులు, బావులు (ఓపెన్ వెల్స్) వ్యవసాయానికి ప్రధాన జీవనాధారం. జూన్ 1 నుంచి ఆగస్టు 18 వరకు 470.0 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. ఈ సీజన్ మొదట్లో వర్షాభావ పరిస్థితులతో పంటల సాగు మందకొడిగా ప్రారంభమైనప్పటికీ ఇటీవల కురిసిన భారీ వర్షాలతో ఊపందుకుంది. ఇప్పటి వరకు వివిధ రకాల పంటల సాగు విస్తీర్ణం 2,36,305 ఎకరాలకు చేరుకుంది. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో వరి అంచనాకు మించి సాగు కాగా.. మొత్తంగా 90 శాతానికిపైగా పంటల సాగు పూర్తయినట్లు వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

**కొనసాగుతున్న నాట్లు**

జిల్లాలో ఈ ఏడాది అధికంగా వర్షాలు కురవకపోవడం, సాగునీరు సమృద్ధిగా లభించకపోవడం వంటి కారణాల వల్ల ఆయా మండలాల్లో వరి నాట్లు వేసే ప్రక్రియ ఇంకా కొనసాగుతూనే ఉంది. రుద్రంగి మండలంలో లోటు వర్షపాతం నమోదవగా ముస్తాబాద్, ఇల్లంతకుంట



మండలాల్లో మాత్రమే అధికంగా వర్షాలు పడ్డాయి. మిగతా 10 మండలాల్లో సాధారణానికి మించలేదు. ముదిరిన నారును వినియోగిస్తే దిగుబడి తగ్గిపోయే అవకాశాలున్నాయి. ఈ నేపథ్యంలో డ్రమ్‌సీడర్, నేరుగా వెదజల్లే పద్ధతులు పాటిస్తే మేలు చేకూరనుంది. డ్రమ్ సీడర్‌తో నేరుగా వరి విత్తడం ప్రత్యేకత. కూలీల కొరతను అధిగమించేందుకు ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పెట్టుబడి వ్యయం తగ్గుతుందని.. ఏ వరి రకమైనా 7 నుంచి 10 రోజులు ముందుగానే కోతకు వస్తోందని పేర్కొంటున్నారు. విత్తనాలను వెదజల్లే పద్ధతిలో కూడా ఖర్చులు ఆదా అవుతాయి. విత్తనాలను వెదజల్లిన కొద్దిరోజులపాటు ఖచ్చితమైన నీటి యాజమాన్య చర్యలు తీసుకుంటే సరిపోతుంది. నాట్లు ఆలస్యంగా వేసే రైతులు 100 నుంచి 120 రోజుల పంటకాలం ఉండే విత్తనాలను డ్రమ్‌సీడర్‌తోనూ, నేరుగా వెదజల్లితే మంచి దిగుబడులను పొందొచ్చని ఎల్లారెడ్డిపేట మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ పేర్కొన్నారు. మరోవైపు నాట్లు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ ఏడాది వరిసాగు విస్తీర్ణం మరింత పెరగనుంది.

## వర్షాలకు 'తారు'మారు!

ఖమ్మం : చింతకాని మండలం రామకృష్ణాపురం అడ్డరోడ్డు వద్ద ఓ మోరీ సమీపంలో ఖమ్మం- బోనకల్లు ప్రధాన రహదారిపై గొయ్యి ఏర్పడింది. ఇటీవల కురిసిన వర్షాలకు రెండు రోజుల పాటు మోరీ పైనుంచి రెండడుగుల మేర వరద నీరు ప్రవహించింది. ఈ మార్గంలో నిత్యం వందలాది కార్లు, బస్సులు, లారీలు, ద్విచక్రవాహనాలు తిరుగుతుంటాయి. మలుపు ఉండటంతో వాహనదారులకు రాత్రిపూట గొయ్యి కనిపించటం లేదు. రెండు రోజుల్లో గొయ్యిని పూడ్చి రహదారికి మరమ్మతులు చేపడతామని ఆర్అండ్‌బీ ఏఈ లక్ష్మీనారాయణ తెలిపారు.

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు రహదారులు దెబ్బతిన్నాయి. వరద ప్రవాహంతో తారులేచిపోయి.. కంకర తేలి గుంతలు ఏర్పడ్డాయి. పల్లె రహదారులు చిత్తడిగా మారాయి. పంచాయతీ రహదారుల కంటే ఆర్అండ్‌బీ రోడ్లు తీవ్రంగా దెబ్బతినటంతో అధికారులు తాత్కాలిక, శాశ్వత మరమ్మతుల నిమిత్తం పభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. **కంకర తేలి.. గుంతలు ఏర్పడి** ఖమ్మం జిల్లా బోనకల్లు, మధిర, కూసుమంచి, భద్రాద్రి జిల్లా గుండాల, చర్ల, భద్రాచలం తదితర మండలాల్లో వర్షాలు దంచికొట్టాయి. పురపాలికలు, నగరపాలికల్లో వరద ప్రవాహానికి తోడు, మురుగు నిలిచినచోట గుంతలు ఏర్పడ్డాయి. ప్రధానంగా భద్రాద్రి జిల్లాలో ఆర్అండ్‌బీ శాఖ పరిధిలోని రోడ్లకు తీవ్రనష్టం వాటిల్లింది. ఆర్అండ్‌బీ రోడ్ల పొడవు 1,615 కి.మీ. ఉండగా.. 173.28 కి.మీ. మేర ఛిద్రమయ్యాయి. బయ్యారం–తాడ్వాయి, మొండికుంట–రామచంద్రాపురం, పెద్దనల్లబెల్లి–సీఆర్పీఎఫ్ బేస్‌క్యాంప్, మణుగూరు–నెల్లిపాక, చిన్నరావిగూడెం రహదారులు వర్షాలకు దెబ్బతిన్నాయి.

## మంజూరు సరే.. నిర్మాణం ఎప్పుడు?



పెద్దపల్లి : కన్నాల వద్ద ఆర్వోబీల నిర్మాణం చేయాలని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఇటీవల దక్షిణ మధ్య రైల్వే జోన్ జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవకు వినతి పత్రం అందజేశారు. 2020–21లోనే కన్నాలతోపాటు పలు ఆర్వోబీల నిర్మాణానికి మంజూరు చేశామని కానీ తమ వాటా చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిరాకరించడంతో పనులు ముందుకు సాగడం లేదన్నారు. నూరుశాతం రైల్వే నిధులతో త్వరలో పనులు చేపట్టనున్నట్లు ఎంపీకి పంపించిన ప్రత్యుత్తరంలో రైల్వే జీఎం పేర్కొన్నారు.

నిత్యం రద్దీగా ఉండే కాజీపేట–బల్లార్షా సెక్షన్‌లో లెవల్‌క్రాసింగ్(రైల్వేగేటు) లేకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్వోబీ లేదా ఆర్‌యూపీల నిర్మాణానికి రైల్వేమంత్రిత్వశాఖ గతంలో విధానపరమైన నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా జమ్మికుంట నుంచి పెద్దంపేట వరకు ఉన్న లెవల్ క్రాసింగ్‌లను విడతలవారీగా ఎత్తివేయ నున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలో ఓదెల, ఉప్పురపల్లి, హరిపురం, కొత్తపల్లిలలో అండర్‌పాస్‌ల నిర్మాణం పూర్తయ్యాయి. సైదాబాద్, పొత్కపల్లి, ఓదెల(స్టేషన్ వద్ద), కొలనూరు, పెద్దపల్లిలో మూడు(కూనా రం రోడ్డు, చీకురాయి రోడ్డు, గౌరెడ్డిపేటరోడ్డు), కన్నాల, కుందనపల్లి, పెద్దంపేటల వద్ద కూడా ఆర్వోబీలు మంజూరయ్యాయి. కానీ వీటిలో పెద్దపల్లిలోని కూనారం రోడ్డులో మాత్రమే ఆర్వోబీ నిర్మాణం జరుగుతుంది. ఇక్కడ కూడా ఏళ్లు గడిచినా.. పూర్తి స్థాయిలో భూసేకరణ జరగకపోవడంతో పనులు నిలిచిపోయాయి.

**ఎంపీ చొరవతో తెరపైకి..** 2020–21 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో పలు ఆర్వోబీలు, ఆర్‌యూపీలు మంజూరయ్యాయి. వీటి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ వాటా చెల్లించాల్సి ఉంటుంది. కానీ స్థానిక నాయకులు చొరవ తీసుకోకపోవడంతో దస్త్రాలు ముందుకు కదలడం లేదు. ఈ క్రమంలో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ కన్నాల ఆర్వోబీ ఆవశ్యకతను రైల్వే అధికారులు దృష్టికి తీసుకువెళ్లడంతో రైల్వే పైవంతెనల మంజూరు అంశం తెరపైకి వచ్చింది. జిల్లాలో ప్రసిద్ధి చెందిన దేవునపల్లి లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు కూడా అందుగుపల్లి వద్ద రైల్వేగేటు అడ్డుగా ఉంది. ఇక్కడ ఆర్‌యూపీ నిర్మించాలని స్థానిక నాయకులు గతంలో ప్రతిపాదించగా ఆర్వోబీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని రైల్వేశాఖ కోరింది. అయిదేళ్ల క్రితం రెండోసారి పంపించిన ప్రతిపాదనలు పత్రాలకే పరిమితమయ్యాయి. దీంతోపాటు మంజూరైన ప్రాజెక్టులకు కూడా మోక్షం లభించడం లేదు. ఎంపీ మరోసారి వీటిపై దృష్టిపెడితే ప్రక్రియ ముందుకు సాగుతుందని ప్రజలు కోరుతున్నారు.

## చేనేత.. పన్నువెత తీరేనా?



సిరిసిల్ల : ఉమ్మడి జిల్లాలో వేలాది కుటుంబాల చేనేత వస్త్రోత్పత్తులే జీవనాధారం. వీటి విక్రయాలపై అయిదు శాతం జీఎస్టీ విధించడం ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎనిమిదేళ్లుగా ఈ రంగంపై ప్రభావం చూపుతోంది. దీనిని ఎత్తివేయాలని ప్రభుత్వం, చేనేత సంఘాల నుంచి వినతులు వెళ్తూనే ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక చేనేత, జౌళిశాఖల, ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు మరోసారి ప్రధాని మోదీ, కేంద్ర, చేనేత, జౌళిశాఖల మంత్రి గిరిరాజ్‌సింగ్‌లకు లేఖ రాశారు. కేంద్రం బుధవారం నిర్వహించే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో తీసుకోబోయే నిర్ణయంపై అందరూ ఉత్కంఠతో ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో 31 చేనేత సహకార సంఘాలు ఉన్నాయి. వీటిలో 1524 మంది కార్మికులు పూర్తిగా కాటన్ వస్త్రోత్పత్తులు నేస్తున్నారు. ప్రభుత్వం టెస్కో నుంచి ఏటా పాఠశాలల ఏకరూప దుస్తులు, సంక్షేమ శాఖలకు సంబంధించిన ఆర్డర్లు పూర్తిస్థాయిలో చేనేత సహకార సంఘాలకే ఇస్తోంది. వీటితోపాటు కేస్మేట్, బెడ్‌షీట్లు, లుంగీలు, తువ్వాళ్లు వంటికి ఎక్కువగా నేస్తున్నారు. ప్రభుత్వ ఆర్డర్లు మినహా మిగతా ఉత్పత్తులను టెస్కో దుకాణాల ద్వారా విక్రయిస్తు న్నారు. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్, వేములవాడ, జగిత్యాల, మెట్పల్లి, గోదావరిఖనిలో దుకాణాలు ఉన్నాయి. ఈ ఉత్పత్తులకు విస్తృతం చేసేందుకు చేనేత లక్ష్మి పథకాన్ని తీసుకొచ్చారు. వీటిలో వస్త్రాల కొనుగోలుపై 30 శాతం రాయితీ ఉంది. కాగా అయిదు శాతం జీఎస్టీ విధించడంతో కొనుగోలు దారులకు రాయితీ కన్నా జీఎస్టీయే ఎక్కువ ప్రభావం చూపుతోంది. ఇదే ప్రైవేటులో అయితే అన్నికలిపి ధర తక్కువ ఉండటంతో అటువైపే మొగ్గు చూపుతున్నారు. **ఏటా రూ.2.88 కోట్ల వ్యాపారం**

ఉమ్మడి జిల్లాలో టెస్కో ఔట్లెట్ల ద్వారా ఏటా రూ.2.88 కోట్ల వస్త్ర వ్యాపారం జరుగుతోంది. గతంలో ఇది రూ.3.5 కోట్ల మేరకు ఉండేది. దీనిలో వేములవాడ టెస్కో నుంచే రూ.1.3 కోట్ల వ్యాపారం జరుగుతోంది. రాష్ట్రంలో హైదరాబాద్‌లోని అబిడ్స్ తర్వాత వేములవాడ రెండోస్థానంలో నిలుస్తోంది. జీఎస్టీ అమల్లోకి వచ్చాక సగటున 20 శాతం విక్రయాలు తగ్గి వ్యాపారంపై ప్రభావం చూపుతున్నాయని వ్యాపారవర్గాలు చెబుతున్నాయి. చేనేత వస్త్ర విక్రయశాలను కొత్త జిల్లాల పరిధిలోనూ విస్తరించాలని ఇటీవల ప్రభుత్వం ఒక ప్రతిపాదన తీసుకొచ్చింది. ఇది అమలైతే కరీంనగర్ టెస్కో డివిజన్ పరిధిలోని పది విక్రయశాలలు ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం స్పందించి జీఎస్టీని మినహాయింపు ప్రకటనపైనే చేనేత కుటుంబాలు ఆశగా చూస్తున్నాయి.

## నిధులున్నా.. పనులు చేయరా?



కరీంనగర్ : భూగర్భ మురుగు నీటి శుద్ధి కేంద్రం ఉన్నా పూర్తిస్థాయిలో వినియోగించుకునే పరిస్థితి లేదు. కొన్ని ఇళ్లకే కనెక్షన్లు ఇచ్చి వదిలేశారు. నగరవ్యాప్తంగా కొత్తగా స్మార్ట్‌సిటీ, సీఎంఏ నిధులతో రోడ్లు వేసే సమయంలో రోడ్డు నుంచి ఇళ్ల వరకు పైపులు వేశారు. తరువాత ఇన్‌స్పెక్షన్ ఛాంబర్ నిర్మించి ఇంటి నుంచి కనెక్షన్ ఇవ్వాలి. భూగర్భ మురుగు కాలువ పనులు (యూజీడీ) కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోనే ఉన్నాయి. 2008లో పాత 50 డివిజన్ల పరిధిలో పనులు ప్రారంభించి పూర్తి చేశారు. సుమారు 300 కిలోమీటర్ల పొడవున పైపులైన్లు, ట్రంక్‌లైన్లు, మ్యాన్‌హోల్, ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు నిర్మించారు. గోపాల్‌చెరువు దగ్గర 10 ఎకరాల స్థలంలో 38 ఎంఎల్‌డీల సామర్థ్యంతో మురుగు శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నగరంలోని అయిదారు డివిజన్ల నుంచి 5 వేల కనెక్షన్ల ద్వారా రెండు ఎంఎల్‌డీల మురుగు తీసుకొని శుద్ధి చేస్తున్నారు. **అనుసంధానం చేస్తేనే..**

నగరంలోని మురుగునీటిని తరలించి శుద్ధి చేసేందుకు ఇంటింటికీ కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. మొత్తం 45 వేల కనెక్షన్లు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేయగా ఇప్పటివరకు 8,685 మాత్రమే ఇచ్చారు. స్మార్ట్‌సిటీలో 10 వేల కనెక్షన్లు ఇవ్వడానికి అవకాశముంది. అమృత్ 2.0 ప్రాజెక్టులో భాగంగా ఈ పనులకు రూ.77 కోట్లతో టెండర్లు పిలిచారు. ఇందులో రూ.55 కోట్లతో 24 వేలు ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు నిర్మించి అనుసంధానం చేసుకోవడానికి వీలుంది. వీటిలో ఇప్పటివరకు ఎలాంటి పనులు జరగడం లేదు. గడువు మరో ఏడాది మాత్రమే ఉంది. అప్పటిలోగా నిధులు వినియోగించుకోకపోతే వెనక్కి వెళ్లే అవకాశం ఉంది. **35 కిలోమీటర్ల ఛాంబర్లు** నగరవ్యాప్తంగా కొత్తగా 35 కిలోమీటర్ల మేర రహదారులు నిర్మించి ఇన్‌స్పెక్షన్ ఛాంబర్లు ఏర్పాటు చేశారు. వీటికి ఇంటింటా కనెక్షన్లు ఇస్తే మురుగునీరంతా నేరుగా ఎస్టీపీలోకి వెళ్తుంది. కొన్ని నెలల కిందట నగరంలోని కోతిరాంపూర్, కమాన్, సిరిసిల్ల రోడ్డు, మల్కాపూర్ రోడ్డు, ఆదర్శనగర్ నుంచి మంచిర్యాల చౌరస్తా మీదుగా ఇందిరానగర్ ట్రంకు లైను శుభ్రం చేశారు. వీటిలో నుంచి టాయిలెట్, మల వ్యర్థాలు, వసతి గృహాలు, అపార్ట్‌మెంట్లు, కలెక్టరేట్, సీపీ కార్యాలయాలు, బస్టాండ్, ఇతర కార్యాలయాల్లోంచి వచ్చే మురుగు పంపించవచ్చు. రోడ్డు పగలకొట్టకుండా పనులు చేసుకోవడానికి వీలుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు భూగర్భ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పక్కాగా పని చేసేలా చర్యలు చేపట్టాలి.

## 45 వసంతాలు.. అభివృద్ధికి మీనమేషాలు

మంథని : మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పడి 45 ఏళ్లు కావస్తున్నా అభివృద్ధికి నోచుకోవడం లేదు. స్థానిక జూనియర్ కళాశాల ఆవరణలో 1981 నవంబరు 16న బీఏ, బీకాం కోర్సులతో కళాశాలను ప్రారంభించారు. 22 సంవత్సరాల తదుపరి మంథని మండలం మల్లెపల్లి గ్రామశివారులో డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మించారు.

**పీజీకి దూర ప్రాంతాలకే**

కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ, బ్యాంకింగ్, ఫైనాన్స్ సర్వీసెస్ బీమా (బీఎఫ్ఎస్ఐ) కోర్సులు ఉన్నాయి. ముత్తారం, మంథని, కమాన్‌పూర్, మల్హర్, మహదేవ్‌పూర్, తాడిచెర్ల, కాటారం ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తారు. పీజీ కోర్సులు అందుబాటులో లేకపోవడంతో ఏటా 25 మంది విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసుకొని కరీంనగర్, హైదరాబాద్ తదితర నగరాలకు వెళ్తున్నారు. పెద్దపల్లి, గోదావరిఖని డిగ్రీ కళాశాలల్లో పీజీ కోర్సులు ఉన్నప్పటికీ వసతి సమస్యతో దూర



ప్రాంతాలకు వెళ్లి వ్యయప్రయాసాలు పడుతున్నారు.

**న్యాక్ గుర్తింపు ఉన్నా.. నిధులు సున్నా**

12 తరగతి గదులు అవసరం ఉండగా 7 గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. గ్రంథాలయం, ప్రయోగశాల ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. కళాశాలకు 2016లో న్యాక్ బీ, 2022లో బిం గ్రేడు గుర్తింపు లభించింది. బిం గుర్తింపు లభిస్తే కళాశాల అభివృద్ధికి రూ.2 కోట్ల వరకు నిధులు మంజూరు కావాలి. కానీ నిబంధనలు మార్చటంతో ప్రస్తుతం ఏ గ్రేడ్ కళాశాలలకు మాత్రమే నిధులు ఇస్తున్నారు. 2018లో రూ.30 లక్షలతో తెలంగాణ స్కిల్స్ నాలెడ్జ్ సెంటర్(టీఎస్‌కేసీ) పేరిట హాలు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. భవనం శ్లాబ్ వరకు నిర్మించి వదిలివేశారు.

**ఏటా తగ్గుతున్న విద్యార్థులు**

బస్సు దిగి కళాశాలకు వెళ్లడానికి విద్యార్థులకు బురద రోడ్డే దిక్కయింది. సాయంత్రం వేళలో బస్సులు ఆపకపోవటంతో విద్యార్థులు 3 కి.మీల దూరంలోని మంథనికి నడుచుకుంటూ వచ్చిన సందర్భాలున్నాయి. బాలికలకు వసతిగృహం అందుబాటులో లేకపోవడంతో దూర ప్రాంత విద్యార్థినులు కళాశాలలో చేరటానికి వెనకంజ వేస్తున్నారు. ప్రారంభంలో 300 పైగా విద్యార్థులు ఉండగా ఆ సంఖ్య తగ్గుతోంది. గతేడాది 140 పైగా ఉండగా.. ప్రస్తుతం 125 మంది విద్యార్థులు చదువుతున్నారు. నైట్‌వాచ్‌మెన్, స్వీపర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

## నీరేది ?.. ఖాళీగా 30 శాతం చెరువులు

భువనగిరి : భారీ వర్షాలు కురిశాయి. ప్రధాన వాగులు పొంగి పొర్లుతున్నాయి. విచిత్రమేమిటంటే పెద్ద చెరువులు నీరులేక వట్టిపోయి కనిస్తున్నాయి. తుర్కపల్లి, బొమ్మలరామారం, మోత్కూరు, అడ్డగూడూరు, గుండాల మండలాల్లో గంటల వ్యవధిలోనే 10 నుంచి 16 సెం.మీ వర్షం ఏకధాటిగా కురవడంతో పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. కొన్ని మండలాల్లో సగం చెరువులు నిండగా.. మరికొన్ని ఖాళీగా ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 1155 చెరువులు ఉండగా 470 చెరువుల్లో 0–25 శాతం మాత్రమే నీరుంది. 196 చెరువులు మాత్రమే అలుగు పోస్తున్నాయి. 178 చెరువుల్లో 75 నుంచి 100 శాతం నీరు చేరింది. చౌటుప్పల్ మండలంలో 145, నారాయణపురంలో 134, ఆత్మకూరు(ఎం)లో 84 అధిక శాతం వర్షపాతం నమోదైనా.. పెద్దగా ప్రభావం కనిపించలేదు. చౌటుప్పల్, నారాయణపురం మండలాల్లో కలిపి 100 ఎకరాల ఆయకట్టు ఉన్న చెరువులు 15 ఉండగా ఇంకా 10 చెరువుల్లో నీరు చేరలేదు. భువనగిరి మండలం వడపర్తి కత్వ గేటును భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సోమవారం ఎత్తారు. దీంతో భువనగిరి, బీబీనగర్ చెరువుల్లోకి నీరు వచ్చే అవకాశం ఉంది. భువనగిరి పెద్ద చెరువు, బస్వాపూర్, రాజాపేట మండలం జాల, బీబీనగర్ చెరువులు ఇంకా సగానికిపైగా ఖాళీగా ఉన్నాయి. మూసీ పరివాహక ప్రాంతాలు ఉన్న భువనగిరి నియోజకవర్గంలో పరిస్థితి కొంత మెరుగ్గానే ఉంది. ఆలేరు నియోజకవర్గంలో 512 చెరువులు ఉండగా.. 266 చెరువుల్లో నీటి మట్టాలు 0–25 శాతం లోపే ఉన్నాయి. 22 మాత్రమే అలుగు పోస్తున్నాయి. తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని మోత్కూరు, అడ్డగుడూరు మండలాల్లో



చెరువుల పరిస్థితి ఆశాజనకంగా ఉంది. రామన్నపేటలో 77 చెరువులకు 45 చెరువుల్లో 25 శాతం కూడా నీరు చేరలేదు. చౌటుప్పల్, లక్కారంలోని చెరువుల్లోకి చుక్క నీరు చేరలేదు. భారీ వర్షాలు కురిసి వాగులు పారితే మల్కాపురం, కైతాపురం, లక్కారం, చౌటుప్పల్ వరకు గొలుసు చెరువులు నిండి అలుగు పోస్తాయి. ఇప్పటి వరకు ఆ పరిస్థితి లేదు. వానాకాలంలోనూ చౌటుప్పల్‌లో మూడు వార్డుల పరిధిలో ట్యాంకర్లతో ఇంటింటికీ నీటిని పురపాలిక ద్వారా సరఫరా చేస్తున్నారు. రాజపేట మండలంలో అతి పెద్ద చెరువులైన కుర్రారం ఊర చెరువు, పాముకుంట వెంకటాద్రి చెరువు, రాజపేట గోపాల్ చెరువు, సింగారం రెడ్డి చెరువు, బొందుగుల, నెమిల గ్రామాల్లోని ఊర చెరువుల పరిస్థితి దయనీయంగా ఉంది.

చురకలు



# పార్శిల్ సేవల్లో ఆర్టీసీ వేగం

చిత్తూరు: ఆర్టీసీలోని కార్గో సేవలు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. పార్శిల్ సేవలను ప్రజలకు చేరువ చేస్తూ అంతకంతకు ఆదాయాన్ని ఆర్జిస్తోంది. లాజిస్టిక్ విభాగంలోనూ పైచేయిగానే నిలుస్తోంది. ఒకేసారి 10 నుంచి 12 టన్నుల సరకును నిర్దేశించిన సమయం లోపు చేరవేస్తూ.. ప్రజల్లో నమ్మకాన్ని సంపాదిస్తోంది. 2017లో ప్రారంభమైన కార్గో సేవలు మొదటి రోజు రూ.10 వేల ఆదాయంతో అడుగులు పెట్టి.. ప్రస్తుత రోజుకు రూ.1.50 లక్షలు సమకూరుస్తోంది. సింగో సొల్యూషన్స్ ప్రైవేటు సంస్థ ఏజెన్సీల ద్వారా పార్శిల్ బుకింగ్ సేవలు నిర్వహిస్తూ.. వాటికి కమిషన్ చెల్లిస్తోంది. మున్ముందు పార్శిల్ సేవలతో పాటు డోర్ డెలివరీలను మరింత పెంచే దిశగా ఆర్టీసీ అడుగులు వేస్తోంది.

**నెలకు రూ.42 లక్షల ఆదాయం..**

చిత్తూరు ఒకటి, రెండో డిపో, పలమనేరు, కుప్పం, పుంగనూరు డిపోలతో పాటు వి.కోట బస్టాండులో కూడా పార్శిల్ సేవలు అందుబా



టులో ఉన్నాయి. ఈ డిపోల పరిధిలో రోజుకు కనీసం 650 పార్శిళ్లు బుక్ అవుతుండగా.. వాటి ద్వారా నెలకు రూ.42 లక్షలకు పైగానే ఆదాయం సమకూరుతోంది.

80 ప్రాంతాల్లో..చిత్తూరు నుంచి శ్రీకాళం వరకు ఆర్టీసీ కార్గో సేవలు అందుతున్నాయి. రాష్ట్రంలోని 80 ప్రాంతాల్లో ఉన్న డిపోలకు 10 కి.మీ దూరం వరకు డోర్ డెలివరీలు ఉంటున్నాయి. జిల్లా నుంచి బంతి, చామంతి, బెల్లం, ప్లాస్టిక్, పన్నీరు, కోవా తదితర సరకులు ఎగుమతి అవుతున్నాయి. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు సైతం కార్గో సేవలు అందడం విశేషం.

# శిశువిలాపం

కర్నూలు : నవజాత శిశు సంరక్షణ కేంద్రాలు సమస్యల వలయంలో చిక్కుకున్నాయి. వివిధ స్థాయుల్లో వైద్య సేవలందించేందుకు ఉమ్మడి జిల్లాలో పలుచోట్ల ఎస్ఎన్‌సీయూ (స్పెషల్ న్యూబోర్న్ కేర్ యూనిట్)లు ఏర్పాటు చేశారు. కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, సున్నిపెంట, ఆత్మకూరు, వెలుగోడు మండల కేంద్రాల్లోని ఆసుపత్రుల్లో కేంద్రాలు ఉన్నాయి. నవజాత శిశువుల్లో ఏవైనా అనారోగ్య సమస్యలు తలెత్తితే ఈ కేంద్రాల్లో ఉంచి సంరక్షిస్తారు. పుట్టిన పిల్లలు ఏడవకపోవడం, తక్కువ బరువుతో జన్మించడం.. 35 వారాలు నిండకుండా ప్రసవం కావడం, ఫిట్స్ వచ్చే శిశువులు, ఉమ్మనీరు మింగినవారు, శ్వాస సంబంధిత సమస్యలున్న శిశువులకు కేంద్రాల్లో వైద్య సేవలందిస్తారు..

**ప్రైవేటు బిల్లు.. గుండె గుబేలు**

ఎస్ఎన్‌సీయూ సేవలు అత్యంత ఖరీదైనవి. వివిధ సమస్యలతో బాధపడుతున్న పిల్లలను వార్మర్లపై ఉంచి తల్లి గర్భంలోని వాతావరణం ఉండేలా చేస్తారు. ఒక శిశువును ప్రైవేటుగా ఉంచాలంటే.. ఆస్పత్రి స్థాయిని బట్టి రూ.2 నుంచి 8 వేల వరకు వసూలు చేస్తారు. వైద్య సేవలను బట్టి బిల్లులుంటాయి. మూడు నాలుగు రోజులుంటే.. రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు చేయాల్సిందే. అప్పుడే పుట్టిన పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉండటంతో ఇన్‌ఫెక్షన్లు వేగంగా సోకే ప్రమాదం ప్రమాదముంటుంది.

**ఎక్కడ.. ఎలా ఉందంటే..**

ఆదోని ప్రభుత్వ మహిళా, శిశు ఆస్పత్రిలో 2022లో భవ్య ఏజెన్సీ నిర్వహణలో ఎస్ఎన్‌సీయూ సేవలు పీపీపీ విధానంలో ప్రారంభమయ్యాయి. పది పడకలు ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ప్రతి నెలా జనన నమోదు 120–130 వరకు ఉంటుంది. పది పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. రెండు కాన్సన్‌ట్రేటర్లు మరమ్మతులకు గురయ్యారు. ఆక్సిజన్ ప్లాంట్ పనిచేయక నాలుగేళ్లు దాటింది. ఆక్సిజన్ సిలిండర్లు కొనుగోలు చేసి సేవలందిస్తున్నారు. ఇంత పెద్ద కేంద్రం ఏర్పాటుచేసినప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో వచ్చిన శిశువులను నెలలో కనీసం 10–15 మందిని కర్నూలుకు రెఫర్ చేస్తున్నారు.

కర్నూలు జీజీహెచ్‌లో 60 పడకలు ఏర్పాటు చేశారు. ఇందులో 12 వెంటిలేటర్లకు గాను ఆరు మాత్రమే పనిచేస్తున్నాయి. ఎనిమిది మంది వైద్యులు, 25 మంది సిబ్బంది ఉన్నారు. రోజు 30 ఐపీ, నెలకు వెయ్యి మంది వైద్య సేవలు పొందుతున్నారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆస్పత్రిలోని కేంద్రాన్ని పబ్లిక్, ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలోకి తెచ్చేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి.

# ఆదాయ గని.. తవ్వేదెవరని!

చీపురుపల్లి: ఉమ్మడి జిల్లాలో సీనరేజ్ వసూలు బాధ్యత 2023లో రెండేళ్ల కాలానికి ఓ కంపెనీతో గత ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. నెలకు రూ.7.14 కోట్లు (జీఎస్టీతో) ఆ సంస్థ చెల్లించేది. ఈ ఏడాది జులై 6తో ఒప్పందం పూర్తవడంతో బాధ్యతల నుంచి తప్పుకొంది.

ఉమ్మడి జిల్లాలో గనులు భూగర్భశాఖ అనుమతితో 153 క్వారీల లీజులు నడుస్తున్నాయి. వీటికి పర్మిట్లు జారీచేసి, సీనరేజ్ వసూలు చేసేందుకు సంస్థ 40 చెక్‌పోస్టులు, 200 మంది సిబ్బందిని వినియోగించినట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్‌మెటల్, గ్రావెల్ అక్రమంగా తరలుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాస్థాయిలో శాఖ అధికారితో పాటు ఇద్దరు సాంకేతిక సహాయకులు, ఒక ఆర్ఐ పర్యవేక్షించడం కష్టమవుతోంది. దీంతో ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది.

న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్, ఎస్.కోట: గనుల సీనరేజ్ రూపంలో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. ఉమ్మడి జిల్లాలో గనులకు పర్మిట్లు జారీ నుంచి సీనరేజ్ వసూలు, ఇతర ప్రభుత్వ శాఖలకు సంబంధించిన రికవరీ వరకూ ఓ ఏజెన్సీకి బాధ్యతలు అప్పగించారు. ఇందుకు గానూ నెలకు రూ.7 కోట్లు ప్రభుత్వానికి చెల్లించేవారు. సంస్థ కాలపరిమితి ముగియడంతో ఆ బాధ్యత గనుల శాఖ చేతికే వచ్చింది. అరకొర సిబ్బందితో వీటి నిర్వహణ కష్టమవుతోంది. రెండు నెలలుగా పర్యవేక్షణ కొరవడడంతో ప్రభుత్వం ఆదాయం కోల్పోతోంది.

ఏం జరుగుతోంది

ప్రస్తుతం ఒకే పర్మిట్‌తో ఎక్కువసార్లు రవాణా జరుగుతోంది. కొన్నిసార్లు పర్మిట్ లేకుండా తరలిస్తున్నారు.

గతంలో అక్రమ మైనింగ్ జరిగితే ఏజెన్సీ ప్రతినిధుల సమాచారంతో అధికారులు కేసులు నమోదు చేసి, జరిమానాలు విధించేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు.

శాఖాపరంగా నిర్వహణ.. ప్రస్తుతం శాఖాపరంగా పర్మిట్ల జారీ, సీనరేజ్ వసూలు చేస్తున్నాం. 85 శాతం రోడ్‌మెటల్ ప్రభుత్వ పనులకు వెళ్తోంది. మిగిలినది ప్రైవేటు వారు తీసుకుంటున్నారు. గ్రావెల్‌పై ఎక్కువ దృష్టిసారించాం. గ్రానైట్ తరలింపుపై అనుమతి తప్పనిసరి. సిబ్బంది కొరత ఉంది. ఉన్న మేరకు దృష్టిసారించాం. కె.సూర్యచంద్రరావు, జిల్లా గనులు భూగర్భశాఖాధికారి

# నమ్మిస్తాం.. మళ్లీ అమ్మేస్తాం!




విశాఖపట్నం: విశాఖ మహాప్రాంత అభివృద్ధి సంస్థ(వీఎంఆర్‌డీఏ)లో అమ్మేసిన ప్లాట్లను తిరిగి విక్రయించేస్తున్నారు. అధికార యంత్రాంగమే ఆ తప్పిదానికి పాల్పడడంతో పలు లేఅవుట్లలోని కొనుగోలుదారులు బెంబేలెత్తుతున్నారు. తమ ప్లాట్లు ఎక్కడమ్మేశారోనని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. 'ఈసీ'లు తనిఖీ చేసుకుంటున్నారు. మారికవలస వద్ద గతంలో వుడా 'ఓజోన్ వ్యాలీ' లేఅవుట్‌ను డెవలప్ చేసింది. అందులో కొన్ని ప్లాట్లను గతంలోనే అమ్మేశారు. అందులో మిగిలిపోయిన ప్లాట్లకు ఇటీవల వేలం నిర్వహించగా.. అప్పటికే అమ్మేసిన వాటిని కూడా విక్రయించేయడం విస్మయం కలిగిస్తోంది.

**రిజిస్ట్రేషన్ సమయంలో:** గతంలో ప్రైవేటు వ్యక్తుల నుంచి భూములు తీసుకొని 'వుడా' ఓజోన్ వ్యాలీ లేఅవుట్ ఏర్పాటు చేసింది. ఆ సమయంలో భూములు ఇచ్చిన వారికి ఎకరాకు 1,800 గజాల ప్లాట్లను ఒప్పందంలో భాగంగా అప్పగించింది. మిగిలిన స్థలంలో లేఅవుట్ అభివృద్ధి చేసి అన్ని వర్గాలకు వీలుగా మొత్తం 108 ప్లాట్లు వేసింది. అందులో కొన్ని మిగిలిపోయాయి.

మిగులు ప్లాట్లు విక్రయించాలని వీఎంఆర్‌డీఏ ఇటీవల నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఆ లేఅవుట్‌ను ఆధునికీకరించింది. విద్యుద్దీపాలు, కాలువలు నిర్మించి రోడ్లు బాగు చేసింది. అనంతరం అందులో ప్లాట్లు విక్రయానికి ఉంచడంతో అసలు కథ మొదలైంది.

ఆన్‌లైన్‌లో ఈ–కొనుగోలు విధానంలో అందులోని ప్లాట్లను కొందరు కొనుగోలు చేశారు. వేలంలో దక్కించుకున్న వారు డబ్బులు చెల్లించి వీఎంఆర్‌డీఏ నుంచి కొనుగోలు ఒప్పంద పత్రాలు తీసుకున్నారు. తీరా.. రిజిస్ట్రేషన్‌కు సిద్ధమవుతున్న సమయంలో వాస్తవం బయట పడింది. గతంలో అమ్మేసిన పది ప్లాట్లను తిరిగి విక్రయించినట్లు ఆ సమయంలో గుర్తించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆపారు. గతంలోనే కొనుగోలు చేసిన యజమానులు లబోదిబోమన్నారు. వారి స్థలాలకు ఎటువంటి ఇబ్బంది లేదని తేల్చి చెప్పడంతో శాంతించారు.

**ఎలా జరిగింది?**

విక్రయించేసిన వాటిల్లో 311 గజాల స్థలాలు కొన్ని ఉన్నాయి. కొన్ని 250 గజాలు, మరికొన్ని 300 గజాలున్నాయి. ప్రస్తుతం కొనుగోలు చేసిన వారికి అదే లేఅవుట్‌లో ప్లాట్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ తప్పిదంపై వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ ఉద్యోగులపై మండిపడ్డారు. అమ్మేసిన ప్లాట్లను తిరిగి అమ్మకానికి ఎలా ఉంచారన్నది విచారిస్తున్నారు. ఎస్టేట్ విభాగంలో జరిగిన ఈ తప్పిదానికి కారణాలను విశ్లేషిస్తున్నారు. వీఎంఆర్‌డీఏ లేఅవుట్లలో మిగిలిపోయిన ఖాళీ స్థలాలు, ప్లాట్లు ఎక్కడెక్కడ ఉన్నాయనేది గత కొంతకాలంగా గుర్తిస్తున్నారు. కొందరు కొన్న వాటిని అలాగే ఖాళీగా ఉంచేశారు. వాటిని పరిశీలించి నివేదిక రూపొందించాల్సి ఉన్నా...తూతూమంత్రంగా సాగించినట్లు సమాచారం.

# నరాల సమస్యలా.. విమ్స్ ఉందిగా..!



విశాఖపట్నం: ఉరుకులపరుగుల నగర జీవితంలో ఒత్తిడి పెరిగి నాడీ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇది నరాల వ్యాధులకు దారితీస్తోంది. ఉద్యోగులు, మహిళలు, యువత ఆయా వ్యాధులతో బాధపడుతూ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందాలంటే రూ.వేలల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. హనుమంతువాకలోని విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ(విమ్స్)లోని న్యూరాలజీ విభాగంలో వాటికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారు.

**ఏయే వ్యాధులకు చికిత్స అందిస్తారంటే..:** తలనొప్పి, మూర్ఛ, పక్షవాతం, వణుకుడు, మతిమరుపు, నరాల బలహీనత, కాళ్లు, చేతుల్లో తిమ్మిర్లు, మంటలు, మెడ, నడుము నొప్పి, కళ్లు తిరగడం, కండరాల జబ్బులు, కంటి నరాల వాపు, తూలినట్లు నడవటం, వెన్నెముక నొప్పులు, తుంటినొప్పి, నరాల బలహీనత, నిద్ర సమస్యలు, చిన్నపిల్లల్లో మానసిక వైకల్యం, మెదడు, వెన్నెముక వ్యాధు లకు చికిత్స చేస్తారు.

స్మార్ట్‌ఫోన్ల అధిక వినియోగంతో ఇబ్బందులు: ఇక్కడ ఇద్దరు వైద్యులు, ఆరుగురు సహాయ సిబ్బంది అందుబాటులో ఉన్నారు. నిత్యం ఓపీ (అవుట్ పేషెంట్)కి 70 నుంచి 80 మంది వరకు వస్తున్నారు. 'ఇటీవల ప్రజల జీవన శైలిలో వచ్చిన మార్పు కారణంగా నరాల వ్యాధులు ఎక్కువ అవుతున్నాయి. గంటల తరబడి స్మార్ట్ ఫోన్ల వాడకంతో మెడ, భుజాల నొప్పులు వస్తున్నాయి. ఎక్కువ సేపు కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, ట్యాబ్‌ల ముందు కూర్చోవడంతో వెన్నెముక నొప్పి బారిన పడుతున్నారు. చిన్న వయసులోనే మైగ్రేన్, బీపీ, మూతి వంకరపోవటం, కాళ్లు చేతులు తిమ్మిళ్లు, వణుకు లాంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయి. వాటికి విమ్స్‌లో ఆధునిక వైద్యం అందుబాటులో ఉంది' అని న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బి.బాలప్రదీప్ తెలిపారు.

రూ.50వేల విలువైన ఇంజెక్షన్ ఉచితం: పక్షవాతం వచ్చిన గంటలోపు విమ్స్‌కి తీసుకొస్తే రూ. 50వేల విలువైన ఇంజెక్షన్‌ను ఉచితంగా ఇస్తున్నాం. తద్వారా రోగిలో కదలికలు మొదలై మామూలు స్థితికి వస్తాడు. పేద, మధ్యతరగతి వర్గాలకు ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా చికిత్స అందిస్తున్నాం. బ్లడ్‌బ్యాంకు, అంబులెన్స్‌లు కూడా ఉన్నాయి. డాక్టర్ రాంబాబు, విమ్స్ డైరెక్టర్

# పెరిగిన సాయం.. పండక్కి ఖాయం..

విశాఖపట్నం: రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు అండగా నిలుస్తామని స్త్రీశక్తి పథకం ప్రారంభించిన రోజే ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ మేరకు అర్హులైన వారికి రూ.15 వేల చొప్పున ఆర్థిక సాయం అందించనున్నట్లు ఇటీవల అనంతపురంలో జరిగిన సభలో చంద్రబాబు ప్రకటించారు. గత వైకాపా ప్రభుత్వం రూ.10 వేలు ఇచ్చింది. కూటమి ప్రభుత్వం ఆ మొత్తాన్ని రూ.15 వేలకు పెంచడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అర్హతలు ఉన్నా నిబంధనల కారణంగా కొందరు వాహన మిత్ర పథకానికి దూరమయ్యారు. ఈ సారి అలా కాకుండా పారదర్శకంగా పథకాన్ని అమలు చేసేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. **జిల్లాలో 40 వేల మందికి లబ్ధి:** రాష్ట్రంలో అత్యధికంగా విశాఖ జిల్లాలో 40 వేల మందికి పైగా లబ్ధి చేకూరనుంది. వీరిలో ఆటోడ్రైవర్లు 30 వేలకు పైగా ఉంటారని, మ్యాక్సీ క్యాబ్‌ల డ్రైవర్లు 10 వేల మంది వరకు ఉండొచ్చని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో వాహన మిత్ర పథకం లబ్ధిదారుల వివరాలను సేకరించే పనిలో రవాణా శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. సొంత వాహనం కలిగి ఉండి వాటిని నడుపుతున్న డ్రైవర్లకు ఈ పథకం వర్తిస్తుంది. పూర్తి వివరాలు సేకరించాక వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో వాహన మిత్ర ద్వారా లబ్ధి పొందిన వారి సమాచారం ఇప్పటికే ప్రభుత్వం వద్ద ఉంది. సచివాలయాల్లో దరఖాస్తుల స్వీకరణ: కొత్తగా అర్హులైన వారి దరఖాస్తులు ఈనెల 17 నుంచి 19 వరకు అన్ని వార్డు సచివాలయాల్లో స్వీకరించనున్నారు. ఈనెల 22లోపు పరిశీలన చేసి 24న తుది జాబితాను విడుదల చేయనున్నట్లు అధికారులు తెలియజేశారు. అక్టోబరు 1న అర్హులైన వారి ఖాతాలో రూ.15 వేల జమ చేయనున్నారు.

# అంతా తుస్!

అనకాపల్లి :పెట్రోలు బంకుల్లో వినియోగదారులకు తప్పనిసరిగా తాగునీరు, వాహనాలకు గాలి, మరుగుదొడ్లు అందుబాటులో ఉంచాలి. వీటితో పాటు ధరల పట్టిక, ప్రథమ చికిత్స కిట్లు ఉండాలి. చాలా బంకుల్లో ఇవన్నీ కాగితాలకే పరిమితమవుతున్నాయి. తహసీల్దార్ నుంచి జేసీ వరకు తనిఖీలు చేసే అధికారం ఉంది. ఆయిల్ కంపెనీల అధికారులు తరచూ పరిశీలించాలి. బంకుల్లో తనిఖీలు అంతంత మాత్రంగానే ఉండడంతో వాహనాదారులకు సదుపాయాలు అందడంలేదు. జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన పెట్రోల్, డీజిల్ బంకులు 185 వరకు ఉన్నాయి. అనకాపల్లి నియోజకవర్గంలోనే 26 ఉన్నాయి. వీటిలో 70 శాతం బంకుల్లో నిబంధనలు అమలు కావడంలేదు. అనకాపల్లి – విజయవాడ జాతీయ రహదారిలో కశింకోట ప్రాంతాల్లో 12 వరకు బంకులున్నాయి. వీటిలో తాగునీరున్నా.. మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉంటున్నాయి. బంకు సిబ్బందే ఉపయోగిస్తున్నారు. పలు బంకుల ముందే పంక్చర్ షాపులున్నాయి. ఒక టైరుకు గాలి పెడితే రూ.10 చొప్పున కారు రూ.40 వసూలు చేస్తున్నారు. అనకాపల్లి పట్టణంలో రెండు బంకులున్నాయి. ఒక దానిలో వాహనాలకు గాలి కొట్టింది ఎప్పుడూ లేదు. వీటిలో మరుగుదొడ్లు ఎక్కడ ఉన్నాయో కూడా తెలియని పరిస్థితి. ఈ విషయాన్ని జాయింట్ కలెక్టర్ జాహ్నవి దృష్టికి తీసుకువెళ్లగా.. బంకుల్లో విధిగా తాగునీరు, మురుగుదొడ్ల సదుపాయం కల్పించడంతోపాటు వాహనాలకు ఉచితంగా గాలి పెట్టాలన్నారు. అన్ని బంకులను తనిఖీ చేస్తామన్నారు. నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# మూడున్నరేళ్ల యాతన

చీపురుపల్లి: విజయనగరం–పాలకొండ ప్రధాన రహదారిలో చీపురుపల్లిలోని జి.అగ్రహారం వద్ద ఆర్వోబీ నిర్మాణం ప్రారంభించి దాదాపు 30 నెలలు గడుస్తున్నా.. నేటికీ పనులు పూర్తికాలేదు. వంతెన అందుబాటులోకి రాకపోవడంతో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాలతో పాటు ఒడిశా ప్రయాణికులకు అవస్థలు తప్పడంలేదు. ఆర్వోబీ శిథిలావస్థకు చేరుకోవడంతో దాదాపు మూడున్నర ఏళ్ల కిందట భారీ వాహనాల రాకపోకలను నిషేధించారు. రాజాం, పాలకొండ, ఒడిశా వైపు నుంచి చీపురుపల్లి మీదుగా విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, రాజమహేంద్రవరం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, హైదరాబాద్ ప్రాంతాలకు రాకపోకలు సాగించాల్సిన ఆర్టీసీ బస్సులతో పాటు లారీలు, ఇతర రవాణా వాహనాలన్నీ నిలిపేశారు. ప్రస్తుతం కొన్ని చిలకపాలెం మీదుగా.. కొన్ని గరివిడి, గర్భాం మీదుగా వెళ్తున్నాయి.

**ఇదే అసలు సమస్య**

కొత్తగా వంతెన నిర్మాణానికి 2022 ఆగస్టు 16న కేంద్ర రైల్వే బోర్డు రూ.12.97 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణాలను 2023 మార్చిలో ప్రారంభించారు. చీపురుపల్లి వైపు కాంక్రీటు గోడ నిర్మిస్తే కొత్తఅగ్రహారం, రిక్షాకాలనీకి వెళ్లేందుకు రోడ్డు సదుపాయం కోల్పోతామంటూ స్థానికులు పలుమార్లు పనులు అడ్డుకున్నారు.

ర.భ.శాఖ అధికారులు సర్వీసు రహదారి నిర్మాణానికి అడ్డంగా ఉన్న



దుకాణాలను కొంతవరకు తొలగించి 12 అడుగుల స్థలాన్ని సిద్ధం చేయించారు.

**ఆర్టీసీకి రూ.37.80 కోట్లు నష్టం**

పాలకొండ డిపో నుంచి చీపురుపల్లి మీదుగా విజయనగరం, విశాఖపట్నం, ఇతర ప్రాంతాలకు రోజూ దాదాపు 49 బస్సులు తిరిగేవి. ఇప్పుడు చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి కావడంతో కేవలం 20 మాత్రమే రాకపోకలు సాగిస్తున్నాయి.

వంతెన మీదుగా భారీ వాహనాల రాకపోకలను నిషేధించిన నాటి నుంచి నేటి వరకు పాలకొండ డిపోకు రూ.37.80 కోట్లు నష్టం(రోజుకు రూ.3 లక్షలు) వాటిల్లినట్లు డిపో అధికారులు చెబుతున్నారు. పాలకొండ నుంచి విజయనగరం మధ్య రాజాం, చీపురుపల్లి, గరివిడి, నెల్లిమర్ల వంటి పట్టణాలు ఉన్నాయి. ప్రయాణికులు భారీగా రాకపోకలు సాగిస్తుంటారు. పెద్ద ఎత్తున పరిశ్రమలు ఉన్నాయి. ముడిసరకు రవాణాకు ఇక్కట్లు తప్పడం లేదని వాపోతున్నారు.

**చర్యలు చేపడతాం..**

సర్వీసు రోడ్డు సమస్యతో వంతెనకు సంబంధించిన 40 మీటర్ల కాంక్రీటు గోడ నిర్మాణం ఆగిపోయింది. ఇది పరిష్కారమైతే 20 రోజుల్లో వంతెనను అందుబాటులోకి తెస్తామని గుత్తేదారు ప్రతినిధులు చెబుతున్నారు. విషయం ర.భ.శాఖ ఏఈ కె.మురళీబాబు వద్ద ప్రస్తావించగా.. సర్వీసు రహదారికి అడిగిన 12 అడుగుల స్థలాన్ని సేకరించి ఇచ్చామని, స్థానికులు సరిపోదంటున్నారన్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు.

# గొంతు దిగని గంగ... 'కొనలేక బెంగ'


సంతనూతలపాడు : ఒంగోలు నగరానికి కూతవేటు దూరంలోనున్న సంతనూతలపాడుకు గతంలో ఏర్పాటుచేసిన నీటి పథకం నిర్వహణ గాడి తప్పింది. నిధులిచ్చినా మరమ్మతులు లేవు. ఫలితంగా ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పడంలేదు.

**ఫిల్టర్ బెడ్లు పూర్తిగా నిరుపయోగం**

చిన్న చెరువులో 10 ఏళ్ల క్రితం మంచినీటి పథకాన్ని ఏర్పాటుచేశారు. పెరుగుతున్న గ్రామ జనాభాకు తగినట్లుగా గ్రామంలోని పెద్ద చెరువు వద్దనున్న బోర్లతో పాటు ఈ పథకం నుంచి సైతం తాగు నీటిని అందించేలా నిర్మించారు. తొలి నాళ్లలో బాగానే నడిచింది. రోజులు గడిచే కొద్దీ నిర్వహణ కొరవడింది. దీంతో మైక్రో ఫిల్టర్ బెడ్‌లు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. అప్పటి నుంచి గ్రామంలో రంగు మారిన నీరే సరఫరా అవుతోంది. సుమారు 10వేలకు పైగా జనాభా ఉన్న ఈ గ్రామంలో సగానికి ఈ పథకం నుంచే తాగు నీటిని అందిస్తుంటారు. కానీ స్వచ్ఛమైన నీరు సరఫరా కాకపోవడంతో కేవలం వాడుకకు మాత్రమే వినియోగించాల్సి వస్తోంది.

**బావి నుంచి తెచ్చుకుంటున్నారు**

తాగేందుకు బహిరంగ మార్కెట్లో బబుల్స్ కొనుగోలు చేయాల్సి వస్తోంది. కొనుగోలు చేయలేని వారు పెద్ద చెరువు వద్దనున్న మంచినీటి బావి నుంచి తెచ్చుకుంటున్నారు. ఏళ్లు గడుస్తున్నా పథకానికి మరమ్మతులు చేపట్టడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. మరో వైపు దీని నిర్వహణ భారం మోయలేక



పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు 'మీది..మీది' అంటూ మొండి చెయ్యి చూపారు.

**రూ.20 లక్షల నిధుల కేటాయింపు**

మంచినీటి పథకాన్ని అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు జడ్పీ నుంచి రూ.20లక్షల వరకు నిధులు కేటాయించారు. పథకాన్ని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కేటాయించి టెండర్లు పిలిచి పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాలని యోచించారు. ఇందుకు తగ్గట్టుగా నిధులు కేటాయించినా ఇంకా టెండర్లు మాత్రం పిలవలేదు. టెండర్లు పిలిచి మైక్రో ఫిల్టర్ బెడ్‌లను అందుబాటులోకి తీసుకువస్తే గ్రామంలో స్వచ్ఛమైన తాగు నీరు సరఫరా అవుతుంది.

# ఆక్రమణలపై హక్కు.. పేదలకు దక్కు

నర్సీపట్నం: ప్రభుత్వ స్థలాల్లో ఏళ్ల తరబడి నివాసం ఉంటున్న పేదలకు ఊరట లభించనుంది. కూటమి సర్కారు వీరికి ఉపశమనం కలిగించేలా ఆ స్థలాలపై హక్కులు కల్పిస్తూ క్రమబద్ధీకరణ అవకాశం ఇస్తోంది. రెవెన్యూ అధికారులు దరఖాస్తుల స్వీకరణ ఇప్పటికే ప్రారంభించారు. 2019 అక్టోబరు 15కు ముందు 150 గజాల్లోపు చోటుచేసుకున్న ఆక్రమణలను ఉచితంగా క్రమబద్ధీకరించనున్నారు. అంతకంటే ఎక్కువ ఉంటే మార్కెట్ విలువ ఆధారంగా నిర్దేశిత రుసుం చెల్లిస్తే పరిశీలించి క్రమబద్ధీకరిస్తారు. ప్రభుత్వ భూముల్లో వివాదాలు లేని స్థలాల్లోని నివాసాలకు నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరణ సులువవుతుంది. ఆక్రమిత స్థలాల్లోని వారు



అన్ని వివరాలతోపాటు ఇంటి పన్ను, విద్యుత్తు బిల్లు రసీదులతో వార్డు సచివాలయంలో దరఖాస్తు చేయాలి. మండల రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నాయి.

నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ పరిధిలో అభ్యంతరం లేని భూముల్లో నివాసం ఉంటున్న వారి వివరాల సేకరణ, సర్వే తహసీల్దార్లు చేపడుతున్నారు. క్రమబద్ధీకరణకు అనువైన వాటిని గుర్తించి వీఆర్వోల ద్వారా అర్హులైన వారితో దరఖాస్తు చేయిస్తున్నారు.

నర్సీపట్నం మండలంలో ఇప్పటివరకు 30 దరఖాస్తులు అందాయి. అంతకు ముందే తహసీల్దారు రామారావు మండలంలోని అభ్యంతరం లేని ప్రాంతాలను సర్వే చేసి 17 మందితో దరఖాస్తు చేయించారు. దుగ్గాడ, ధర్మసాగరం, బలిఘట్టం తదితర ప్రాంతాల్లోని గయా, బంజరు, కొండ పోరంబోకు భూముల్లోని వారు ఎవరైనా ఉంటే నేరుగా దరఖాస్తు చేయవచ్చన్నారు.

'డివిజన్లో ఇప్పటివరకు 214 మంది క్రమబద్ధీకరణకు ముందుకు వచ్చారు. వీటిపై క్షేత్ర స్థాయిలో విచారణ చేపడుతున్నాం. ప్రభుత్వ ఇచ్చిన ఈ అవకాశంతో అర్హులందరికీ ఆస్తిపై పూర్తి హక్కులు లభిస్తాయి. ఆస్తి విలువ పెరగడంతోపాటు బ్యాంకుల నుంచి రుణాలు పొందవచ్చు. ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు వరకు గడువు ఉంద'ని నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ పేర్కొన్నారు.

# నారీ ఆరోగ్యం.. కుటుంబానికి భద్రం

అనకాపల్లి : ఇల్లాలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం మొత్తం బాగుంటుంది. ఇంటి పనులు చూసుకునే మహిళల్లో చాలామంది తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం లేదు. అనారోగ్యానికి గురైతే మందుల షాపుల నుంచి మాత్రలు తెచ్చుకుని వాటితోనే సరిపెట్టుకుంటున్నారు. వ్యాధి ముదిరాక ఇబ్బందులు పడుతున్నారు. ఈ తరుణంలో మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టిసారిస్తున్నాయి.'స్వస్థ నారీ.. స్వశక్త్ పరివార్ అభియాన్' పేరుతో ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు మహిళలకు ఆరోగ్య పరీక్షలు చేసేందుకు వైద్యారోగ్య శాఖ సన్నద్ధమవుతోంది. గతంలో జిల్లా వ్యాప్తంగా సర్వే చేసి ప్రజల ఆరోగ్య స్థితిగతులపై నివేదిక రూపొందించారు. 17 నుంచి 49 ఏళ్లలోపు మహిళల ఆరోగ్యంపై గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి పరీక్షలు చేయనున్నారు. సుగర్, బీపీ, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు, ఇతర అనారోగ్య సమస్యలకు చికిత్స అందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయిం



చింది. అధిక రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, క్షయ స్క్రీనింగ్, బాలికలు, మహిళలకు రక్తహీనత పరీక్షలు, ఏజెన్సీ ప్రాంతంలో సికెల్‌సెల్ ఎనీమియా పరీక్షలు చేసి నిర్ధారణ అయితే ఆరోగ్య కార్డులు అందజేస్తారు. గత ఏడాది సర్వేలో రొమ్ము క్యాన్సర్‌తో 196 మంది, నోటి క్యాన్సర్‌తో 182, గర్భాశయ క్యాన్సర్‌తో 259, అధిక రక్తపోటుతో 30,600, మధుమే హంతో 18,400 మంది మహిళలు బాధపడుతున్నట్లు గుర్తించారు. 'వ్యాధులపై నిర్లక్ష్యం చూపకుండా ముందుగానే గుర్తిస్తే చికిత్స ద్వారా నయం చేయవచ్చు. గ్రామాల్లో మహిళలు ఆరోగ్యం విషయలో నిర్లక్ష్యం చూపుతున్నారు. శిబిరాలు నిర్వహించి వైద్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తయ్యా'యని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి హైమావతి చెప్పారు.

# ఫ్లాట్ కావాలా.. నాయనా!

చిత్తూరు : నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాల్లో ఆంధ్రప్రదేశ్ పట్టణ మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీ టిడ్కో) ఆధ్వర్యంలో నిర్మించిన గృహాల్లో ఖాళీగా ఉన్న ఫ్లాట్లను కొత్తవారికి ఇవ్వాలని ప్రభుత్వం తలచింది. ఎవరైనా ఏక మొత్తంలో చెల్లిస్తే వెంటనే వారికి ఇళ్లు అప్పగించనున్నారు. ఆ మేరకు ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. చిత్తూరు నగరపాలక సంస్థ, పుత్తూరు, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, గూడూరు పురపాలక సంఘాల్లో గత తెదేపా ప్రభుత్వ హయంలో ఏపీ టిడ్కో ఆధ్వర్యంలో షేర్‌వాల్ టెక్నాలజీతో గృహ సముదాయాలను నిర్మించారు. వీటిల్లో చాలావరకు మిగులు ఫ్లాట్లు ఉన్నాయి. వాటిని కొత్తవారికి ఇవ్వాలని ప్రభుత్వం తలచింది. ఇందులో భాగంగా 365 చదరపు అడుగుల ఇంటిని రూ.3.65 లక్షలకు, 430 చదరపు అడుగుల ఇంటిని రూ.4.15 లక్షలకు ఇచ్చేలా ధరలు నిర్ణయించారు.

**వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యం**

గత వైకాపా ప్రభుత్వ హయాంలో పురపాలక సంఘాల్లో ఏడీ టిడ్కో గృహ సముదాయాల పనుల్లో తీవ్ర జాప్యం ఏర్పడింది. కానీ గృహ సముదాయాలకు పార్టీ రంగులు మాత్రం వేశారు. కొన్నిచోట్ల గృహాలు పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వలేదు. అయినా ఈఎంఐ చెల్లించాలని బ్యాంకర్లు కూడా లబ్ధిదారులపై ఒత్తిడి చేసిన సంఘటనలు ఉన్నాయి. దీనిపై అప్పట్లో లబ్ధిదారులు గృహాలు అప్పగించకుండా ఈఎంఐ ఎలా చెల్లిస్తామని అధికారులను నిలదీశారు. చాలామంది లబ్ధిదారులు గృహాలపై స్పష్టత లేకపోవడంతో ఆశలు వదులుకున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

**ఖాళీ ఫ్లాట్లు ఇస్తాం: దేవికా, టిడ్కో ఈఈ**

ఏపీ టిడ్కో ఇళ్ల సముదాయాల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లను కొత్తవారికి ఇవ్వనున్నాం. ఇందుకు లబ్ధిదారులు నగదు మొత్తం చెల్లించాల్సి ఉంది. గృహ నిర్మాణ పనులు పూర్తి కావొచ్చాయి.

# పుర ఆదాయానికి నిర్లక్ష్యపు గండి



హిందూపురం : మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సుల్లోని గదుల నుంచి వచ్చే అద్దె పురపాలికలకు ఓ ప్రధాన ఆదాయ వనరు. హిందూపురం పట్టణంలో ఏటా గదుల అద్దె రూపంలో ఏకంగా రూ.1.50 కోట్ల ఆదాయం మున్సిపాలిటీకి వస్తోంది. గదులను నియమ నిబంధనల ప్రకారం వేలం పాటలు నిర్వహించి అద్దె ప్రతిపాదికన లీజుదారులకు కేటాయిస్తారు. ఇలా ఒక్కసారి వేలం పాటల్లో గదులను పొందితే 25 ఏళ్ల పాటు వాటిలో లీజుదారు వ్యాపారం చేసుకోవచ్చు. మూడేళ్లకు ఒకసారి అద్దెను 33 శాతం పెంచుతారు. గడువు ముగిసిన తరువాత పాత లీజును రద్దు చేసి మళ్లీ బహిరంగ వేలం వేయాలి. ఆరు నెలలు ముందుగానే ఈ విషయాన్ని లీజుదారుకు గుర్తు చేస్తూ మున్సిపల్ రెవెన్యూ విభాగం నోటీసులు ఇవ్వాలి. అద్దె బకాయిలు ఉంటే వసూలు చేసుకోవాలి. అయితే హిందూపురం మున్సిపాలిటీలో నియమ నిబంధనలను తుంగలోకి తొక్కారు. గడువు ముగిసినా పాత లీజుదారులే కొనసాగుతున్నారు. లక్షలాది రూపాయలు మొండి బకాయిలుగా మారాయి. దీంతో మున్సిపాలిటీ రెండు విధాలుగా ఆదాయాన్ని కోల్పోతోంది.

**ఏళ్ల తరబడి పాతవారే...**

ప్రభుత్వాసుపత్రి ముందు భాగంలో ఉన్న మున్సిపల్ లైబ్రరీ కాంప్లెక్సులో ఓ గదికి లీజు కాలపరిమితి ఐదేళ్ల క్రితమే ముగిసింది. ఈ కాంప్లెక్సుల్లోని కొన్ని గదులకు సంబంధించి లక్షలాది రూపాయలు అద్దె బకాయిలు ఉన్నాయి.

పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ఇందిరా షాపింగ్ కాంప్లెక్సులో 7 గదులకు సంబంధించి 25 ఏళ్ల లీజు కాలపరిమితి పూర్తి అయింది. వీటిలో సైతం ఓ గదికి రెండేళ్లు, మిగిలిన వాటికి లీజు గడువు ముగిసి ఏడాది దాటింది. అయినా నోటీసులు కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

పాత బస్టాండ్ షాపింగ్ కాంప్లెక్సులోనూ పలు గదులకు లీజు కాలపరిమితి ముగిసింది. కొన్నింటికి గడువు ముగిసి ఏడాది, మరి కొన్నింటికి రెండేళ్లు, ఓ గదికి ఐదేళ్లు దాటింది.

**వేలం పాటలు నిర్వహిస్తాం**

–మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్, హిందూపురం

మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులపై దృష్టి సారించా. వాటి నుంచి ఆదాయం పెరిగేలా చర్యలు చేపట్టా. 25 ఏళ్ల కాలపరిమితి ముగిసిన గదులు ఉన్నట్లు గుర్తించాం. వాటికి వెంటనే వేలం పాటలను నిర్వహించేందుకు కౌన్సిల్ అనుమతి తీసుకొన్నాం. త్వరలో వేలం పాటలు నిర్వహిస్తాం.

# నాణ్యత కొరవడి.. నెర్రెలు వారి!



ఉరవకొండ : ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జాతీయ రహదారి 67 నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు లేక ఎక్కడపడితే అక్కడే నెర్రెలు వారుతున్నాయి. మరోవైపు నిర్మాణం అసంపూర్తిగా మారడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. కృష్ణపట్నం–అంకోల జాతీయ రహదారిని 2015 నుంచి 2019లోపు పూర్తిచేయాల్సి ఉన్నా.. పలు కారణాలతో గడువు పొడిగించారు. అయినా అసంపూర్తిగా ఉండటం గమనార్హం. గుత్తి నుంచి రాష్ట్ర సరిహద్దు వరకు సుమారు 55 కిలోమీటర్లు రూ.630 కోట్లతో చేపట్టారు. ఇప్పటికే సుమారు 45 కిలోమీటర్లు మేర పనులు పూర్తయినా... నిర్వహణలో అధికార యంత్రాంగం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. పనుల్లో నాణ్యతాలోపం కారణంగా విడపనకల్లు మండలం పెంచలపాడు, కడదరబెంచి, డొనేకల్లు గ్రామాల మీదుగా వెళ్లే రహదారికి నెర్రెలు వచ్చాయి. సకాలంలో మరమ్మతులు చేయించకపోగా... భారీ వాహనాల రాకపోకలతో పెద్దవిగా మారుతున్నాయి. మరోవైపు డివైడర్లపై, అంచుల్లో కంప పెరగడంతో దారిరూపు కోల్పోతోంది.

**ఏళ్లుగా ఒక వరుసలోనే ప్రయాణం**

పెంచలపాడు, గడేకల్లు, కడదరబెంచి, డొనేకల్లు గ్రామాల వద్ద పనులు పూర్తికాలేదు. దీంతో ఏళ్లుగా వాహనాలు వన్‌వేలో రాకపోకలు సాగించాల్సి వస్తోంది. కొత్తగా వచ్చే ప్రయాణికులకు ఈ విషయం తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. ఇటీవల పోలీసులే కొన్నిచోట్ల ప్రమాద హెచ్చరికలు ఏర్పాటు చేయడం గమనార్హం.

**తగిన చర్యలు తీసుకుంటాం**

– కోటేశ్వరరెడ్డి, ఎన్‌హెచ్ ఏఈఈ

జాతీయ రహదారిపై ఏర్పడిన పగుళ్లకు మరమ్మతులు చేయిస్తాం. గతంలో పనులు చేసిన గుత్తేదారును ఉన్నతాధికారులు తప్పించారు. కొత్తగా టెండర్లను ఆహ్వానించి గుత్తేదారు కుదిరాక మిగిలిన పనులతో పాటు మరమ్మతులు పూర్తిచేయిస్తాం. అప్పటి వరకు తాత్కాలికంగా అవసరమైన చోట్ల పనులు చేయిస్తాం.

# కారు పరుగు.. ఎప్పుడో దేవుడెరుగు!



పుట్టపర్తి: తనకల్లు మండలం కోటపల్లి పంచాయతీ మరాలపల్లి సమీపంలో ఏర్పాటు చేస్తున్న నిధి మార్క్యు వన్ కార్ రేస్ ట్రాక్ ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. స్థానికులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలతోపాటు పలు ప్రయోజనాల కోసం 2018లో తెదేపా సర్కారు అంతర్జాతీయ స్థాయి ప్రాజెక్టు ఏర్పాటు శ్రీకారం చేయించింది. పనులు ప్రారంభించి ఆరేళ్లు కావస్తున్నా ఇప్పటికీ కొలిక్కిరాలేదు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జిందాల్ సంస్థ ఆర్థిక సహకారంతో ప్రాజెక్టును చేపట్టారు. ఇందుకోసం నిధి మార్క్యు వన్ కార్ రేస్ సంస్థకు 216 ఎకరాల ప్రభుత్వ భూమిని అప్పగించింది. రూ.320 కోట్లతో మూడు విడతల్లో 3.25 కిలోమీటర్ల ట్రాక్ ఏర్పాటు చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఈ మేరకు ప్రభుత్వం భూమి అప్పగించింది. రేస్ ట్రాక్, హోటళ్లు, గోల్ఫ్ కోర్టులు, 34 ఎకరాల్లో పార్క్, రిసార్టులు, యుటిలిటీ డెవలప్‌మెంట్, విల్లాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. మొదటి విడతలో రూ.40 కోట్లతో 150 ఎకరాల్లో మోటార్ స్పోర్ట్స్ రేస్‌ట్రాక్, ఆటోమోటివ్ టెస్టింగ్, క్లబ్, వసతి గదుల నిర్మాణం, వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ పనులకుగాను 2020 వరకు గడువు నిర్దేశించినా పూర్తి చేయలేదు. రెండో విడతలో రూ.9 కోట్లతో 25 ఎకరాల్లో గోల్ఫ్ కోర్టులు, క్రీడాసముదాయం, ప్రదర్శన కేంద్రాలను భూములు అప్పగించిన 54 నెలల్లో పూర్తి చేయాలి. మూడో విడతలో రూ.100 కోట్లతో 25 ఎకరాల్లో ఆటోమోటివ్ థీమ్డ్ అమ్యూజ్‌మెంట్ పార్కును భూములు అప్పగించిన 90 నెలల్లో ఏర్పాటు చేయాలన్నది ఒప్పందం. 2019 తర్వాత వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడం, తగిన సహకారం లేకపోవడంతో పనులు ఊపందుకోలేదని తెలుస్తోంది. ప్రస్తుతం రేస్ ట్రాక్ పనులు 50 శాతం వరకు పూర్తయ్యాయి.

**పూర్తి చేయాలని ఆదేశాలిచ్చాం**

– నర్సయ్య, పర్యాటకశాఖ జిల్లా ఇన్‌ఛార్జి అధికారి

పనులు సకాలంలో పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించాం. సహకరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రాజెక్టు పూర్తయితే ప్రత్యక్షంగా, పరోక్షంగా వందలాది మందికి ఉపాధి లభించడంతోపాటు ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది.

# పరికరం శిథిలం.. తల్లడిల్లుతోంది ప్రాణం

చెన్నేకొత్తపల్లి రాప్తాడు నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక్క 30 పడకల వైద్యశాల చెన్నేకొత్తపల్లి సీహెచ్‌సీ. గత తెదేపా ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న పరిటాల సునీత రూ.మూడు కోట్లతో 30 పడకలతో అధునిక భవన సముదాయాన్ని నిర్మించారు. తర్వాత వైకాపా అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి తన సొంత నిధులు, దాతల సహకారంతో ఆక్సిజన్ ఫ్లాంట్ ఏర్పాటు చేస్తానని తెలిపారు. 2021లో ప్రాణవాయువు అందించేందుకు రూ.40 లక్షల విలువ చేసే పరికరాలను దాతల ద్వారా ఆస్పత్రికి చేర్చారు. అప్పటి నుంచి పట్టించుకోకపోవడంతో ఇన్‌స్టలేషన్ పనులు ఆగాయి. కొవిడ్ రెండో దశ వచ్చేలోపు ఆక్సిజన్ ప్లాంట్ సిద్ధం చేస్తామని మరో సమావేశంలో ఆయన వెల్లడించారు. తర్వాత గాలికొదిలేశారు. రూ. 5 లక్షలకు మించి ఆస్పత్రి నిధులు వెచ్చించలేమని ఆసుపత్రి వైద్యురాలు జయలక్ష్మి చెబుతున్నారు. పరికరాలు తుప్పు పడుతున్నాయి. దీనిపైలో రెండుసార్లు కథనాలు రావడంతో స్పందించిన ఉన్నతాధికారులు షెడ్డు నిర్మించి ఇన్‌స్టలేషన్ పరికరాలు, మానిటరింగ్ సిస్టమ్ ఏర్పాటు చేసి.. 30 పడకలకు ఆక్సిజన్ వెళ్లేలా పైప్‌లైన్ చేశారు. మిగతా ఇన్‌స్టలేషన్ పూర్తి చేస్తే రోగులకు ఎంతో మేలు జరుగుతుంది. ఆత్మకూరు మండల కేంద్రంలోని గ్రామీణ ఆరోగ్య ఉపకేంద్రంలో 2022లో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.

# అవినీతి దాహం.. అక్రమాలకు దాసోహం

చంద్రగిరి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన జి.మహేశ్వరయ్య అనే వ్యక్తి తన ఉద్యోగ జీవితంలో రూ.30 కోట్లకుపైగా ఆస్తులు కూడబెట్టారని అనిశా అధికారులు గుర్తించారు. ఓ గుత్తేదారు నుంచి రూ.50 వేలు తీసుకుంటుండగా దాడి చేసి పట్టుకోగా అతని సంపద గురించి తెలుసుకుని అధికారులే విస్తుపోయారు. యాదమరి మండలం 14.కండ్రిగ ముస్లింవాడ పంచాయతీ కార్యదర్శి ప్రకాష్.. పనులు జరగకుండానే రూ.4.47 లక్షలు డ్రా చేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారు. జిల్లా పంచాయతీ అధికారి చేసిన తనిఖీలో వాస్తవమని తేలడంతో ఆయన్ను కలెక్టర్ సుమిత్‌కుమార్ సస్పెండ్ చేశారు.

ఈనాడు– చిత్తూరు, తిరుపతి: చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొందరు పంచాయతీ కార్యదర్శుల అవినీతి దాహానికి అంతే లేకుండా పోతోంది. లే అవుట్లు, భవన నిర్మాణాలకు అనుమతులు మొదలుకొని అభివృద్ధి కార్యక్రమాలకు బిల్లుల విడుదలకు లంచాలు తీసుకుంటున్నారు. పలువురు పనులు చేయకుండానే చేసినట్లు చూపి నగదు బొక్కేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు చూసీచూడనట్టుగా వ్యవహరిస్తుండటంతో మరింతగా రెచ్చిపోతున్నారు. కొన్నిచోట్ల ఇటువంటి ఉదంతాలు వెలుగు చూసినా ఎంపీడీవోలు సర్దుబాటు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. కేంద్రం విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులను ఎప్పటికప్పుడు ఖాతాల్లో జమ చేస్తున్నారు. ఇదే పంచాయతీ కార్యదర్శులకు వరంలా మారింది. కొత్త భవనాలకు



ఆస్తి పన్ను మదింపు, లే అవుట్లు, పన్నుల వసూళ్లు.. ఇలా ప్రతి పనికీ ఓ ధర నిర్ణయించారు. ప్రధానంగా వి.కోట, తిరుచానూరు, బంగారుపాళ్యం, రేణిగుంట, చంద్రగిరి.. ఇలాంటి మేజర్ పంచాయతీల్లో లంచాల బెడద ఎక్కువగా ఉంది.

**ఆడిట్‌లోనూ తప్పించుకుంటూ..**

పంచాయతీల్లో జరిగిన అవకతవకలు కచ్చితంగా ఆడిట్‌లో తేలుతాయి. రికార్డులు క్షుణ్నంగా తనిఖీ చేసి ప్రతి రూపాయి గురించి ఆరా తీస్తే కార్యదర్శుల అవినీతి చిట్టా బయటపడుతుంది. ఇందుకు భిన్నంగా ఆడిట్ బృందం వ్యవహరిస్తోందనే ఆరోపణలున్నాయి.రు అధికారులు ఇచ్చిన డబ్బులు పుచ్చుకుని తూతూమంత్రంగా పరిశీలిస్తున్నారు. ఫలితంగానే నిధుల దుర్వినియోగం గురించి వెల్లడి కావడంలేదు. కొన్ని సందర్భాల్లో స్థానిక సర్పంచ్‌లే ఈ వ్యవహారాన్ని వెలికి తీస్తున్నారు.

**వెంటనే చర్యలు తీసుకుంటేనే..**

వి.కోట మేజర్ పంచాయతీలో కొంతకాలం క్రితం రూ.20 లక్షలు అవినీతి జరిగిందని తేలింది. ఇలాంటి ఉదంతాలు వెలుగు చూసిన వెంటనే చర్యలు తీసుకుంటేనే మిగతావారూ గాడిలో పడతారు. చాలామంది ఎంపీడీవోలు మూసిపెట్టడానికి ప్రయత్నిస్తున్నారే తప్ప ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలేదు. దీనికితోడు రాజకీయ పలుకుబడి ఉపయోగించి అక్కడే తిష్ఠ వేస్తున్నారు.

# అవుకు భూములు ఆరగించారు

నంద్యాల : అవుకు జలాశయం మిగులు భూములు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. జలాశయం నిర్మాణ పనులు 1990లో ప్రారంభించారు. రెండు దశల్లో పనులు చేపట్టి 2005లో పూర్తి చేశారు. 4.148 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా అవుకు, చెర్లోపల్లి గ్రామాల పరిధిలో జలాశయాన్ని నిర్మించారు. ఇందుకు 2,100 ఎకరాలు సేకరించారు. ఇందులో మూడు వందల వరకు ఖాళీగా ఉండగా బనగానపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, వారి అనుచరులు పాగా వేశారు. ఆయా భూముల్లో యథేచ్ఛగా సాగు చేసుకుంటున్నారు. ఆక్రమణకు గురైన భూమి విలువ రూ.50 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**రక్షణ లేక భక్షణ** చెర్లోపల్లి పూర్తిగా మునగడంతో పునరావాసం కోసం రామాపురం గ్రామ పరిధిలో భూములు కొనుగోలు చేశారు. జలాశ యం నిర్మాణానికి కొంత అటవీశాఖ భూమి తీసుకొన్నారు. అందుకు ప్రత్యామ్నాయంగా ఆ శాఖకు ఇచ్చేందుకు రామవరం, సంగపట్నం, అవుకు గ్రామాల్లో మరికొంత భూమి సేకరించారు. జలాశయం కట్ట నిర్మాణానికి అవసరమైన మట్టి కోసం సింగనపల్లి, మెట్టుపల్లి, సంగపట్నం, చెన్నంపల్లి, నిచ్చెనమెట్ల, అన్నవరం పరిసరాల్లోనూ కొంత భూమిని కొనుగోలు చేశారు. ఆయా భూములను జలాశయం అవసరాలకు వినియోగించుకోగా మూడు వందల ఎకరాల వరకు మిగిలింది. దాన్ని అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో అక్రమార్కుల పని సులువైంది.

**'కూటమి' ప్రభుత్వం ఆరా**

అవుకు జలాశయం భూముల కబ్జా కథ తేల్చాలని 'కూటమి' ప్రభుత్వం నిర్ణయించింది. విచారణ నివేదిక పంపాలని ఆదేశించడంతో ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో ఆక్రమణదారుల్లో కలవరం మొదలైంది. జలాశయ మిగులు భూములను జలవనరుల శాఖ పరిధి నుంచి తప్పించి రెవెన్యూ శాఖకు బదలాయించాలని భావిస్తోంది. జలాశయ భూముల ఆక్రమణలపై ప్రభుత్వం నివేదిక అడిగిన విషయం వాస్తవమేనని జలవనరుల శాఖ అధికారులు ధ్రువీకరించారు.

**నివేదికలు బుట్టదాఖలు**

జలాశయం నిర్మాణం నేపథ్యంలో ఆయా ప్రాంతాలకు సాగునీరు సమృద్ధిగా అందుబాటులోకి వచ్చింది. భూగర్భ జలాలు గణనీయంగా వృద్ధి చెందడంతో ఆ ప్రాంతమంతా సస్యశ్యామలంగా మారింది. దీంతోపాటు కొన్ని భూములు ప్రధాన రహదారికి సమీపంలో ఉండడంతో ధరలు భారీగా పెరిగాయి. దీంతో ప్రభుత్వానికి భూములిచ్చిన వారితోపాటు ఇతరులు ఆక్రమించుకున్నారు. జలాశయం భూములు పెద్దఎత్తున ఆక్రమణలకు గురయ్యాయన్న అంశంపై గత వైకాపా ప్రభుత్వంలో అధికారులు విచారణ చేశారు. వాస్తవమేనని అధికారులు నిగ్గు తేల్చి నివేదికలు ఇచ్చారు. ఆక్రమించుకున్నవారి నుంచి తీవ్రమైన ఒత్తిళ్లు రావడంతో గత ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

చురకలు



# చేసిందే పని.. చూపిందే లెక్క..!

శ్రీకాకుళం : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిబంధనలకు పాతరేస్తున్నారు. ఉన్నతాధికారుల అనుమతి లేకుండా.. టెండర్లు పిలవకుండా ఇష్టానుసారం నిర్మాణాలు చేపడుతున్నారు. లెక్కాపత్రం లేకుండా దాతల విరాళాలు, భక్తులిచ్చిన కానుకల సొమ్ము దుర్వినియోగమవుతోంది. అధికారులు ఎంత మంది మారినా ఆలయంలో అక్రమాలకు అడ్డుకట్ట పడట్లేదు. ప్రస్తుత ఈవో సైతం పాత పాలకుల్లాగే వ్యవహరిస్తుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆదిత్యాలయంలో నిత్యాన్నదానం నిర్వహణకు రూ. 6 లక్షలతో పనులు చేయిస్తున్నారు. వీటితో పాటు పలు మార్పులు, చేర్పులు, మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టారు. దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం ఆలయాల్లో ఏ పని చేయాలన్నా అధికారుల అనుమతి తీసుకోవాలి. టెండర్లు పిలవాలి. ఇంజినీర్ల పర్యవేక్షణలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టాలి. ఆయా వివరాలు ఎం.బుక్‌లో నమోదు చేసి ఆ మేరకు బిల్లులు చెల్లించాలి. ఒకవేళ దాతలే స్వయంగా పనులు చేయిస్తే శాఖాపరమైన అనుమతులు వచ్చిన తర్వాత అఫిడవిట్ సమర్పించాలి. పనుల్లో ఏ లోపం తలెత్తినా అందుకు తానే బాధ్యత వహిస్తానని స్టాంపు కాగితంపై దాత సంతకం చేయాలి. ఆ అఫిడవిట్‌ను



అధికారులు పరిశీలించాక నిర్మాణం చేపట్టాలి. ఇవేమీ లేకుండానే పనులు చకచకా సాగిపోతున్నాయి.

**విచారణ చేపడితే మరిన్ని వెలుగులోకి..**

గతంలో ఇలాగే ముందు చూపు, మాస్టర్ ప్లాన్ లేకుండా నచ్చినట్లు నిధులు ఖర్చు చేసి అనేక నిర్మాణాలు చేపట్టారు. వాటిని ఈ ఏడాది రథసప్తమి వేడుకల సమయంలో భక్తుల సౌకర్యార్థం అధికారులు తొలగించడంతో రూ.కోట్లు బూడిదపాలయ్యాయి. మళ్లీ అదే పని జరుగుతోందని భక్తులు మండిపడుతున్నారు. ఆలయంలో జరుగుతున్న పనులు, చేస్తున్న ఖర్చులు, ఇతర పాలనా వ్యవహారాలపై అధికారులు విచారణ చేపడితే వాస్తవాలు వెలుగు చూసే అవకాశముందని కోరుతున్నారు.

**ఏం జరుగుతోందంటే..?**

దాతలిచ్చే డబ్బులకు రసీదులు ఇవ్వకపోవడం, ఆ మొత్తాన్ని ఆలయ దస్త్రాల్లోనూ నమోదు చేయకపోవడంతో ఖర్చులకు లెక్కాపత్రం లేకుండా పోతోంది. ఈ అవకాశాన్ని ఆసరాగా చేసుకుని విరాళమిచ్చిన దాతే పని చేయిస్తున్నారని చెబుతూ.. ఆలయానికి చెందిన వ్యక్తులే అంతా నడిపిస్తున్నారు.విరాళం డబ్బుతో పాటు ఆలయ నిధులు సైతం కలిపి ఓచర్ విధానంలో నగదు ఖర్చు చేస్తున్నారు. పనులకు నాసిరకం సామగ్రి తీసుకొచ్చి.. బిల్లుల్లో అవకతవకలకు పాల్పడి జేబులు నింపుకొంటున్నారు. చివరగా ఓ శిలాఫలకంపై దాతల పేర్లు రాయించి నోరెత్తకుండా వారిని సంతృప్తి పరుస్తున్నారు.

**స్థానిక వ్యక్తులతో చేయిస్తున్నాం..**

అభివృద్ధి పనులకు అనుమతులు కోరుతుంటే చాలా సమయం పడుతోంది. అందుకే మా శాఖ ఇంజినీర్లకు చెప్పట్లేదు. దాతల విజ్ఞప్తి మేరకు ఎలాంటి టెండర్లు లేకుండా స్థానిక వ్యక్తులతో పనులు చేయిస్తున్నాం. ఈవోగా రూ.లక్ష వరకు ఓచర్ల రూపంలో ఖర్చు చేసే అధికారం నాకు ఉంది. అందుకు అనుగుణంగా బిల్లులు తెప్పించుకుని చెల్లింపులు చేస్తున్నాం. కేఎన్‌వీడీవీ ప్రసాద్, ఈవో, ఆదిత్యాలయం

# అలా పేరొచ్చింది!!

అక్కిరెడ్డిపాలెం : సాధారణంగా కాలనీలకు స్వాతంత్ర్య సమరయోధులు, రాజకీయ నాయకులు, దేవతల పేర్లు పెట్టడం మనం చూస్తుంటాం. కానీ, ఇందుకు భిన్నంగా విశాఖలో భారత్ హెవీ ప్లేట్ అండ్ వెసెల్స్ లిమిటెడ్ (బి.హెచ్.పి.వి) కార్మికులు తాము నిర్మించుకున్న కాలనీలకు తమ సంస్థ ఎండీగా పని చేసిన వ్యక్తుల భార్యల పేర్లు పెట్టుకున్నారు. బి.హెచ్.పి.వి. ఉద్యోగులు 1971లో తొలిసారి తుంగ్లాం రెవెన్యూ పరిధిలో సుమారు 31 ఎకరాలు కొనుగోలు చేసి ఫేజ్-1 కింద ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి 1981లో సుమారు 328 ఇళ్లను పూర్తిచేశారు. ఆ ఇళ్ల ప్రారంభ సమయంలో అప్పటి బీహెచ్‌పీవీ ఎండీగా మన్నుఖని ఉన్నారు. ఆయన అందించిన సహకారానికి గుర్తుగా ఆయన సతీమణి షీలా పేరుతో షీలానగర్‌గా నామకరణం చేశారు. ఫేజ్-2లో భాగంగా 1984లో విశాఖ చినముషిడివాడ పంచాయతీలో సుమారు 58 ఎకరాలు కొనుగోలు చేశారు. 1994లో 500 ఇళ్లు పూర్తిచేశారు. ఈ ఇళ్ల ప్రారంభ సమయంలో అప్పటి బి.హెచ్.పి.వి. ఎండీగా కంచర్ల రాఘవయ్య సేవలందించారు. అంతకుముందు సంప్రదాయాన్నే ఇక్కడ కూడా కొనసాగించి రాఘవయ్య సతీమణి సుజాత పేరుతో సుజాతనగర్ ఏర్పాటు చేశారు.

ప్రస్తుతం సుజాతనగర్ నగరంలో ప్రముఖ వాణిజ్య కేంద్రంగా ఎదుగుతోంది. ప్రస్తుతం ఫేజ్-3 కింద సాలాపువానిపాలెం వద్ద మరో 36 ఎకరాల్లో ఇళ్ల నిర్మాణానికి ఇటీవల భూమి పూజ జరిగింది. ఈ కాలనీకి ఏ పేరుపెడతారనేది ఆసక్తిగా మారింది.

# శ్మశాన వాటికనూ వదల్లేదు..



హిరమండలం : ఖాళీ జాగా కనిపిస్తే చాలు అక్రమార్కులు చెలరేగిపోతున్నా రనేందుకు ఈ చిత్రమే నిదర్శనం. హిరమండలం పరిధి కిట్టాలపాడు గ్రామంలో శ్మశాన వాటిక నిర్వహణకు దశాబ్దాల కిందట స్థానికులు రెండున్నర ఎకరాలు కేటాయించారు. రెవెన్యూ దస్త్రాల్లోనూ ఇది నమోదైంది. శ్మశాన వాటికకు చుట్టుపక్కల ఉన్న భూమిని గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. ప్రస్తుతం కనీసం 30 సెంట్లు స్థలం కూడా లేదు. ఇటీవల శ్మశానానికి వెళ్లేందుకు రహదారి నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో పనులు చేపట్టేందుకు అధికారులు హద్దులు నిర్ణయించారు. కానీ ఇవేమీ పట్టించుకోకుండా అక్రమార్కులు సాగు చేసుకుంటున్నారు. దీనిపై ఉప తహసీల్దారు ప్రసాదరావు మాట్లాడుతూ పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

# వరికి జలసిరి



అనకాపల్లి : ఖరీఫ్ చివరిలో కాలం కలిసొచ్చింది. కొద్దిరోజుల క్రితం వరకు చినుకు జాడలేక చిన్నబోయిన రైతులకు మూడు రోజుల క్రితం కురిసిన వర్షాలు ఊపిరినిచ్చాయి. ఎగువ ప్రాంతాల్లోనూ సమృద్ధిగా కురిసిన వర్షాలతో అన్ని ప్రధాన జలాశయాలు నిండుకుండలా మారాయి. దీంతో జిల్లావ్యాప్తంగా అన్నిచోట్లా అన్నదాతలు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. వరి నారుమళ్లు పోసుకుని పొలాలను దున్ని నాట్లు వేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లావ్యాప్తంగా సుమారు 55 వేల హెక్టార్లలో వరి సాగవుతుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. జూన్, జులై నెలల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సీజన్ నత్తనడకన సాగింది. వర్షాధార భూముల్లో నారు ఎండిపోయింది. దాంతో ఇంతవరకు కేవలం 9,642 హెక్టార్లలోనే నాట్లు పూర్తయ్యాయి. ఇంకా 45 వేల హెక్టార్లలో నాట్లు వేయాల్సి ఉంది. ప్రస్తుతం రోజుకు 3 వేల హెక్టార్లలో నాట్లు వేస్తున్నారు. చీడికాడ, అనకాపల్లి, ఎస్.రాయవరం, వి.మాడుగుల, బుచ్చెయ్యపేట, చోడవరం, కె.కోటపాడు, నాతవరం, రావికమతంలో పనులు జోరుగా సాగుతున్నాయి. ఈనెలాఖరుకు మరో 30 వేల హెక్టార్లలో నాట్లు పడవచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

**తేరుకుంటున్న పంటలు:** వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం వర్షాల కారణంగా జిల్లాలో 1,250 ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. అనకాపల్లి ఆవఖండం, వాడ్రాపల్లిలో వరి, చెరకు తోటలు నీట మునిగాయి. ప్రస్తుతం కాలువల్లో నీరు తగ్గుముఖం పట్టడంతో ముంపు నుంచి కొద్దికొద్దిగా తేరుకుంటున్నాయని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు.

**2,734 మిల్లీమీటర్ల వర్షపాతం:** జిల్లాలో గత మూడు రోజుల్లో 2,734 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు తెలిపారు. అత్యధికంగా కె.కోటపాడు మండలంలో 180 మి.మీ. వర్షం కురిసింది. 16 మండలాల్లో 100 మి.మీ. కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. మూడు రోజుల్లో జిల్లాలో సరాసరి 113.9 మి.మీ.గా ఉంది. **పూర్తిస్థాయిలో నాట్లు- బి.మోహనరావు, వ్యవసాయశాఖ జిల్లా అధికారి** వచ్చేనెల 15 వరకు నాట్లు వేసుకోవచ్చు. ఈలోగా మరోసారి భారీ వర్షాలు పడితే సాధారణ విస్తీర్ణం వరకు నాట్లు పడే అవకాశాలు ఉన్నాయి. ముంపునకు గురైతే నీరు తీశాక పొటాష్ ఎరువులు వేసుకుంటే పంట త్వరగా కోలుకుంటుంది. నారు ముదిరితే, ఎద పద్ధతిలో వేసుకుంటే మేలు. యూరియా నిల్వలు రెండువేల టన్నుల వరకు ఉన్నాయి. బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం.

# రేషన్ లెక్క.. ఇక పక్కా!



నర్సీపట్నం : అనకాపల్లి ప్రాంతంలో పౌరసరఫరాల అధికారి ఇటీవల ఓ చౌక దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ-పోస్‌లోని సరకుల నిల్వ వివరాలను పరిశీలించారు. సెల్‌ఫోన్‌లోని యాప్‌లో ఉన్న వివరాలతో పోలిస్తే తేడా వచ్చింది. వెంటనే డీలరుపై 6ఎ కేసు నమోదు చేశారు. ఈ-పోస్‌ను స్వాధీనం చేసుకొని సమీపంలోని మరో డీలర్‌కు చౌక దుకాణం బాధ్యతలను అప్పగించారు. కూటమి ప్రభుత్వం పౌరసరఫరాల వ్యవస్థ ప్రక్షాళన దిశగా తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలిస్తోంది. రేషన్ డీలర్ల అవకతవకలకు చెక్ పెట్టేందుకు 'సివిల్ సప్లై ఇన్‌స్పెక్షన్' పేరుతో ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. సరకుల పంపిణీలోని అక్రమాలను నిరోధించేందుకు ఈ యాప్ ఉపకరిస్తోంది. పౌర సరఫరాల్లోని అన్ని స్థాయిల అధికారుల నుంచి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వరకు ఈ యాప్ సాయంతో రేషన్ దుకాణాల్లోని సరకుల నిల్వలను ఏ సమయంలోనైనా పరిశీలించవచ్చు.

**తప్పులు దాచిపెట్టడం కుదరదు:** సరకుల పంపిణీలో అవకతవకలను కప్పిపుచ్చడం ఇకపై సాధ్యం కాదు. గతంలో మాదిరి మొక్కుబడి తనిఖీలకూ వీల్లేదు. జిల్లాలో సుమారు 5 లక్షల మంది కార్డుదారులు ఉన్నారు. వీరికి వెయ్యి మంది డీలర్ల ద్వారా లక్షల క్వింటాళ్ల బియ్యం ప్రతి నెలా పంపిణీ అవుతోంది. గతంలోని మాన్యువల్ విధానంలో తప్పుల సర్దుబాటుకు ఆస్కారం ఉండేది. ప్రస్తుతం అధికారులు డిపో తనిఖీకి వెళ్లిన వెంటనే ఈ-పోస్‌ను తీసుకుంటున్నారు. అందులోని వివరాలు, యాప్‌లో ఉన్న ఆన్‌లైన్ వివరాలతో సరిపోలుస్తున్నారు. తేడాలుంటే అక్కడికక్కడే చర్యలకు ఉపక్రమిస్తున్నారు. తనిఖీల సమయంలోనే కార్డుదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను యాప్‌లో నమోదు చేస్తున్నట్లు నర్సీపట్నం పౌరసరఫరాల ఉప తహసీల్దారు చందన రేఖ పేర్కొన్నారు. సరకుల సరఫరా, తూకం సక్రమంగా ఉన్నదీ, లేనిదీ, డీలరు ప్రవర్తనకు సంబంధించి పలు అంశాలపై కార్డుదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నట్లు చెప్పారు.

# తవ్విందంతా తేల్చేద్దాం!




తిరుపతి : ప్రకృతి వనరులను దోపిడీ చేయడంలో వైకాపా నాయకులు పీహెచ్‌డీ చేశారు.. జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్‌జీటీ) ఆదేశాలను రీచ్‌లలోనే పాతేసి అక్రమంగా ఇసుక తవ్వకాలకు పాల్పడ్డారు. నిబంధనలు అతిక్రమించి రేవుల్లోకి రోడ్డు వేసి యంత్రాలతో తవ్వి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఈ ఉల్లంఘనలపై ఏడాదిన్నర క్రితమే అధికారులు పరిశీలించినా పూర్తి వాస్తవాలు నివేదించలేదు. దీంతో మరోసారి ఏపీ స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఏపీ శాక్) నుంచి తీసుకున్న చిత్రాలను ప్రభుత్వం గనుల శాఖకు పంపింది. వీటి ఆధారంగా క్షేత్రస్థాయిలో మరోసారి పరిశీలించాలని ఆదేశించింది. ఇప్పటికైనా అక్రమ తవ్వకాలపై నిజాలను వెల్లడిస్తే భవిష్యత్తులో నాయకులెవరూ ఇంతలా బరితెగించరు.

జగన్ పాలనలో తొలుత ఏపీ ఖనిజాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఇసుక తవ్వకాలు, విక్రయాలు జరిగాయి. 2021 మే నుంచి ప్రైవేటు సంస్థలకు ఈ బాధ్యతలు అప్పగించారు. రీచ్‌లలో మీటరు లోతు వరకే తవ్వకాలు జరపాలని అప్పట్లో పేర్కొన్నారు. హెక్టారుకు 10 వేల క్యూబిక్ మీటర్లు మాత్రమే తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నిబంధనలన్నీ గుత్తేదారు సంస్థలు ఉల్లంఘించాయి. ఈ వ్యవహారంలో అంతిమ లబ్ధిదారులు వైకాపా నేతలే.

**కొల్లగొట్టారిలా..**

చిత్తూరు జిల్లాలో ప్రధానంగా నీవా పరీవాహకంలోని గంగాధర నెల్లూరు, చిత్తూరు నియోజకవర్గాల్లో, కుశస్థలి నది ప్రవహించే నగరి, బాహుదా, చిన్న చిన్న వంకలు ప్రవహించే పుంగనూరులో అక్రమ తవ్వకాలు జరిగాయి. కొట్రకోన, నందనూరు, ముక్కళతూరు, ముత్తుకూరు, బీఎన్‌ఆర్‌పేట, అనంతాపురం, ఆనగల్లు, తదితర రీచ్‌ల్లో గ్రావెల్‌తో రోడ్డు వేసి మరీ ఇసుకను తీశారు. ప్రతి రేవులోనూ లక్ష-1.50 లక్షల టన్నుల ప్రకృతి సంపదను కొల్లగొట్టారు.

**అరణియార్‌ను గుల్ల చేసి**

తిరుపతి జిల్లా నాగలాపురం మండలంలోని అరణియార్‌లో దోపిడీపై అప్పట్లో వరుసగా 'ఈనాడు'లో కథనాలు వచ్చినా తవ్వకాలే చేయడంలేదని, ఫొటోలన్నీ పాతవని జగన్ సర్కార్ బుకాయించింది. అప్పట్లో ఈ అక్రమాలన్నీ వైకాపాలో 'పెద్దాయన'గా ముద్రపడ్డ వ్యక్తి నేతృత్వంలోనే జరిగాయి.

**తూతూమంత్రంగా పరిశీలించి..**

వైకాపా హయాంలోనే ఈ దోపిడీపై అధికారులు విచారించినా.. గనుల శాఖ సంచాలకుడు వెంకటరెడ్డి ఒత్తిడితో వాస్తవాలు నివేదించలేదు. తూతూమంత్రంగా పరిశీలించి అనుమతించిన రీచ్‌లలోనే తవ్వకాలు జరిగాయని పేర్కొన్నారు. తాజాగా 15 రోజుల కిందట గనుల శాఖ అధికారులకు ఆయా రీచ్‌లకు సంబంధించి ఏపీ శాక్ నుంచి ఛాయాచిత్రాలు వచ్చాయి. తవ్వకాలకు ముందు ఎలా ఉంది? ఆ తర్వాత ముఖచిత్రం ఎలా ఉంది? ఎన్ని లక్షల టన్నులు తవ్వి ఉండవచ్చు? అని వివరాలు పంపారు. గనులు, భూగర్భ జలాలు, జలవనరులు, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు వీటన్నింటినీ మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిపోల్చుకుంటారు. ఇప్పుడైనా నివేదికలో నిజాలు మాత్రమే రాస్తారా? లేదా? అన్నది చూడాలి.

# నిఘా కళ్లు.. ఛేదిస్తున్నాయ్ కేసులు

కర్నూలు : నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తులో సీసీ కెమెరాలు పోలీసులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ నేపథ్యంలో వీటి ఏర్పాటుపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ప్రజల్లో కూడా వీటి ఉపయోగాలపై అవగాహన పెరిగింది. రాష్ట్రంలో 2013లో ఏపీ ప్రజా భద్రతా చట్టం అమల్లోకి వచ్చింది. వంద మంది పోగయ్యే ప్రాంతంలో సీసీ కెమెరాలు ఉండాలన్నది ఈ చట్టం ఉద్దేశం. దీని అమలులో గత తెదేపా ప్రభుత్వం ముందడుగు వేసింది. సీసీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. పోలీసు అధికారులు ఈ చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించి నిఘా కెమెరాలను ఏర్పాటు చేయించటం ప్రారంభించారు. చాలామంది వాణిజ్య కేంద్రాలు, అపార్ట్‌మెంట్లతో పాటు ఇళ్లలో కూడా ఏర్పాటు చేసుకుంటున్నారు.

**3.5 నెలల్లో 5 వేల కెమెరాలు**

కర్నూలు నగరంతో పాటు అన్ని పట్టణాల్లో స్థానిక సంస్థలు.. ప్రధాన



రహదారులు, ముఖ్య కూడళ్లలో అత్యాధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నాయి. ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ప్రత్యేక చొరవతో జూన్ 18వ తేదీ నాటికి మూడున్నర నెలల్లో 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు. జిల్లాలో కార్పొరేట్ సంస్థలు, ఎంపీ నిధులు, స్థానిక సంస్థల సహకారంతో మరో 5 వేల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించేందుకు పోలీసులు కృషి చేస్తున్నారు.

**దొరికిపోతున్న నేరగాళ్లు**

వివిధ కేసుల్లో నేరగాళ్లను గుర్తించడంలో సీసీ కెమెరాలు పోలీసు అధికారులకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. చిల్లర దొంగలు మొదలుకొని హంతకుల వరకు సీసీ కెమెరాల కంటికి చిక్కి కటకటాల పాలవుతున్నారు. ఇటీవల కాలంలో పలు ప్రధాన కేసుల్లో నేరగాళ్లను సీసీ కెమెరా సాయంతో పట్టుకున్నారు.

ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన గద్వాలకు చెందిన తేజేశ్వర్ హత్య కేసును ఛేదించడంలో కర్నూలు జిల్లా పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాలు కీలకంగా మారాయి.

గతంలో మ్యాట్రిక్ సంస్థ ఏర్పాటు చేసినవి : 722

కర్నూలు నగరం, ఆదోని పట్టణంలో ప్రత్యేకంగా ఏర్పాటైనవి : 221 సీసీ కెమెరాలు

పోలీసు స్టేషన్‌లలో అమర్చినవి : 405

ఫ్యాక్షన్, సున్నిత, సమస్యాత్మక గ్రామాల్లో : 227

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉన్నవి : 1,664

కొత్తగా ఏర్పాటు చేసినవి : 4985

# ట్రిపుల్ ఐటీ కళాశాల

కర్నూలు: కర్నూలు నగరంలో జగన్నాథగట్టుపై కొలువుదీరిన ట్రిపుల్ ఐటీ కళాశాల (డీఎం)లో సీట్లన్నీ భర్తీ అయ్యాయి. ఇక్కడ మొత్తం 332 సీట్లు ఉండగా ఈసారి ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 221 మంది ప్రవేశం పొందారు.. మిగిలిన 111 మంది ఇతర రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. అబ్బాయిలు 247 మంది, అమ్మాయిలు 85 మంది ఉన్నారు. జేఈఈ మెయిన్స్‌లో వచ్చిన ర్యాంకుల ఆధారంగా సీట్లు కేటాయిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణులైన 27 మంది విద్యార్థులూ ఇందులో చేరారు.

**డ్యూయల్ కోర్సులకు ఆదరణ**

కంప్యూటర్ సైన్స్‌లో 70, ఈసీఈ 60, మెకానికల్ ఇంజినీరింగ్ 60, ఎ.ఐ.లో 60 సీట్లు.. కంప్యూటర్ సైన్స్ డ్యూయల్ డిగ్రీ 20, ఈసీఈ డ్యూయల్ డిగ్రీ 20, మెకానికల్ డ్యూయల్ డిగ్రీ 20 చొప్పున సీట్లు ఉన్నాయి. వీటికి అదనంగా సూపర్ న్యూమరరీ కేటగిరీ కింద 22 మంది విద్యార్థులకు అవకాశం కల్పించారు.

కంప్యూటర్ సైన్స్‌లో 37,649, ఈసీఈలో 49,973 ర్యాంకు లోపు, మెకానికల్ 65,720, ఏఐలో 46,086 ర్యాంకు లోపు వచ్చినవారు



సీట్లు పొందగలిగారు. ఏఐలో 64 మంది, సీఎస్ 90, ఈసీఈ 88, మెకానికల్‌లో 90 మంది విద్యార్థులు చేరారు.

**నార్వేలో చదువుకొనే అవకాశం**

జగన్నాథగట్టుపై 151 ఎకరాల్లో రూ.254 కోట్లతో కళాశాల నిర్మించారు. ప్రతి కోర్సులో ఆయా రంగాలకు చెందిన పలు ఉపకరణాల డిజైన్, తయారీలకు సంబంధించిన నైపుణ్యాలపైనా విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పలు ఉపకరణాల తయారీపై అవగాహన కల్పించడం ఈ సంస్థ ప్రత్యేకత.

నార్వే దేశ విశ్వవిద్యాలయంతో ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో ఎలాంటి అదనపు రుసుం లేకుండానే విద్యార్థులు నార్వేలో ఆరు నెలల నుంచి ఏడాదిపాటు చదువుకునే అవకాశం కల్పిస్తున్నారు.

బీటెక్ చదువుతూ ఎంబీఏ చేయొచ్చు

బీటెక్ చేసిన తర్వాత ఐఐఎంలో ఎంబీఏ చేసేందుకు పలువురు విద్యార్థులు ఆసక్తి చూపుతుంటారు. ఈ నేపథ్యంలో బీటెక్‌తోపాటు ఎంబీఏ చదువుకునేలా ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. రెండేళ్ల ఎంబీఏ కోర్సులో ఏడాది కోర్సు ఇంజినీరింగ్ చదువుతూనే పూర్తి చేయొచ్చు. ఐఐఎం సీటు కోసం ప్రత్యేకంగా మరో పరీక్ష రాయాల్సిన అవసరం లేదు. ఇంజినీరింగ్‌తోపాటు ఒక సంవత్సరం ఎంబీఏ పూర్తి చేసిన తరువాత సర్టిఫికెట్ ఇస్తారు. ఎంబీఏ రెండో సంవత్సరం కోర్సును విద్యార్థులు తమకు నచ్చిన సమయంలో ఎప్పుడైనా పూర్తిచేసుకునే వెసులుబాటు కళాశాలలో ఉందని ప్రవేశాల విభాగం ఇన్‌ఛార్జి ఆచార్య కృష్ణనాయక్ తెలిపారు. సీట్లు పొందిన సీఎస్ విద్యార్థులు ఈనెల 21న, మెకానికల్, ఏఐ విద్యార్థులు 22న, ఈసీఈ విద్యార్థులు 23న తమ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాల్సి ఉంది. సమగ్ర వివరాలను సంస్థ అంతర్జాల చిరునామా లో అందుబాటులో ఉంచామన్నారు.

# అంతర్గతదారులంటే.. అంత చులకనా!!

గురుద్వారా : ఒక్కసారిగా చూస్తే భూకంపం వచ్చిందా... భూమి రెండుగా చీలిపోయిందా అన్నట్లు ఉంటుందక్కడ. అడుగేస్తే రాళ్లు గుచ్చుకుపోతాయి. జాగ్రత్తగా రోడ్డుపక్కనే వెళ్దామంటే వాహనాల చక్రాల రాపిడికి గాల్లో లేచొచ్చి తూటాల్లా తగులుతాయి. పగలు దారిని చూసుకుంటూ ద్విచక్ర వాహనంపై నెమ్మదిగా వెళ్లినా..ఎక్కడో ఒక చోట అదుపు తప్పి పడిపోయేంత దారుణం. రాత్రి వేళల్లోనైతే ముచ్చెమటలు పడతాయి. చిన్నారులు, వృద్ధులు తప్పనిసరై ఇటుగా వస్తే గుండెలు చేత్తో పట్టుకోవాల్సిందే. ఇంత భయానక పరిస్థితికి కారణమైన దారి ఎక్కడో కాదు...విశాఖ నగరంలో ఉంది. సీతమ్మధార వుడా కాంప్లెక్స్ సమీపం నుంచి టీపీటీ కాలనీ ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనుల నిమిత్తం రెండు నెలల కిందట తవ్వేశారు. తరువాత గోతులు పూడ్చేందుకు కంకర రాళ్లు వేసి చదును చేయకుండా చేతులు దులిపేసుకున్నారు. పూర్తిగా పనులు కూడా చేయకపోవడంతో నిత్యం వందలాది మంది వణికిపోతూ ముందుకు సాగుతున్నారు. ఇంతగా సమస్య వేధిస్తున్నా




స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ప్రధాన రహదారులను బాగు చేస్తున్న అధికారులు.. అంతర్గతమార్గాలు దారుణంగా మారినా విస్మరించడంపై విమర్శలొస్తున్నాయి.


**కాపాడాలని వచ్చే.. గోతిలో చిక్కే**

ఆపద సమయంలో కాపాడేందుకు వచ్చిన అంబులెన్సు గోతిలో కూరుకుపోయి ముందుకు కదల్లేకపోయింది. విశాఖ నగరంలోని సుజాతనగర్ సమీప వెంకటాద్రినగర్ రెండో వీధిలో ఉంటున్న ఓ వ్యక్తి ఆరోగ్యం విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున కుటుంబసభ్యులు ఫోన్ చేయగా 108 వాహనం వచ్చింది. అయితే... ఇంటి సమీపంలో అధ్వానంగా ఉన్న మట్టి రోడ్డులోని గోతిలో అది కూరుకుపోయింది. ఎంత ప్రయత్నించినా బయటకు రాలేదు. దీంతో బాధితుడిని కుటుంబ సభ్యులు కారులో ఆసుపత్రికి తరలించారు. కొన్నేళ్లుగా గోతులమయంగా మారిన రోడ్డులో నిత్యం నరకం అనుభవిస్తున్నామని కాలనీ వాసులు వాపోయారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సులు కూడా రాలేకపోతే ప్రజల ప్రాణాలకు భరోసా ఎక్కడుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గోతుల దారులను బాగు చేయాలని కోరుతున్నారు.

# భూములు కొనరు.. బాధలు కనరు..

భీమవరం : 'అప్పులు పుట్టక, సాగుకు అవసరమైన ఖర్చుల కోసం ఎక్కువ వడ్డీకి బయట నుంచి అప్పులు తెస్తున్నాం. భూమి అమ్మకాలు కొనుగోళ్లు లేక పిల్లల పెళ్లిళ్లు, చదువులకు ఇబ్బందులొస్తున్నాయి. నిషేధిత జాబితాలో ఉండటంతో సగం ధర కూడా రావడం లేదు'. ఇవీ జిల్లాలో ఇనామ్ భూముల రైతుల ఆవేదన. జీవనోపాధికి కేటాయించిన భూములపై 2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చినా గత వైకాపా ప్రభుత్వం విస్మరించడంతో అవసరానికి ఆసరాగా లేకుండా పోయాయి. జిల్లాలో పెంటపాడు, ఉమామహేశ్వరం, కాళీపట్నంలలో సుమారు 8500 ఎకరాల ఇనామ్ భూములున్నాయి. వీటి రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో భూవిలువ మదింపు లేకపోవడంతో కుటుంబ అవసరాల కోసం ఉన్న భూములను మార్కెటు ధర కంటే తక్కువకు విక్రయిస్తున్నారు. మొగల్తూరు, పేరుపాలెం తదితర ప్రాంతాల్లో ఎకరం రూ.50 లక్షల నుంచి రూ.కోటి ధర పలుకుతుండగా పక్కనే ఉన్న ముత్యాలపల్లి, కాళీఫట్నం భూములకు రిజిస్ట్రేషన్ లేకపోవ డంతో ఎకరం రూ.30 లక్షల నుంచి 35 లక్షలకు విక్రయించాల్సి వస్తోంది. అవసరాన్ని సాకుగా చూపించి ఒక్కోసారి అనుకున్న ధర కూడా చెల్లించడం లేదని, ఆడపిల్లలకు పసుపు కుంకుమలుగా ఇచ్చిన భూములకు రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో భార్యాభర్తల మధ్య తగాదాలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వైకాపా నిర్లక్ష్యంతో..** రాజరిక, జమిందారీ వ్యవస్థ రద్దు కావడంతో 1956లో అప్పటి ప్రభుత్వం ఇనాం చట్టాన్ని తెచ్చి, అర్హులైన వారికి రైత్వారీ పట్టాలు మంజూరు చేసింది. తర్వాత 2013లో ప్రభుత్వం ఇనాం ల్యాండ్ రద్దు చట్టానికి సవరణ చేసింది. ప్రాస్పెక్టివ్‌కు బదులు రెట్రాస్పెక్టివ్ అని చట్టంలో పేర్కొనడంతో 1956 నుంచి 2013 వరకు జారీ చేసిన రైత్వారీ పట్టాల భూములు నిషిద్ధ జాబితాలోకి చేరాయి. సమస్యను పరిష్కరించడానికి



2019లో అప్పటి తెదేపా ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ఇనామ్స్(ఎబాలిషన్ అండ్ కన్వర్షన్ ఇన్‌టూ రైత్వారీ) అమెండ్‌మెంట ఆర్డినెన్స్-2019ని తెచ్చింది. దీని ప్రకారం 1957 నుంచి 2013 మధ్య ఇచ్చిన పట్టాలు ప్రాస్పెక్టివ్(చెల్లుబాటు) కావాలి. ఈ అంశం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందినది కావడంతో చట్ట సవరణకు కేంద్రం ఆమోదించింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఫలితంగా వేల మంది వారికి సంక్రమించిన ఇనాం భూములను అవసరాలకు అమ్ముకోలేక ఇబ్బందులు పడుతున్నారు. విషయం ప్రభుత్వం దృష్టిలో ఉంది, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటుందని డీఆర్వో వెంకటేశ్వరరావు తెలిపారు. 'కాళీపట్నంలో 70 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నాం. పట్టాదారు పాస్‌బుక్, టైటిల్ డీడ్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. భూములున్నా పిల్లల చదువులకు, కుటుంబ అవసరాలకి అప్పులు చేయాల్సి వస్తోంది' అని రైతులు వాపోతున్నారు.

అమ్మాయి పెళ్లి చేసేందుకు ఉన్న ఎకరం భూమిని అమ్మేందుకు ప్రయత్నించగా నిషిద్ధ జాబితాలో ఉండటంతో తక్కువకు అడిగారు. కుదవ పెడదామన్నా, బ్యాంకు రుణం కోసం ప్రయత్నించినా ఫలితం లేదు. అధిక వడ్డీకి అప్పు తెచ్చి అమ్మాయి వివాహం చేశాను' అని ఉమామహేశ్వరానికి చెందిన శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు.

# 100 రోజులు.. రూ.1952 కోట్లు



అనంతపురం : ఉమ్మడి అనంత జిల్లా హంద్రీనీవా సుజల స్రవంతి(హెచ్ఎన్ఎస్ఎస్) ప్రాజెక్టులో ఇదొక రికార్డు. వంద రోజుల్లో నిర్దేశిత లక్ష్యాన్ని చేధించడం విశేషం. రూ.19,52 కోట్ల అంచనా వ్యయంతో పనులు పూర్తి చేసిన చరిత్ర ఇది. కూటమి ప్రభుత్వం సాధించిన ఘన విజయంగా నమోదైంది. సీమ జిల్లాలకే తలమానికమైన హంద్రీనీవా ప్రధాన కాలువలో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. తొలి దశలోనే కాదు.. రెండో దశ ప్రధాన కాలువలోనూ కృష్ణా జలాల ప్రవాహం వేగంగా ముందుకు సాగుతోంది. పుంగనూరు ఉప కాలువకు (పీబీసీ) రెండు రోజుల క్రితమే నీటి విడుదల చేశారు. త్వరలోనే మడకశిర ఉప కాలువకు (ఎంబీసీ) నీరు ఇవ్వనున్నారు. ఇదే క్రమంలో అనంత, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలో ఎక్కడికక్కడి చెరువులను నింపే కీలక ప్రక్రియకు శ్రీకారం చుడుతున్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పనులు వేగంగా పూర్తి చేశామని.. సాఫీగా నీటి ప్రవాహం సాగుతోందని హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజా స్వరూప్‌కుమార్ పేర్కొన్నారు.

**సరిహద్దులో 2,170 క్యూసెక్కులు**

గత నెల 17న నంద్యాల జిల్లా మల్యాల పంప్‌హౌస్ నుంచి హంద్రీనీవాకు నీటి విడుదల మొదలైంది. ప్రస్తుతం అక్కడ 2,818 క్యూసెక్కుల మేర ఎత్తి పోస్తున్నారు. అనంత జిల్లా సరిహద్దుకు 2170 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. తొలి దశ ప్రధాన కాలువ పరిధిలో ఉన్న జీడిపల్లి జలాశయానికి ఇప్పటి దాకా 4.537 టీఎంసీలు చేరాయి. ప్రస్తుతం 1,822 క్యూసెక్కుల ప్రవాహం చేరుతోంది. గడిచిన ఇరవై రోజుల్లో ఏకంగా 3.683 టీఎంసీలు పీఏబీఆర్‌కు ఇవ్వడం రికార్డు. ఈ జలాశయానికి ఇప్పటికీ 1,782 క్యూసెక్కులు పారుతున్నాయి. జీడిపల్లి జలాశయం నుంచి రెండో దశ ప్రధాన కాలువకు ఈనెల 17న నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా ఇక్కడి నుంచి 787 క్యూసెక్కుల మేర ప్రవహిస్తున్నాయి. అదే రోజు చెర్లోపల్లి నుంచి పీబీసీకి నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం 330 క్యూసెక్కులు వెళ్తున్నాయి.

# రూ.అరకోటి సామగ్రి ఆరుబయటే



హిందూపురం : శ్రీకంఠపురంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం (ఐటీఐ)లో గదుల కొరతతో దాదాపు రూ.అరకోటి విలువైన సామగ్రి నిరుపయోగంగా ఉంది. ఈ ఫర్నీచర్ ఎండకు ఎండి, వానకు తడుస్తుండటంతో త్వరగా పాడైపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి. 2008లో ప్రారంభమైన పారిశ్రామిక శిక్షణా కేంద్రం పట్టణంలోని శాంతినగర్‌లో అద్దె భవనంలో కొనసాగేది. అక్కడి నుంచి లేపాక్షి సమీపంలో వీజెడ్‌పీ ఉన్నత పాఠశాల వద్ద ఉన్న బీసీ బాలుర వసతి గృహంలోకి మార్చారు. మడకశిర, పెనుకొండ నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులకు దూరం కావటంతో గత సంవత్సరం డిసెంబరులో మళ్లీ పట్టణంలోని శ్రీకంఠపురంలో ఉన్న ఝాన్సీలక్ష్మీబాయి పాఠశాలలోకి తరలించారు.

**నాలుగు గదులే కేటాయింపు**

ఝాన్సీలక్ష్మీబాయి పాఠశాలలోని 4 గదులు ఐటీఐకి కేటాయించగా అవి కనీసం తరగతుల నిర్వహణకు సైతం సరిపోవటం లేదు. దీనివలన విద్యార్థులు కూర్చొనే గదుల్లో సగం గది వరకు ఫర్నీచర్ ఉంచారు. దీనివలన విద్యార్థులు తరగతి గదిలో కూర్చోవాలన్నా, పాఠాలు బోధించేందుకు అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. అందువలన ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకొని ఐటీఐ కళాశాలకు విశాలభవనం సమకూర్చాల్సిన అవసరం ఉంది. లేదంటే ఈ ఫర్నీచర్ దెబ్బతినే అవకాశం ఉంది.

**ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లాం**

మురళీధర్, ఐటీఐ ప్రిన్సిపల్

ఐటీఐ కళాశాల నిర్వహణకు సరిపడే భవనం కావాలని ఎమ్మెల్యే బాలకృష్ణ దృష్టికి తీసుకెళ్లాం.. నిధులు మంజూరు చేయిస్తామని, అంతవరకు తరగతుల నిర్వహణకు షెడ్లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు.

# తెలిసి ఆత్రం.. కలిసి కుతంత్రం!!



విశాఖపట్నం : ఓ లేఅవుట్ మధ్యలో ప్రభుత్వ పోరంబోకు స్థలంలో రోడ్డు ఉంది. ఆ రోడ్డుపైనా కొందరు నకిలీ ప్లాట్ల నెంబర్లు, నకిలీ రెవెన్యూ సర్వే నెంబరుతో పాగా వేశారు. అధికారుల అండదండలతో ఖాళీ స్థలాల పన్నులు (వీఎల్‌టీ) పొంది, ప్లాన్ అనుమతులు తీసుకుని నిర్మాణాలు సైతం చేపట్టారు. ఈ ప్రభుత్వ భూమి విలువ అక్షరాలా రూ.10 కోట్ల పైమాటే. ఈ తతంగమంతా సాగటానికి ప్రణాళిక విభాగంలోని ఓ కీలక అధికారి వ్యూహాలే కారణమని సమాచారం.

**అలా ప్లాట్లుగా:** జీవీఎంసీ 8వ వార్డులో హిందుస్థాన్ షిప్ యార్డు లేఅవుట్ ఫేజ్1, 2 కింద ప్లాట్లు అభివృద్ధి చేశారు. సర్వే నెంబరు 301లో ప్రభుత్వ రాస్తా(రోడ్డు) కింద 55 సెంట్లు లేఅవుట్‌లో ఉంది. ఈ రోడ్డు 650 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో ఉన్నట్లు రికార్డుల్లో ఉంది. అయితే.. దారిని ఒక్కొక్కటి 267 గజాల చొప్పున ఆరు ప్లాట్లుగా కొందరు మార్చారన్న ఆరోపణలున్నాయి. ఇందులో ఒక ప్లాటులో భవన నిర్మాణం జరిగిపోగా, మరో స్థలంలో నిర్మాణం తుది దశలో ఉంది. మిగిలిన నాలుగు ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి.

**నకిలీ బాగోతం వెలుగులోకి:** ప్రభుత్వ దారికి ఒకవైపు ప్లాట్ నెంబరు 210, మరోవైపు 211 ప్లాట్ నెంబర్లు ఉండగా మధ్యలోని పోరంబోకు భూమికి 211ఏ పేరుతో నకిలీ ప్లాటు సృష్టించారు. 2024లో ఈ ప్లాట్‌కు వీఎల్టీ (ఖాళీ స్థలం పన్ను) కోసం జీవీఎంసీని ఆశ్రయించారు. అప్పటి జీవీఎంసీ సర్వేయర్ సైతం ఇది జిరాయితీ భూమిగా నివేదిక ఇచ్చారు. దీంతో రెవెన్యూ విభాగ అధికారులు ఖాళీ స్థలం పన్ను విధించారు. ఆ తర్వాత 211ఏ నకిలీ ప్లాటులో ప్లాన్ కోసం దరఖాస్తు చేశారు. అప్పటి ప్లానింగ్ సెక్రటరీ, ఇన్‌ఛార్జి అడ్మిన్‌గా ఉన్న ఓ అధికారి ఈ దస్త్రాలు ముందుకు కదిపారు. మధురవాడ జోన్-2 ఏసీపీగా తాజాగా బాధ్యతలు చేపట్టిన శాస్త్రి శబ్బాన్, డీసీపీలు నాడు ఆమోద ముద్ర వేశారు. ఈ భవన నిర్మాణం ప్రస్తుతం పూర్తి దశలో ఉండగా నకిలీ బాగోతం వెలుగులోకి వచ్చింది. **అందులో ప్రభుత్వ భూమిగానే:** నకిలీ సర్వే నెంబరు, ప్లాటు నెంబరు సృష్టించారన్న ఆరోపణల నేపథ్యంలో ఇటీవల మధురవాడ నుంచి బదిలీపై వెళ్లిన ఏసీపీ తిరుపతిరావు ఆ ప్లాటు సర్వే చేయాలని టౌన్ సర్వేయర్‌ను ఆదేశించారు. ఆ నివేదిక వచ్చింది. ఇందులో వివాదాస్పదమైన ప్లాటు నెంబరు 211ఏ.. అనుమతులిచ్చిన లేఅవుట్ సర్వే నెంబర్లలో లేదని, ప్రభుత్వ పోరంబోకు రాస్తా (దారి)గా సర్వే నెంబరు 301లో ఉందని నివేదిక ఇవ్వడంతో అక్రమాల బాగోతం నిజమేనని తేలింది. తాజాగా సర్వేయర్ ఇచ్చిన నివేదిక ఆధారంగా కొన్ని ప్లాట్లు ప్రభుత్వ భూమిలో ఉన్నాయన్నారు. ఈ రాస్తా స్థలాలను స్వాధీనం చేసుకుని, అక్రమ నిర్మాణాలు కూల్చేయాలని పలువురు కోరుతున్నారు.

# వదిలేశారు.. ముంచేశారు

ఉండి: డెల్టా ఆధునికీకరణకు శ్రీకారం చుట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం పదేళ్లు పాలించినా.. సగం పనులను కూడా పూర్తి చేయలేకపోయింది. అప్పటి పాలనను గుర్తు చేసింది వైకాపా ప్రభుత్వం. అభివృద్ధి మాట ఎలా ఉన్నా.. కాలువల నిర్వహణ (ఓఅండ్ఎం) పనులకూ నిధులివ్వలేదు. ఆ కారణంగానే వర్షం వస్తే చాలు ఎక్కడ వరిచేలు ముంపుబారిన పడతాయో..? ఎక్కడ ఏ కాలువ గట్టు కొట్టుకుపోతుందోననే ఆందోళన అన్నదాతలను వెంటాడుతోంది. డెల్టాలో 29 మండలాల్లో 3.29 లక్షల ఎకరాల్లో వరి, మరో 2 లక్షల ఎకరాల్లో చేపలు, రొయ్యల చెరువులున్నాయి. వరికి ఎకరానికి రూ.350, ఆక్వాకు రూ.500 చొప్పున



ఏడాదికి రూ.21.51 కోట్ల నీటితీరువా వసూళ్లు కావాలి. సాగు, మురుగు కాలువల నిర్వహణ పనులకు ఏడాదికి రూ.22-23 కోట్ల వరకు నిధులు కేటాయించాలి. భూరీసర్వే పేరుతో వైకాపా ప్రభుత్వం వీటి వసూళ్లను గత మూడేళ్లు నిలిపేసింది. 2023 వేసవిలో ఆ నిధుల కోసం ఆర్నెళ్లు జల వనరుల శాఖ బ్యాంకు ఖాతాల్లో వెతికినా చిల్లిగవ్వ లేదు. దీంతో ఆ ఏడాది కాలువల్లో పూడికతీత, గట్లు పటిష్టపరచడం, లాకులు, వియర్ల పునర్ని ర్మాణం తదితర పనుల వైపు కన్నెత్తి చూడలేదు. కూటమి ప్రభుత్వం కాలువల ప్రక్షాళన నూరుశాతం చేయగలిగితేనే వ్యవసాయానికి మనుగడ.

# ఆపలేమా దోమ కాటు

బుట్టాయగూడెం : మలేరియా, డెంగీ జ్వరాల వ్యాప్తికి కారకాలైన దోమల కాటు నుంచి రక్షణ పొందేందుకు వినియోగించే దోమ తెరల కోసం మన్యం గ్రామాల్లో ఎదురు చూస్తున్నారు. 2017లో అప్పటి తెదేపా ప్రభుత్వం 2.50 లక్షల దోమ తెరలను పంపిణీ చేసింది. అప్పట్లో మన్యంలోని మండలాలతో పాటు సమీపాన ఉన్న కొయ్యలగూడెం, టి.నరసాపురం, గోపాలపురం మండలాల్లో వీటిని అందజేశారు. ఆ తరువాత నాలుగేళ్ల కిందట మరో 2.50 లక్షలు పంపిణీ చేశారు. ప్రభుత్వం పంపిణీ చేసే దోమ తెరలను ప్రత్యేకించి తయారు చేస్తారు. దారంలోనే రసాయనాలను కలిపి తెరలను రూపొందిస్తారు. దీంతో తెరల మీద వాలే దోమ నశిస్తుంది. మనిషికి ఎటువంటి హానీ కలగదు. థైవాన్ వంటి దేశాల్లో తయారైన వీటిని మన దేశానికి దిగుమతి చేసుకుంటున్నారు.

**పెరుగుతున్న కేసులు..** ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున దోమల వ్యాప్తి పెరుగుతోంది. అదే రీతిన మలేరియా కూడా విజృంభిస్తోంది. కేసుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. దోమ తెరలు పంపిణీ చేస్తే దోమల కాటు నుంచి తప్పించుకునేందుకు ఎంతో ఉపయోగపడతాయని పలువురు కోరుతున్నారు. గతంలో ఇచ్చిన దోమ తెర తమకు బాగా ఉపయోగపడిందని చింతలగూడేనికి చెందిన మాల్చి మల్లేశ్వరి తెలిపారు. దోమ తెరల కోసం ప్రతిపాదనలు పంపామని, రాగానే పంపిణీకి చర్యలు తీసుకుంటామని జిల్లా మలేరియా నివారణాధికారి పీఎస్ఎస్ ప్రసాద్ తెలిపారు.

**మన్యంలో మలేరియా సమస్యాత్మక గ్రామాలు:** 153 (వీటిలో బుట్టాయగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లో 117, విలీన మండలాల్లో 36)ఈ ఏడాది ఇంతవరకు జిల్లాలో నమోదైన మలేరియా కేసులు: 638 (వీటిలో మైదాన ప్రాంతంలో కేవలం 12 కేసులు కాగా.. మిగిలినవన్నీ మన్యంలోనే నమోదయ్యాయి)

# సముద్ర తీరం... ప్రగతి హారం!

ఒంగోలు: మత్స్య ఉత్పత్తుల ఎగుమతిలో కీలకమైన ఫిషింగ్ హార్బరు నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ఉన్నతాధికారుల బృందాలు కొత్తపట్నం మండలం కె.పల్లెపాలెం గ్రామాన్ని పరిశీలించాయి. దాదాపు ఈ గ్రామ పరిధిలోనే హార్బరు నిర్మించేందుకు సానుకూలత వ్యక్తం చేశాయి. దీని నిర్మాణం పూర్తయితే సముద్రతీర ప్రాంతంలో హార్బరుకు అనుబంధంగా మరిన్ని పరిశ్రమలు ఏర్పాటై యువతకు ఉపాధి దొరుకుతుంది.


జిల్లాలో అయిదు మండలాల పరిధిలో 50 కిలోమీటర్ల మేర సముద్ర తీరం విస్తరించి ఉంది. ప్రస్తుతం సముద్రంలో చేపల వేటకు అవస్థలు తప్పడం లేదు. వేటలో చేపలు చిక్కినా, చిక్కకున్న బోటు సముద్రం లోపలికి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా రోజుకు కనీసం రూ.600 వరకు వెచ్చించాల్సి వస్తోంది. తుపాన్లు, అల్పపీడనం పరిస్థితుల్లో భారీ అలలు ఉన్నప్పుడు బోటు మరమ్మతులకు గురికావడంతో ప్రమాదాలు తలెత్తు తున్నాయి. ఫిషింగ్ హార్బరు అందుబాటులోకి వస్తే బోట్లు నిలుపుకొనేందుకు జెట్టీ (ప్లాట్‌ఫాం) ఏర్పాటై ఇబ్బందులు తప్పుతాయి. వేటకు భారీ బోట్లు వినియోగించే అవకాశం రావడంతో పల్లెకారులకు మత్స్య సంపద పెరుగుతుంది.

జిల్లావే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బోట్లు ఇక్కడ నిలుపుకొనే అవకాశం ఉంటుంది. దాదాపు వెయ్యి బోట్లు మేర నిలుపుకొనేవిధంగా జెట్టీ నిర్మించనున్నారు. బోటులో నుంచే సరకు నేరుగా లారీలకు ఎగుమతి చేసేందుకు వీలవుతుంది. హార్బరులోనే చేపల విక్రయాలకు అవకాశం ఉండడంతో వ్యాపారం వృద్ధి చెందుతుంది. హార్బరు నిర్మాణం చేపల వేటకు కొండంత అండగా నిలుస్తుందని జిల్లా మత్స్య కార కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు పేరయ్య చెబుతున్నారు.

ఫిషింగ్ హార్బరు ఏర్పాటైతే చేపల ఎగుమతులకు సంబంధించి వాటిని నిల్వ చేయడం, ప్యాకింగ్, రవాణా రంగాలు కీలకం. హార్బరుతో మత్స్య సంపద పెరిగి వాటికి అనుబంధంగా తీర ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటవుతాయి. చేపల ప్రాసెసింగ్ యూనిట్లు పెట్టడంతో పాటు ఎండు చేపల ఉత్పత్తి పెరుగుతుంది. వ్యాపార లావాదేవీలు పెరిగి ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయి. కె.పల్లెపాలెంలో అధ్యయనం చేసిన బృందాలు హార్బరు నిర్మాణంపై సానుకూలమైన నివేదిక ఇవ్వనున్నాయని మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పేర్కొన్నారు. మత్స్యకారులకు హార్బరు ఏర్పాటు చేసి తీరతామన్నారు. హార్బరు నిర్మాణం కోసం కొత్తపట్నం మండలంలోని పలు గ్రామాలు పరిశీలించారు. కె.పల్లెపాలెం బాగుంటుందని మత్స్యకారులు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు సూచించడంతో ఆ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. హార్బరు నిర్మాణానికి సాంకేతిక అడ్డంకులు తొలగిపోతే భూ సేకరణకు తాము సిద్ధంగా ఉన్నామని సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూమిని ఇస్తామని, అవసరాల మేరకు ప్రైవేటుగా భూసేకరణ చేపడతామన్నారు.

## గ్లామర్ లుక్ లో జాన్వీ కపూర్.. ఆ ఫోజ్ చూశారా?

బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ అతిలోకసుందరి అందాల తార దివంగత నటీమణి శ్రీదేవి కూతురుగా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది.'ధడక్ 2' సినిమాతో తనకంటూ ఒక ఇమేజ్ సొంతం చేసుకున్న ఈమె.. ఒకవైపు హీరోయిన్ గా నటిస్తూనే మరొకవైపు పలు ఉత్పత్తులకు బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరిస్తూ మరింత పాపులారిటీ సొంతం చేసుకుంది. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులను ఆకట్టుకునే ప్రయత్నం చేసిన ఈ చిన్నది.. అతి తక్కువ సమయంలోనే బాలీవుడ్లో అత్యధిక పారితోషకం తీసుకునే నటీమణిగా ఎదిగింది. ఒకవైపు తల్లి స్టార్డంను అనుభవిస్తూనే.. మరొకవైపు తన తండ్రి పలుకుబడిని కూడా ఈమె బాగా ఉపయోగించుకుంటుందనే వార్తలు కూడా వినిపిస్తూ ఉంటాయి. అటు బోనీకపూర్ బడా నిర్మాతగా ఇండస్ట్రీలో పలు చిత్రాలు నిర్మిస్తూ భారీ సక్సెస్ అయ్యారు. కూతురు విషయంలో ఆమెకు అండగా ఉంటూ



మరింత ప్రోత్సహిస్తున్న విషయం తెలిసిందే. అలా తల్లి ఇమేజ్.. తండ్రి ప్రోత్సాహంతో ఇండస్ట్రీలో మరింతగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్న ఈ ముద్దుగుమ్మ.. అటు బాలీవుడ్ లోనే కాకుండా ఇక్కడ టాలీవుడ్ లో కూడా వరుస సినిమాలు ప్రకటిస్తూ దూసుకుపోతోంది. అందులో భాగంగానే తన తల్లి కోరిక మేరకు తన తొలి తెలుగు చిత్రాన్ని సీనియర్ ఎన్టీఆర్ వారసుడు జూనియర్ ఎన్టీఆర్ తో సినిమా చేసి తన తల్లి కలను నెరవేర్చింది. అలా కొరటాల శివ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా వచ్చిన 'దేవర' సినిమా ద్వారా తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది జాన్వీ కపూర్. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఇందులో గ్రామీణ ప్రాంత అమ్మాయిగా నటించి మరింతగా మెస్మరైజ్ చేసింది. ఈ సినిమా తర్వాత ప్రముఖ డైరెక్టర్ బుచ్చిబాబు సన దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' సినిమాలో కూడా అవకాశాన్ని అందుకుంది ఈ ముద్దుగుమ్మ. అంతేకాదు నాని సినిమాలో కూడా జాన్వీ కపూర్ హీరోయిన్గా నటిస్తున్నట్లు సమాచారం. ఇటీవలే బాలీవుడ్లో 'పరమ్ సుందరి' అంటూ ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈమె ఇప్పుడు 'సన్నీ సర్కారీకి తులసి కుమారి' అనే సినిమాలో నటిస్తోంది. నిన్న ఈ సినిమా నుండి ట్రైలర్ విడుదల చేయగా దీనికి కూడా విశేష స్పందన లభించింది.

## నిధి అగర్వాల్ సాంగ్ అందుకే పెట్టలేదు

ఒకప్పుడు కథ ఎలా ఉన్నా సాంగ్స్ చూడ్డానికైనా ఆడియన్స్ థియేటర్లకు వచ్చేవారు. కానీ ఇప్పుడు సినిమా రన్ టైమ్ ఎక్కువ అవుతుందని, పాటలు కథను డిస్టర్బ్ చేస్తున్నాయని హిట్ పాటలను సైతం ఎడిటింగ్ లో తీసేస్తున్నారు. సినిమాకు అసలు హైప్ తీసుకొచ్చిన సాంగ్సనే మేకర్స్ డిలీట్ చేయడం ఆడియన్స్ ను నిరుత్సాహ పరుస్తున్నప్పటికీ, ఆ పాటలు మూవీలో ఉంచితే ఫ్లో దెబ్బతింటుందనేది మేకర్స్ ఉద్దేశం. రీసెంట్ గా పలు సినిమాల విషయంలో ఇదే జరగ్గా ఇప్పుడు మిరాయ్ సినిమా విషయంలో కూడా అదే జరిగింది. తేజ సజ్జ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో తెరకెక్కిన మిరాయ్ సినిమా రీసెంట్ గా రిలీజై ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ ను అందుకుని బ్లాక్‌బస్టర్ దిశగా దూసుకెళ్తుంది. అయితే ఈ సినిమా చూసిన ఆడియన్స్ అందరూ పాటలు లేకపోవడం గురించి మాట్లాడుకుంటున్నారు.

**ఎడిటింగ్ లో తీసేసిన వైబ్ ఉంది సాంగ్...** మిరాయ్ మూవీ నుంచి మేకర్స్ ఫస్ట్ సింగిల్ పేరిట రిలీజ్ చేసిన వైబ్ ఉంది సాంగ్ మంచి హిట్టైంది. తేజ సజ్జాతో పాటూ రితికా నాయక్ కలిసి ఆ సాంగ్ లో



వేసిన స్టెప్పులు అందరినీ అలరించాయి. కానీ సినిమా రిలీజయ్యాక ఆ సాంగ్ అందులో లేదు. కట్ చేశారు. కథకు అడ్డమొస్తుందని వైబ్ ఉంది సాంగ్ ను మేకర్స్ తీసేశారు. ఆ పాటతో పాటూ మరో పాటను కూడా మేకర్స్ మిరాయ్ నుంచి తీసేశారు.

**నిధి అగర్వాల్ తో స్పెషల్ సాంగ్..** మిరాయ్ సినిమాలో ఇస్మార్ట్ భామ నిధి అగర్వాల్ ఓ స్పెషల్ సాంగ్ చేశారు. ఆ సాంగ్ ను డైరెక్ట్ గా థియేటర్లలోనే ఆడియన్స్ కు సర్‌ప్రైజ్ ఇవ్వాలనే ఆలోచనతో ముందుగా రిలీజ్ చేయలేదు. ఈ సాంగ్ కూడా కథకు అడ్డొస్తుందని తీసేశారని నెట్టింట టాక్ వినిపించగా, రీసెంట్ గా దానిపై డైరెక్టర్ కార్తీక్ ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చారు. నిధి అగర్వాల్ తో ఓ స్పెషల్ సాంగ్ ను షూట్ చేసిన విషయం నిజమేనని కానీ కొన్ని కారణాల వల్ల ఇందులో పెట్టడం కుదరలేదని ఒకవేళ సీక్వెల్ వస్తే అందులో ఈ సాంగ్ ను ఉపయోగించే అవకాశముందని కార్తీక్ చెప్పారు.




## చెమటలు పట్టించేస్తున్న 50ఏళ్ల బ్యూటీ




నేటి జెన్ జెడ్ ఫ్యాషనిస్టాలకైనా చెమటలు పట్టించే అందం, స్టైల్ మలైకా అరోరా సొంతం. 50 వయసులోను ఏజ్ లెస్ బ్యూటీగా మైమరిపిస్తోంది. ఈ బ్యూటీ ఫ్యాషన్ సెన్స్, ఆరోగ్యంపై అవగాహన ఎప్పుడూ చర్చనీయాంశమైనది.కెమెరా ముందు ఎనర్జిటిక్ పాత్రను పోషిస్తోంది. రియాలిటీ షో క్వీన్ గా మెరిసిపోతోంది.మలైకా అరోరా వయస్సు తో సంబంధం లేకుండా స్టైల్, గ్రేస్, ఆత్మవిశ్వాసంతో సరిహద్దులను చెరిపేసి పాపులరైంది.

ఈ బ్యూటీ నిరంతర ఉత్సాహం, ఆత్మ విశ్వాసం, షో స్టాపింగ్ అడ్వెంచర్స్ తో నిరంతరం యువతరంలో చర్చగా మారుతోంది. ఇప్పుడు మరోసారి మలైకా ఫ్యాషన్ సెన్స్ ని ఎలివేట్ చేసే ఫోటోషూట్ ఇన్ స్టాలో వైరల్ గా షేర్ అవుతోంది. మై మెనీ మూడ్స్ పేరుతో మలైకా తన మూడ్స్ అన్నిటినీ ప్రదర్శించే కొన్ని అరుదైన ఫోటోలను కూడా షేర్ చేసింది. వీటిలో మలైకా తన పప్పీ తో కలిసి యోగాభ్యాసం ప్రాక్టీస్ చేస్తున్న ఫోటోగ్రాఫ్, పూల్ లో స్పెషల్ గాగుల్స్ తో కనిపించిన ఫోటోగ్రాఫ్, ఫైవ్ స్టార్స్ లో ఆహారం స్వీకరించే విధానం ఇలా ప్రతిదీ ఫోటోల రూపంలో మలైకా షేర్ చేసింది. ఇప్పుడు అవన్నీ వైరల గా మారుతున్నాయి. తళుకుబెళుకుల లెహంగా సహా రకరకాల డిజైనర్ దుస్తుల్లో మలైకా ఫోజులు గుబులు పుట్టిస్తున్నాయి.

మలైకా ధరించిన బోల్డ్ గ్రీన్ సెట్ తనలోని ఎగ్జయిట్ మెంట్ పెంచే కోణాన్ని ప్రదర్శించింది. మహారాష్ట్ర -థానేలో 23 అక్టోబర్ 1973న జన్మించిన మలైకా అరోరా పాపులర్ నటి, నర్తకి, మోడల్, రియాలిటీ స్టార్. ఛయ్య ఛయ్య -మున్నీ బద్నామ్ హుయ్ లాంటి పాటలతో కెరీర్ ఆరంభమే మంచి పేరొచ్చింది. ఎంటీవీ VJగా ప్రారంభించి, అటుపై మోడలింగ్ లోను రాణించింది అనుష్క. ఈ బ్యూటీ ఇటీవల డ్యాన్స్ రియాలిటీ షోల జడ్జిగా అలరిస్తోంది. తన బోల్డ్ ఫ్యాషన్ సెన్స్, ఫిట్‌నెస్ తో అందరి దృష్టిని ఆకర్షించింది.

## రామ్ చరణ్ దసరా కానుక ఇదే



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా ఉప్పెన బుచ్చిబాబు పెద్ది సినిమాను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. గేమ్ ఛేంజర్ డిజాస్టర్ ఫలితం తర్వాత చరణ్ ఎంతో శ్రద్ధాసక్తులతో పని చేస్తున్న చిత్రమిది. పెద్దిని విజయవంతమైన ప్రాజెక్ట్ గా మలిచేందుకు సర్వశక్తులు ఒడ్డి పని చేస్తున్నాడు. ప్రచారంలోను తగ్గేదేలే అంటూ టీమ్ సిద్ధమవుతోంది. పెద్ది సినిమా మొదటి పాటను దసరా కానుకగా విడుదల చేయడానికి టీమ్ సిద్ధమవుతోంది. 27 సెప్టెంబర్ మొదటి పాట విడుదలవుతుంది. అయితే ఈ పాట లాంచింగ్ డే చరణ్ జీవితంలో ప్రత్యేకతతో కూడుకున్న అంశం. యాథృచ్ఛికంగా 18 సంవత్సరాల క్రితం పూరి జగన్నాథ్ దర్శకత్వం లో చిరుత సినిమాతో చరణ్ తన నట జీవితాన్ని ప్రారంభించిన రోజు ఇది.

చరణ్ కెరీర్‌లో ఈ ప్రత్యేక మైలురాయిని మెగా ఫ్యాన్స్ సెలబ్రేట్ చేసే రోజుగా పెద్ది మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఆసక్తికరంగా ఇటీవల రెహమాన్ గురించి ప్రస్తావిస్తూ చరణ్, బుచ్చిబాబు టీమ్ ఈ పాట ట్యూన్ అద్భుతంగా కుదిరిందంటూ ప్రశంసించారు.క్రీడా నేపథ్య సినిమా ఆత్మను ఈ పాటలోకి తేవడంలో రెహమాన్ పనితనాన్ని టీమ్ ఆకాశానికెత్తేసింది. దీంతో మొదటి పాట రాక కోసం అభిమానులు ఎంతో ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. పెద్ది క్రీడా నేపథ్య కథతో రూపొందుతున్న ఆసక్తికర మల్టీస్టారర్ చిత్రం. చరణ్ తో పాటు, కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ కీలక పాత్రను పోషిస్తుండగా, శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తోంది. మిర్జాపూర్ నటుడు దివ్యేందు శర్మ ఇతర ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. వెంకట సతీష్ కిలారు ఈ చిత్రానికి నిర్మాత. క్రీడా నేపథ్య సినిమా కోసం భారీ బడ్జెట్ ని నిర్మాత ఖర్చు చేస్తున్నారు. 27 మార్చి 2026న సినిమా విడుదల కానుంది. ఈ సినిమాలో ప్రతి పాటా దేనికదే ప్రత్యేకంగా నిలిచేలా రెహమాన్ బాణీలు సిద్ధం చేస్తున్నారు. ఇక పాటలను విజువల్ గాను అద్భుతంగా తెరకెక్కించేందుకు బుచ్చిబాబు టీమ్ ప్లాన్ చేస్తోంది. ఇటీవల ఒక ఛాలెంజింగ్ పాట షూటింగ్‌ను రామ్ చరణ్ ముగించాడు.

సహజ లైటింగ్‌లో తన స్కిల్ తో మురిపించే ప్రఖ్యాత సినిమాటోగ్రాఫర్ రత్నవేలు ఈ పాటను అద్భుతమైన విజువల్ ట్రీట్ గా మలిచారని సమాచారం. స్పెషల్ నైట్ యాక్షన్ సీక్వెన్స్ ని కూడా ఇటీవల పూర్తి చేసారని టీమ్ తెలిపింది. సినిమాటోగ్రాఫర్ రత్నవేలు రామ్ చరణ్ అద్భుతమైన నటనను కూడా ప్రశంసించారు. ఈ చిత్రంలో యాక్షన్ పార్ట్ కోసం పుష్ప 2 ఫేం నబకాంత్ మాస్టర్ పని చేసారని కూడా టీమ్ వెల్లడించింది.

## మరో క్రేజీ ప్రాజెక్టును ఓకే చేసిన శివగామి

అందానికి అందం, అభినయానికి అభినయం ఉన్న నటీమణుల్లో రమ్యకృష్ణ కూడా ఒకరు. సౌత్ ఎవర్‌గ్రీన్ హీరోయిన్ గా ఆమె అందుకున్న క్రేజ్ అంతా ఇంతా కాదు. 55 ఏళ్ల వయసులో కూడా రమ్యకృష్ణ మరింత అందంగా కనిపిస్తూ, మంచి స్టార్‌డమ్ తో కెరీర్లో ముందుకెళ్తున్నారంటే అది అనుకున్నంత చిన్న విషయమేమీ కాదు. మామూలుగా హీరోయిన్లకు ఇండస్ట్రీలో ఎక్కువ కెరీర్ ఉండదంటుంటారు. కానీ రమ్యకృష్ణ దాన్ని తప్పని నిరూపించారు. నిరూపిస్తూనే వస్తున్నారు.

**బాహుబలితో మరింత పాపులర్...** బాహుబలి తర్వాత రమ్యకృష్ణ మరింత పాపులర్ అయ్యారు. ఇప్పటికీ ఒక్కో సినిమాకు రూ.3-4 కోట్ల రెమ్యూనరేషన్ తీసుకుంటూ తన మార్కెట్ ను పెంచుకుంటూ వెళ్తున్నారు. తన మార్కెట్, క్రేజ్ ను దృష్టిలో పెట్టుకుని రమ్యకృష్ణ చాలా సెలెక్టివ్ గా సినిమాను ఎంచుకుంటూ వస్తుండగా, ఇప్పుడు ఆమె మరో క్రేజీ ప్రాజెక్టును ఓకే చేసినట్టు కన్ఫర్మ్ అయింది. రీసెంట్



గా కొత్త లోక సినిమాతో నిర్మాతగా బ్లాక్‌బస్టర్ ను అందుకున్న మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్ తో దసరా, ది ప్యారడైజ్ నిర్మాతలు %ూూం% సినిమాస్ ఇటీవలే ఓ తెలుగు సినిమాను అనౌన్స్ చేసిన విషయం తెలిసిందే. ఆ సినిమాలో దుల్కర్ కు జోడీగా బుట్టబొమ్మ పూజా హెగ్డేను ఎంపిక చేసి, ఆ విషయాన్ని కూడా అధికారికంగా ప్రకటించారు. దుల్కర్ సల్మాన్ కెరీర్లో 41వ సినిమాగా తెరకెక్కనున్న ఈ సినిమాకు ఇప్పటికే మంచి హైప్ ఏర్పడగా ఈ సినిమా నుంచి మేకర్స్ మరో అనౌన్స్‌మెంట్ ఇచ్చారు. ఈ సినిమాలో ప్రముఖ నటి రమ్యకృష్ణ కూడా నటించనున్నారని తెలుపుతూ ఇవాళ ఆమె బర్త్ డే సందర్భంగా మేకర్స్ ఆ విషయాన్ని అనౌన్స్ చేస్తూ ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మరి ఈ సినిమాలో రమ్యకృష్ణ ఎలాంటి పాత్రలో నటించనున్నారనే విషయాలను మేకర్స్ త్వరలోనే అనౌన్స్ చేయనున్నారు. రవి నేలకుడిటి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాకు జీవి ప్రకాష్ సంగీతం అందిస్తున్నారు.

## జపనీగా మారిన మీనాక్షి.. గెటప్ అదుర్స్!

మీనాక్షి చౌదరి.. ప్రముఖ బ్యూటీగా పేరు సొంతం చేసుకున్న ఈ ముద్దుగుమ్మ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. తన అద్భుతమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటూ మరింత ఇమేజ్ సొంతం చేసుకున్న ఈ చిన్నది.. తాజాగా జపాన్ కి వెకేషన్ కి వెళ్ళిన విషయం తెలిసిందే. అక్కడినుండి పలు ఫోటోలను అభిమానులతో పంచుకున్న ఈమె తాజాగా జపనీగా మారి అందరి దృష్టిని ఆకట్టుకుంది. పైగా జపనీయులు ధరించే దుస్తులు ధరించి వారి గెటప్లో మరింత అందంగా కనిపించింది. జపనీలు ఎలా అయితే తమ గెటప్ తో అందరినీ ఆకట్టుకుంటారో.. మీనాక్షి చౌదరి కూడా పింక్ కలర్ డ్రెస్ ధరించి, అచ్చం వారిలాగే రెడీ అయ్యి.. అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం మీనాక్షికి సంబంధించిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఇకపోతే ఈ ఫోటోలను షేర్ చేస్తూ కింద క్యాప్షన్ కూడా జోడించింది ఈ ముద్దుగుమ్మ. తాజాగా ఇందుకు సంబంధించిన ఫోటోలను మీనాక్షి షేర్ చేస్తూ.. "నేను జపాన్ నుండి తిరిగి వచ్చేసాను. అయినా సరే జపాన్ నుండి ఎంతోమంది స్నేహితులను కూడా పొందగలిగాను. ఈ మొత్తం



ప్రయాణంలో నాకు అత్యంత ఇష్టమైన రోజును మీతో పంచుకోవాలనుకున్నాను. అందులో భాగంగానే జపాన్ లో ఎప్పుడు కిమోనోలో ఫోటోలు దిగాలి అని కలలు కనేదాన్ని. కానీ ఎట్టకేలకు దానిని సహకారం చేసుకున్నాను. "అంటూ మీనాక్షి చౌదరి చెప్పుకొచ్చింది. మొత్తానికి కల నెరవేరింది అంటూ తన సంతోషాన్ని అభిమానులతో పంచుకుంది ఈ ముద్దుగుమ్మ.. మీనాక్షి చౌదరి కెరియర్ విషయానికి వస్తే.. హర్యానాకు చెందిన ఈమె భారతదేశానికి చెందిన మోడల్ గా పేరు దక్కించుకుంది. పంజాబ్ లోని నేషనల్ డెంటల్ కాలేజ్ అండ్ హాస్పిటల్లో డెంటల్ సర్జరీ కోర్సు పూర్తి చేసిన ఈమె.. మయన్మార్ లో జరిగిన మిస్ గ్రాండ్ ఇంటర్నేషనల్ 2018 అందాల పోటీలలో పాల్గొని మొదటి రన్నరప్ గా నిలిచింది. ఇక తర్వాత 2018లో ఫెమినా మిస్ ఇండియా పోటీల్లో మిస్ గ్రాండ్ కిరీటాన్ని అందుకున్న ఈమె.. 2018 మిస్ ఇండియా పేజెంట్ టైటిల్ ని కూడా అందుకుంది. మీనాక్షి కెరియర్ విషయానికి వస్తే.. హిందీ సినిమా ద్వారా కెరియర్ ను ఆరంభించిన ఈమె 2021 లో 'ఇచ్చట వాహనములు నిలపరాదు' అనే సినిమాతో హీరోయిన్గా ఇండస్ట్రీకి పరిచయమైంది. మొదటి సినిమాలోనే పరవాలేదు అనిపించుకున్న ఈమె.. ఆ తర్వాత రవితేజ ఖిలాడి సినిమాలో నటించింది.. శైలేష్ కొలను హిట్ ఫ్రాంచైజీలో భాగంగా వచ్చిన 'హిట్: ది సెకండ్ కేస్' సినిమాలో అడివి శేషు సరసన హీరోయిన్గా నటించి మరింత పాపులారిటీ అందుకుంది.. గత ఏడాది గుంటూరు కారం, లక్కీ భాస్కర్, మట్కా, మెకానిక్ రాఖీ వంటి చిత్రాలలో నటించిన మీనాక్షి చౌదరి.. సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో తన ఖాతాలో మంచి విజయాన్ని వేసుకుంది. ఇప్పుడు విశ్వంభర సినిమాలో నటిస్తోంది.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536